సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+24+40 పేజీల ఆదివారం అనుబంధం   వెల: ₹ 6.00   సంపుటి: 10 సంచిక: 287

ఆదివారం 7-1-2018

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | KARIMNAGAR | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

SUNDAY Special



బ్యాట్‌తో.. బంతితో.. నిలిపాడు

-స్పోర్ట్స్‌లో



కుమారి హెబ్బా

-ఫ్యామిలీలో



1.42 కోట్ల ఎకరాలకు 'పెట్టుబడి'

ఎకరానికి రూ. 4 వేల చొప్పన సాయం అందజేయనున్న ప్రభుత్వం

- రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో తేలిన ఖాతాల సంఖ్య
- బ్యాంకులు, పోస్టాఫీస్‌లతో చర్చలు జరుపుతున్న ప్రభుత్వం
- రేపు లేదా ఎల్లుండి మంత్రివర్గ ఉపసంఘం భేటీ
- ఇందులోనే పెట్టుబడి పథకం మార్గదర్శకాలు ఖరారు

రాష్ట్రంలో రైతులు 45.33 లక్షలు   వ్యవసాయ ఖాతాలు 71.75 లక్షలు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో రైతులెందరు..? ఇప్పటివరకు ఉన్న గణాంకాల ప్రకారం 55.53 లక్షలు! కానీ వ్యవసాయ శాఖ ఇటీవల నిర్వహించిన సమగ్ర సర్వేలో తేలిన రైతుల సంఖ్య 45.33 లక్షలు!! మరి రైతుల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పెట్టుబడి సాయం పథకానికి ఏ గణాంకాలను ప్రాతిపదికగా తీసుకోవాలి? ఇప్పటిదాకా ఇదో చిక్కుప్రశ్న. ప్రస్తుతం దీనిపై స్పష్టత వచ్చింది. పెట్టుబడి సాయం పథకానికి రైతుల సంఖ్యను కాకుండా రాష్ట్రంలో మొత్తం వ్యవసాయ భూమిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోనుంది. ఈ మేరకు రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో తేలిన 1.42 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమికి ఈ పథకాన్ని వర్తింపజేయనుంది. ఆ భూముల కింద

మిగతా 2వ పేజీలో ▶

కశ్మీర్‌లో బాంబు పేలుడు



- జమ్మూకశ్మీర్‌లో శనివారం బంద్ నేపథ్యంలో బారాముల్లా జిల్లా సోపోర్ పట్టణంలో పోలీసులు పెట్రోలింగ్ చేపట్టారు. స్థానిక మార్కెట్ ప్రాంతంలోని మూసి ఉన్న దుకాణం వద్దకు వారు రాగానే అప్పటికే అమర్చిన అత్యాధునిక పేలుడు పదార్థం (ఐఈడీ)ను ఉగ్రవాదులు పేల్చారు. దీంతో నలుగురు పోలీసులు చనిపోయారు. - 14లో

గడ్డిమేతకు మూడున్నరేళ్ల జైలు

రూ. 10 లక్షల జరిమానా



- దాణా కేసులో లాలూకు శిక్ష ఖరారు చేసిన సీబీఐ కోర్టు
- 21 ఏళ్ల నాటి దాణా కేసులో మరో ఏడుగురికీ ఇదే శిక్ష

- వివరాలు 14లో




శనివారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించిన రైతు సదస్సులో మాట్లాడుతున్న ఉత్తమ్. చిత్రంలో గండ్ర, జీవన్‌రెడ్డి, మధుయాష్కీ, సుదర్శన్‌రెడ్డి, కోదండరెడ్డి తదితరులు

మేమొస్తే ఉచితంగా పంటల బీమా

- రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ
- నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ రైతు సదస్సులో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ హామీ

- వివరాలు 6లో



'మత్తు'కు దూరంగా మనుషులకు దగ్గరగా

- మద్యం, మాంసం ముట్టని నిర్మల్ జిల్లా గ్రామాలు
- ఆదర్శంగా నిలుస్తున్న పాంగ్రా, ఝరి(బి), హిప్నెల్లి, జామ్‌గావ్, వాస్తపూర్

- ఫోకస్ (11)లో



మెడికల్ సీట్ల పేరుతో కుచ్చుటోపీ!

- బెంగళూరు కేంద్రంగా దందా
- ఎంసెట్ స్కాం నిందితులే కీలక సూత్రధారులు?
- వందల మందిని మోసగించిన గ్యాంగ్
- బొల్లారంలో కేసు నమోదు
- సీఐడీతో కలసి పోలీసుల దర్యాప్తు

- వివరాలు 6లో



దేశంలోనే రెండో ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా పంజగుట్ట

- కేంద్ర హోంమంత్రి చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్
- మొదటి స్థానంలో కోయంబత్తూరు, మూడో స్థానంలో యూపీలోని గుడుంబా

- వివరాలు 16లో

సాక్షి
రాష్ట్రీయం
హైదరాబాద్
ఆదివారం । జనవరి । 7 । 2018
2

తొలిసారిగా పతంగిని క్రీస్తు పూర్వం 5వ శతాబ్దంలో చైనీస్ తత్వవేత్తలు మోజీ, లు బాన్‌లు తయారు చేసినట్లు చరిత్ర చెబుతోంది.



కిల.. కిల.. కిల







ఏటా పక్షులు ఓ చోటు నుంచి మరో చోటుకు వలస వెళ్తుంటాయి. అది వాటికి అవసరం.. ఆవశ్యకం. మనకు మాత్రం ఆహ్లాదం. అవి అలా గుంపులు గుంపులుగా ఆకాశంలో వెళుతూ సందడి చేస్తుంటే మనసుకు అదో ప్రశాంతత. అయితే అక్కడితోనే ఆగిపోకుండా ఓ ఫొటోగ్రాఫర్ పక్షుల వలసలో కూడా సృజనాత్మకతను వెలికి తీశాడు. జర్మనీకి చెందిన డేనియల్ బైబర్ వేలాది పక్షులు మరో పక్షి ఆకారంలోకి మారినప్పుడు ఈ అద్భుతమైన ఫొటోలను క్లిక్‌మనిపించాడు. ఈశాన్య స్పెయిన్‌లోని కోస్ట్రాబావాలో నాలుగు రోజుల పాటు కష్టపడి ఈ అద్భుతాలను ప్రపంచానికి అందించాడు.


'తిరుపతిరావు కమిటీ నివేదిక బహిర్గతం చేయండి'

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల క్రమబద్ధీకరణపై తిరుపతిరావు కమిటీ ఇచ్చిన నివేదికను బహిర్గతం చేయాలని తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ (టీపీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్.ఆచార్యకు వినతిపత్రం అందజేసింది. టీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ.. కమిటీ నివేదిక కాపీని టీపీఏకు ఇవ్వాలని, అదే విధంగా పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచాలని కోరారు.

గ్రామ సచివాలయాలు తెరిచి పారదర్శకంగా సేవలందిస్తాం

54వ రోజు
06-01-2018, శనివారం
కల్లూరు శివారు,
చిత్తూరు జిల్లా.

పాదయాత్ర డైరీ



ఈ రోజు శ్రీనివాసపురంలో ఓ పాడి రైతు కష్టసుఖాలు విచారించాను. దాదాపు రూ.70 వేల పెట్టుబడితో ఆవులను కొన్నానని, పాల ధర గిట్టుబాటు కాకపోవడంతో ఇప్పుడు వస్తున్న ఆదాయం అరకొరగా ఉందని చెప్పాడు. 'మీరు ప్రకటించిన లీటరుకు నాలుగు రూపాయల రాయితీ అందుబాటులోకి వస్తే అత్యంత ప్రయోజనకరంగా, ప్రోత్సాహకరంగా ఉంటుంది' అంటూ సంతోషం వ్యక్తం చేశాడు.

మైనార్టీ సోదరుల ఆహ్వానం మేరకు కల్లూరులో వారితో ముఖాముఖిలో పాల్గొన్నాను. అక్కడ వారు చెప్పిన సమస్యలు విన్న తర్వాత మైనార్టీల పట్ల, వారి సంక్షేమం పట్ల ఈ ప్రభుత్వ దృక్పథం ఎంత దారుణంగా ఉందో అర్థమైంది. మైనార్టీలలో చాలామంది నిరుపేదలున్నారు. ఎక్కువ మంది, ముఖ్యంగా సైకిల్ షాపులు, మెకానిక్ షాపులు, టీ బంకులలో దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. వారి సామాజిక, ఆర్థిక పరిస్థితి చూసే నాన్నగారు వారికి రిజర్వేషన్లు కల్పించారు. ఆ ముఖాముఖి కార్యక్రమంలో మహమ్మద్ అనే సోదరుడు 'అన్నా.. మా అక్క కొడుకు లారీ డ్రైవర్. హైదరాబాద్‌లో యాక్సిడెంట్ అయింది. అక్కడ ఆస్పత్రికి తీసుకెళితే ఆంధ్రావాళ్లకు ఆరోగ్యశ్రీ లేదు.. మీ రాష్ట్రంలో చేయించుకోండన్నారు. చాలా ఇబ్బంది పడ్డామన్నా..' అని ఆవేదన వ్యక్తంచేశాడు. అత్యాధునిక వైద్య సౌకర్యాలున్న పెద్ద పెద్ద ఆస్పత్రులన్నీ హైదరాబాద్‌లోనే ఉన్నాయి. ఇక్కడేమో మంచి ఆస్పత్రులు లేవు. హైదరాబాద్‌లో వైద్యం చేయించుకుందామంటే నిధులు ఇవ్వం అంటారు.. మరి పేదవాడి గతేంటి? ఎక్కడైనా మంచి ఆస్పత్రుల్లో, మంచి వైద్యం అందించాలని ఏ ప్రభుత్వమైనా ఆరాటపడాలి.. కానీ ఇక్కడి ప్రభుత్వ పరిస్థితి దానికి పూర్తి భిన్నంగా ఉంది. ఈ బాధలు చూస్తుంటే మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి పొరుగు రాష్ట్రాల్లోని నగరాల్లో కూడా ఆరోగ్యశ్రీని వర్తింపజేయాలన్న నా నిర్ణయం మరింత బలపడింది.

రషీదాబేగం అనే సోదరి 'అన్నా.. నాకు అన్నీ అర్హతలు ఉన్నా కూడా జన్మభూమి కమిటీల కులవివక్ష లోన్ మంజూరు కాకుండా అడ్డుపడుతున్నారు. మీరొచ్చి ఈ వ్యవస్థను మార్చాలి'అంది. నాన్నగారు ఎప్పుడూ చెప్పేవారు.. రాజకీయాలనేవి ఎన్నికల వరకేనని. పార్టీలు చూడొద్దండి.. అర్హులైతే చాలు అందరికీ న్యాయం చేయాల్సిందే.. అని ఆయన అనేవారు. కానీ ఈ ప్రభుత్వం జన్మభూమి కమిటీలు అనే రాజ్యాంగేతర వ్యవస్థను ఏర్పాటుచేసి స్థానిక సంస్థలను కూడా పూర్తిగా నిర్వీర్యం చేసింది. ఏ పనికైనా లంచమే.. దేనికైనా రాజకీయ పలుకుబడే. మన ప్రభుత్వం వచ్చిన వెంటనే వ్యవస్థను మార్చి, ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా గ్రామ సచివాలయాలను తెరిచి సామాన్య ప్రజలకు అవసరమైన అన్ని సేవలు పారదర్శకంగా అందిస్తాం.

శివరాంకి చేరేముందు డైట్ కళాశాల విద్యార్థినులు కలిశారు. వాళ్ల రెండు సంవత్సరాల కోర్సు అయిపోవస్తుండగా ఇంతవరకూ మొదటి సంవత్సరం పరీక్ష కూడా పెట్టలేదట. దీని వల్ల తాము డీఎస్సీ అర్హత కోల్పోతామని ఆందోళన వ్యక్తంచేశారు. రెండేళ్ల కోర్సు పూర్తయినా మొదటి సంవత్సర పరీక్షలే పెట్టకపోవడం విద్యార్థుల పట్ల, వారి భవిష్యత్తు పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి అద్దంపడుతోంది.

ముఖ్యమంత్రి గారికి నాదో ప్రశ్న.. డైట్‌సెట్ పరీక్షలు నిర్వహించి, టీటీసీలో ప్రవేశాలు కల్పించి, కోర్సు పూర్తయినా కూడా పరీక్షలు నిర్వహించకుండా.. వారి భవిష్యత్తు నాశనమవడానికి ప్రత్యక్ష కారణం మీరు కాదా? ప్రతి సంవత్సరం ఖాళీ టీచర్ పోస్టులు భర్తీ చేస్తానన్న మీ హామీ ఏమైంది? ప్రాథమిక విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసి పరోక్షంగా కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాయడం న్యాయమేనా?

వై.ఎస్. జగన్.



కల్లూరులో ముస్లిం ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న వైఎస్ జగన్

1.42 కోట్ల ఎకరాలకు 'పెట్టుబడి'

▶ మొదటి పేజీ తరువాయి

రైతులకు 71.75 లక్షల వ్యవసాయ ఖాతాలున్నాయి. ఈ ఖాతాల ప్రకారమే ప్రభుత్వం ఎకరాకు రూ.4 వేల చొప్పున పెట్టుబడి సాయం అందజేయనుంది. ఒక్కో రైతుకు ఒకటికి మించి ఖాతాలు ఉండే అవకాశం ఉన్నందున రైతుల సంఖ్యకు, ఖాతాల సంఖ్యకు మధ్య భారీ తేడా కనిపిస్తోందని వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఉదాహరణకు ఒక రైతుకు ఒక రెవెన్యూ గ్రామంలో రెండెకరాలు, మరో రెవెన్యూ గ్రామంలో మరో ఐదెకరాలు ఉండే అవకాశం ఉంది. ఈ లెక్కన ఆ రైతుకు రెండు వ్యవసాయ ఖాతాలుంటాయి. పథకాన్ని అమలు చేస్తే ఇలాంటి రైతులకు రెండు ఖాతాల్లో వేర్వేరుగా ఎకరాకు రూ.4 వేల చొప్పున అందించనున్నారు. భూముల రికార్డుల ప్రక్షాళనలో అధికారులు నిక్కచ్చిగా వ్యవసాయ భూముల వివరాలను ఓ కాలమ్‌లో రాశారు. వ్యవసాయేతర భూమి ఉంటే దాన్ని మరో కాలమ్‌లో చూపారు. ఇలా వ్యవసాయ ఖాతాల్లో పేర్కొన్న భూమి 1.42 కోట్ల ఎకరాలు ఉన్నట్టు తేలింది. ఈ ఖాతాలను ప్రామాణికంగా తీసుకొనే సాగు భూమికి పెట్టుబడి పథకాన్ని అమలు చేస్తారని వ్యవసాయశాఖ ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'కి తెలిపారు. సీఎంతో జరిగిన సమావేశంలోనూ ఇదే చర్చ జరిగిందన్నారు.



సాగు భూములను గుర్తించేదెలా?

మరోవైపు సాగుచేస్తున్న భూములను గుర్తించడం ఎలా అన్న దానిపైనా చర్చిస్తున్నారు. అనేక కారణాలతో రైతులు కొంత భూమిని సాగు చేయకుండా వదిలేసే అవకాశముంది. రబీలో చాలా వరకు భూమి ఖాళీగానే ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో సాగు భూమిని గుర్తించి పెట్టుబడి పథకాన్ని ఎలా అమలు చేయాలన్న దానిపై చర్చిస్తున్నారు. సాగు చేయకుండా పెట్టుబడి పథకం కింద డబ్బులు తీసుకునే పరిస్థితి ఏర్పడితే పథకం లక్ష్యం నీరుగారుతుందని భావిస్తున్నారు. అందువల్ల పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

రేపు లేదా ఎల్లుండి మంత్రివర్గ ఉపసంఘం భేటీ

పెట్టుబడి సొమ్మును ఎలా అమలుచేయాలన్న దానిపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సోమ లేదా మంగళవారాల్లో సమావేశం కానుందని వ్యవసాయశాఖ వర్గాలు చెబుతున్నాయి. బ్యాంకులు, పోస్టాఫీసులు, రైతులు, ఇతర వ్యవసాయ నిపుణులతో చర్చించాక అందులో వచ్చే అభిప్రాయాలపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించనుంది. దీనిపై ఎక్కువ సమయం తీసుకోకుండా మొదటి సమావేశంలోనే పెట్టుబడి అమలు తీరుపై మార్గదర్శకాలు ఖరారు చేసే అవకాశముంది. ఆ మార్గదర్శకాలను ముఖ్యమంత్రికి నివేదిస్తారు. ఆ మార్గదర్శకాలను సీఎం అధ్యయనం చేశాక మార్పులు చేర్పులు చేసి జీవో ఇస్తారని తెలిసింది.

సొమ్ము ఎలా ఇద్దాం?

రైతులకు పెట్టుబడి పథకం కింద ఈ ఏడాది ఖరీఫ్ నుంచి ఎకరానికి రూ.4 వేలు ఇచ్చేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. అయితే దీన్ని ఎలా అమలు చేయాలన్న దానిపై వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పెట్టుబడి సొమ్మును రైతులకు ఎలా ఇవ్వాలన్న దానిపై సీఎం కార్యాలయం కసరత్తు చేసింది. చెక్కుల ద్వారా ఇస్తేనే బాగుంటుందన్న భావన ఆ సమావేశంలో వ్యక్తమైంది. ఇదే అంశంపై చర్చించేందుకు మంత్రి పోచారం శనివారం వాణిజ్య, సహకార బ్యాంకులు, పోస్టల్ శాఖకు చెందిన ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. బ్యాంకుల ద్వారా అందజేస్తే రైతు రుణ పెండింగ్ బకాయిల్లో కలుపుకుంటాయన్న భావన ఉంది. దీంతో చెక్కులు ఇస్తే ఎలా ఉంటుందన్న చర్చ జరిగింది. మరోవైపు దాదాపు ప్రతీ గ్రామంలోనూ పోస్టాఫీసులు ఉన్నందున పోస్టల్ ఖాతాను రైతులందరూ తీసుకుంటే దాని ద్వారా సరఫరా చేయడం సులువన్న చర్చ కూడా జరిగింది. అలాగే దీనిపై నేరుగా రైతుల అభిప్రాయాలు కూడా తెలుసుకోవాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఆ మేరకు మంత్రి పోచారం సాయంత్రం నల్లగొండ జిల్లాకు వెళ్లి రైతులతో చర్చించారు. మిగిలిన జిల్లాల్లోనూ అక్కడక్కడా ఇదే తరహా రైతు అభిప్రాయాలు తీసుకుంటున్నారు.

సంక్రాంతికి బసవన్నలు ఆడుకోవచ్చు

గంగిరెద్దులాట హిందూ సంస్కృతిలో భాగమే: పోలీసులు

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి వేళ గంగిరెద్దులాటకు పోలీసుల నుంచి ఎటువంటి అభ్యంతరాలు ఉండవని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసులు తెలిపారు. రహదారులపై, చౌరస్తాల వద్ద భిక్షాటన చేస్తూ ప్రజలకు ఆటంకం కలిగిస్తున్న వారిని మాత్రమే అదుపులోకి తీసుకుని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నామని వారు చెబుతున్నారు. గంగిరెద్దులు ఆడించే వారు ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ మేరకు మూడు కమిషనరేట్ల పోలీసు కమిషనర్లు శ్రీనివాసరావు, సందీప్ శాండిల్య, మహేశ్ భగవత్ శనివారం ప్రకటనలు విడుదల చేశారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా గంగిరెద్దులాట అనేది హిందూ సంస్కృతిలో భాగమని, తరతరాలుగా కొనసాగుతున్న ఈ ఆటకు పోలీసుల నుంచి ఆటంకం ఉండదని వారు వెల్లడించారు. గంగిరెద్దులాడించే వారికి నగరంలో ఏదైనా ఇబ్బంది తలెత్తితే కంట్రోల్ రూమ్ నం. 100కు తెలపవచ్చని.. వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

టీయూఎస్ ప్రధాన కార్యదర్శిగా పవన్ కుమార్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యోగ సంఘం (టీయూఎస్) ప్రధాన కార్యదర్శిగా పి.పవన్‌కుమార్, సెక్రటరీ జనరల్‌గా టి.శ్రీకాంతరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా రవీందర్‌రావు నియమితులయ్యారు. సంఘం అధ్యక్షుడు ఎ.పద్మాచారి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మరో పబ్‌లోని హుక్కా కేంద్రమే కారణం

వన్ అబోవ్ పబ్ ప్రమాదంపై అగ్నిమాపక శాఖ నివేదిక

ముంబై: నగరంలోని కమలా మిల్స్ భవనంలోని వన్ అబోవ్ పబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదానికి కారణం అదే భవనంలోని మరో పబ్ నుంచి ఎగసిపడిన నిప్పు రవ్వలేనని అగ్నిమాపక శాఖ శుక్రవారం నాటి తన నివేదికలో పేర్కొంది. కమలా మిల్స్‌లోనే మోజోస్ బిస్ట్రో అనే పబ్‌లో అక్రమంగా హుక్కా కేంద్రం నిర్వహిస్తున్నారనీ, అక్కడే నిప్పురవ్వలు ఎగసి మంటలు ప్రారంభమయ్యాయని అగ్నిమాపక శాఖ నివేదిక ఇచ్చింది. దీంతో పోలీసులు మోజోస్ బిస్ట్రో పబ్ యజమానులపై కూడా కేసులు నమోదు చేశారు. యజమానుల్లో ఒకరైన మాజీ ఐపీఎస్ కొడుకును పోలీసులు అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నారు. వీరిపై 'హత్యగా పరిగణించని, ఇతరుల చావుకు కారణమైన శిక్షార్హమైన నేరం'తోపాటు వివిధ అభియోగాల కింద కేసులు పెట్టారు.

సీఎం ఇచ్చిన హామీ నెరవేర్చాలి

అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ గంగు భానుమూర్తి



సాక్షిప్రతినిధి, ఖమ్మం: అర్చక ఉద్యోగులకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఇచ్చిన హామీని రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు అమలు చేయడంలో విఫలమవుతున్నారని అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ గంగు భానుమూర్తి విమర్శించారు. ఈ నెల 10వ తేదీలోగా సీఎం ఇచ్చిన హామీ మేరకు వేతనాలు చెల్లించకపోతే మరోసారి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. గుంటు మల్లన్న దేవస్థాన ఆవరణలో ఖమ్మం జిల్లా అర్చక ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అర్చక ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 5,625 మంది అర్చక ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని గతేడాది సీఎం చెప్పారని గుర్తుచేశారు. కేవలం 738 మందికే డిసెంబర్, జనవరి వేతనాలను సగం ట్రెజరీ నుంచి మిగతా సగాన్ని దేవాలయాల నుంచి తీసుకోవాలని దేవాదాయ అధికారులు చెప్పారని తెలిపారు. సీఎం హామీని నెరవేర్చకపోతే జనవరి 11న కార్యాచరణ ప్రకటించి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వివిధ జిల్లాల అర్చక ఉద్యోగ జేఏసీ నేతలు పాల్గొన్నారు.

ఉత్తమ్ ఇంటి వద్ద సంబరాలు

టీపీసీసీ అధ్యక్షుడిగా కొనసాగించడంపై శ్రేణుల హర్షం

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా పీసీసీ అధ్యక్షులను కొనసాగిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇంటి వద్ద కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. శనివారం రాత్రి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆయన ఇంటికి చేరుకొని బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఉత్తమ్‌కు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లు రవి, గుడూరు నారాయణ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, యూత్ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు వెంకట్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శారద, రంగారెడ్డి జిల్లా నాయకులు క్యామ మల్లేశం, బి.లక్ష్మారెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, వరంగల్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇదండీ సంగతి



.. మే ఐ కమిన్ సార్!

● ఈ నెల 10న విడుదల కానున్న అజ్ఞాతవాసి చిత్రాన్ని చూసేందుకు రావాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాత రాధాకృష్ణ కోరారు. సచివాలయంలో మంత్రిని కలసిన వారిలో చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ రాంమోహన్‌రావు ఉన్నారు.

బీబీనగర్‌లో నిమ్స్

‘ఎయిమ్స్’ వచ్చే అవకాశాలు లేనట్లే ● కొత్తగా 248 మంది బోధన సిబ్బంది

సాక్షి, హైదరాబాద్: మన రాష్ట్రానికి అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) మంజూరు కాదని తేలడంతో బీబీనగర్‌లోని క్యాంపస్‌ను రాష్ట్ర స్థాయి ఉత్తమ సంస్థగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ వైద్య సేవల సంస్థగా పేరొందిన నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (నిమ్స్) బీబీనగర్ క్యాంపస్‌పై కదలిక వస్తోంది. వైద్య సేవల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రంగాపూర్‌లోని నిమ్స్ విశ్వవిద్యాలయం క్యాంపస్ పూర్తి స్థాయి కార్యకలాపాల నిర్వహణకు కొత్తగా 873 పోస్టులు అవసరమవుతాయని ప్రభుత్వం నిర్ధారించింది. ఈ మేరకు గత నెల 28న కొత్తగా పోస్టులను మంజూరు చేసింది. కొత్తగా మంజూరైన పోస్టులు కావడంతో ఏ విధానంలో భర్తీ చేయాలనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి అనుసరించే ప్రక్రియపై అనుమతికోసం వైద్య, ఆరోగ్యశాఖ తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వం ఆమోదం రాగానే ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. బీబీనగర్ నిమ్స్ కోసం ప్రభుత్వం మంజూరు చేసిన పోస్టులలో 248 బోధన సిబ్బంది కేటగిరీవి ఉన్నాయి. మరో 625 బోధనేతర (వైద్య సహాయక, పరిపాలన, సాంకేతిక) పోస్టులు ఉన్నాయి. ఎయిమ్స్ తరహాలోనే నిమ్స్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాలని వైద్య శాఖ ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలో పేర్కొంది. ప్రతిపాదనల ప్రకారం బోధన సిబ్బంది పోస్టులను నిమ్స్ ఆధ్వర్యంలోనే జరగనున్నాయి. నిమ్స్ ఉన్నత స్థాయి కమిటీ బోధన సిబ్బంది పోస్టులను భర్తీ చేస్తుంది. వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, వైద్య విద్య సంచాలకుడు, నిమ్స్ డైరెక్టర్, ఆర్థిక శాఖ ఉన్నతాధికారి, రాష్ట్ర ప్రభుత్వం నియమించే మరో ఉన్నతాధికారి ఈ కమిటీలో ఉంటారు. మొత్తం బోధన సిబ్బంది పోస్టులను మెరిట్ ఆధారంగా ఈ కమిటీ భర్తీ చేస్తుంది. జనవరిలోనే ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో...

బీబీనగర్ నిమ్స్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిన మొత్తం 873 పోస్టులు 58 కేటగిరీలో ఉన్నాయి. వీటిని మినహాయించి 50 కేటగిరీలోని 625 పోస్టులను తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) భర్తీ చేయనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయనుంది.

వెబ్‌సైట్‌లో పీసీబీ ఇంజనీర్లు, అనలిస్ట్ ప్రొవిజినల్ జాబితా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)లో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లు, అనలిస్ట్ గ్రేడ్–2, స్టెనో కమ్ టైపిస్ట్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితాను వెబ్‌సైట్ (www.tspsc.gov.in)లో అందుబాటులో ఉంచినట్లు టీఎస్‌పీఎస్సీ శనివారం తెలిపింది. స్టెనో కమ్ టైపిస్ట్ వివరాలు ఈ నెల 8 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొంది.

త్వరలో ఓయూలో అధ్యాపక ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్

హైదరాబాద్: ఓయూలో ఖాళీగా ఉన్న అధ్యాపక ఉద్యోగాల భర్తీకి త్వరలో ప్రకటన విడుదల చేయనున్నట్లు వీసీ ప్రొఫెసర్ రాంచంద్రం శనివారం తెలిపారు. జూలై నాటికి అధ్యాపక ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేసి పర్మనెంట్ అధ్యాపకుల కొరతను తగ్గించనున్నట్లు చెప్పారు. ఓయూలోని వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న 415 అధ్యాపక ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందన్నారు. పలు విభాగాలలో సబ్జెక్టుల వారీగా రూలాఫ్ రిజర్వేషన్లు, ఇతర అంశాలను క్షుణ్నంగా పరిశీలించి త్వరలో(వచ్చే నెల) నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడించారు.

వెబ్‌సైట్‌లో స్టాఫ్‌నర్స్ పోస్టుల వివరాలు

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖలో కేటగిరీల వారీగా స్టాఫ్‌నర్సు పోస్టుల వివరాలను తమ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ గతేడాది రెండుసార్లు వెలువడింది. తొలుత 242 పోస్టులకు, తర్వాత 1,361 పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. తాజాగా 1,603 పోస్టుల వివరాలను కేటగిరీల వారీగా విభజించి, టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపర్చింది.






సాక్షి
హైదరాబాద్
ఆదివారం | జనవరి | 7 | 2018
www.sakshi.com

తెరపడని భూబాగోతం

ఆ భూమి మార్కెట్ విలువ కోటి రూపాయలు ఉన్నప్పటికీ కూడా, రాష్ట్ర ఖజానాకు మేలు చేకూర్చే క్రమంలో వారు చేస్తున్న సేవకు గాను, దానిని పది లక్షల రూపాయలకీ, ఇంకా వీలైతే ఒక లక్ష రూపాయలకే బహుమానంగా దఖలు పరుస్తారు. ఈ భూమిని తీసుకున్నవారు అక్కడ పరిశ్రమను స్థాపించేందుకు పెట్టుబడులు కావలసి వస్తాయి. ఆ పెట్టుబడులకు అవసరమైన వనరులను సేకరించేందుకు వీలుగా, ఆ భూమినే తాకట్టు పెట్టే అధికారం కూడా కోరతారు (ఆ విన్నపాన్ని ప్రభుత్వం తప్పనిసరిగా మన్నిస్తుంది కూడా).


ఐవైఆర్ కృష్ణారావు

ఏదైనా ఒక సహజ వనరు ఉంటే, దానిని కొంతకాలంగా రాజకీయ పెద్దలు తమ స్వప్రయోజనాల కోసం అనుభవిస్తూ ఉన్నారంటే, అది ప్రభుత్వ ఆస్తి అయి ఉంటుంది. రాజకీయ పలుకుబడి పుష్కలంగా ఉండడంతో పాటు, తగిన సమయం కోసం వేచి ఉండే ఓపిక దండిగా ఉన్నా కూడా ఆ భూమిని చక్కగా అలాంటి వ్యక్తులు సొంతం చేసుకోవచ్చు. వెలకట్టలేని ఆ భూమి క్షణాలలో అలాంటివారికి చట్టబద్ధమైన పద్ధతిలో కేటాయించే సౌకర్యం కూడా ఉంటుంది. ఒకవేళ ప్రభుత్వాలు మారిపోయినా ఇలాంటి వ్యవహారాలకు వచ్చిన ఢోకా ఏమీ ఉండదు. ఎందుకంటే మళ్లీ ఆ వంచక పాత పాత్రలే చక్రం తిప్పుతూ ఉంటాయి.

రెవెన్యూ దస్త్రాలను భద్రపరచడంలో మనకున్న పద్ధతి, ఇలాంటి వాటిని చూసీచూడనట్టు వదిలేసే అధికారులు వెరసి అలాంటి భూములకు సంబంధించిన అక్రమాలు అనంతంగా కొనసాగడానికి విరివిగా అవకాశం కల్పిస్తున్నాయి. దీనికి ఉన్న పద్ధతి కూడా చాలా సులభమైనదే. ఒక దొంగ సంస్థను ఏర్పాటు చేసి, వాళ్లు కోరుకున్న మొత్తం భూమి కోసం ప్రభుత్వాన్ని అంటకాగుతారు. ఈ ప్రక్రియ మొత్తం మరింత తేలికగా సాగడానికి చార్టర్డ్ అకౌంటెంట్లు ఎలాగూ ఉంటారు. ఆ పారిశ్రామికవేత్తలు స్థాపించబోయే సంస్థతో జరగబోతున్న 'ఉద్యోగావకాశాల కల్పన' గురించీ, ఇబ్బడిముబ్బడిగా 'ఖజానా నిండడం' గురించీ ఘనంగా నివేదికలు రూపొందించి పెడతారు. ఇంకా 'గుర్తించిన' భూములను నామమాత్రపు ధరలకి పరిశ్రమలు స్థాపించబోతున్న ఆ సంస్థకు ధారాదత్తం చేయడం ఎంత సబబో కూడా సీఏలు నివేదిస్తారు.

భూదానం

ఆ భూమి మార్కెట్ విలువ కోటి రూపాయలు ఉన్నప్పటికీ కూడా, రాష్ట్ర ఖజానాకు మేలు చేకూర్చే క్రమంలో వారు చేస్తున్న సేవకు గాను, దానిని పది లక్షల రూపాయలకీ, ఇంకా వీలైతే ఒక లక్ష రూపాయలకే బహుమానంగా దఖలు పరుస్తారు. ఈ భూమిని తీసుకున్నవారు అక్కడ పరిశ్రమను స్థాపించేందుకు పెట్టుబడులు కావలసివస్తాయి. ఆ పెట్టుబడులకు అవసరమైన వనరులను సేకరించేందుకు వీలుగా, ఆ భూమినే తాకట్టు పెట్టే అధికారం కూడా కోరతారు (ఆ విన్నపాన్ని ప్రభుత్వం తప్పనిసరిగా మన్నిస్తుంది కూడా). అంటే ఆ భూమిని తాకట్టు పెట్టి ఆర్థిక సంస్థల ద్వారా పెట్టుబడిని సేకరిస్తారు. ఇందుకు సంబంధించి వారికి అనుమతి అంటూ లభిస్తే అప్పటి మార్కెట్ ధరకు ఆ భూమిని తాకట్టు పెడతారు.

కాబట్టి ఐదు కోట్లు చెల్లిస్తే , మార్కెట్ ధర ప్రకారం రూ. 50 కోట్లు విలువ చేసే భూమి ప్రభుత్వం నుంచి వారికి దక్కుతుంది. అసలు విషయం అది కాదు. సంస్థలే కాదు, ఆ భూమిని తాకట్టు పెట్టడం ద్వారా వ్యక్తిగతంగా కూడా రూ. 50 కోట్ల రూపాయలు ఆర్థిక సంస్థల నుంచి రుణంగా పొందవచ్చు. లంచాల కోసం, అధికారులకు చెల్లించడం కోసం, రాజకీయ నాయకులకు ఇవ్వవలసింది ఇచ్చుకోవడానికీ పది కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా కూడా తెలివైన ఆ పారిశ్రామికవేత్తకి ఇంకా చాలా డబ్బు మిగులుతుంది. ఒకవేళ తీసుకున్న రుణం తిరిగి చెల్లించలేకపోతే, తనఖాలో ఉన్న భూమిని బ్యాంకు అమ్ముతుంది. నిజానికి వసూలు చేసుకోలేని రుణాలంటూ ఏమీ ఉండవు. ఏదిఏమైనా అంతిమంగా నష్టపోయేది ఎవరంటే, ప్రభుత్వమే. ఎందుకంటే యాభయ్ కోట్ల రూపాయల విలువైన భూమి చేజారిపోయింది. ఇంకా, అక్కడ పరిశ్రమ అంటూ ఏదీ కూడా కనిపించదు. చురుకైన పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ భూముల విషయంలో చేసే అవినీతిలో ఇది ముఖ్యమైన చర్య. భూపరిపాలన శాఖ ప్రధాన కమిషనర్‌గా ఉన్నప్పుడు నేనొక విశ్వ ప్రయత్నం చేశాను.



ఒక విఫలయత్నం

భూములను పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం కేటాయించినప్పుడు వారు ఎంత ధర చెల్లించారో, ఆర్థిక సంస్థలకు అంతకు మించిన ధరతో తాకట్టు పెట్టరాదన్న నిబంధన ఒకటి తీసుకురావాలని గట్టిగా ప్రయత్నించి విఫలమయ్యాను. భూపరిపాలన కమిషనర్‌గా ఉన్నప్పుడు, ఆఖరికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో కూడా ఈ ప్రయత్నం చేసినా కూడా సాగలేదు. ఇలాంటి భూముల కేటాయింపులలో అధికారులకు ఉండే పరస్పర ప్రయోజనాలు ఎలాంటివంటే, అవి కదపడానికి సాధ్యం కానంత లోతుగా ఉంటాయి.

అసలు భూ కేటాయింపు విషయాలన్నీ మంత్రిమండలి దగ్గరకు వెళతాయి. ఎందుకంటే భూ కేటాయింపులు చేసేది మంత్రివర్గమే. అయితే నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే భూకేటాయింపును రద్దు చేసే అవకాశం, అధికారం ఉంది. భూ కేటాయింపు నిర్ణయం తిరిగి మంత్రిమండలి ముందుకు వెళితే అది పరిష్కారం కావడానికి చాలా సమయం అవసరం. కాబట్టి నేను భూ కేటాయింపు రద్దు అధికారాన్ని కలెక్టర్లకు బదలాయించాను. అందుకే నిబంధనలకు విరుద్ధంగా ఏం జరిగినా కలెక్టర్లు వెంటనే భూకేటాయింపును రద్దు చేస్తారు.

ఇలాంటి భూముల విషయంలో జరిగే మరో రకం అవినీతి కూడా ఉంటుంది. స్థానిక రెవెన్యూ యంత్రాంగం సాయంతో ఆ భూములను కొంతకాలం తరువాత ప్రైవేటు భూములుగా రాయించుకుంటారు. ఈ ప్రక్రియకి చాలా సమయం పడుతుంది. కాబట్టి దండిగా సహనం ఉండాలి. పలు స్థాయిల న్యాయస్థానాలలో వ్యాజ్యాలు నడపాలి. పలు స్థాయిలలో ప్రభుత్వ శాఖలను మేనేజ్ చేయాలి. ఇలాంటి విన్యాసాలు చేయడంలో ఆరితేరిన వృత్తి నిపుణులు కూడా ఉన్నారు. ఎవరు అధికారంలో ఉన్నారు, ఎవరి ప్రభుత్వం ఉన్నది అనే అంశంతో వారికి పనిలేదు. ఆ ప్రక్రియ మొత్తం సక్రమంగా పూర్తి చేయించి, భూమిని వారు విజయవంతంగా సొంతం చేయిస్తారు. రాజకీయ నేతలతో వారికి ఉండే అవినాభావ సంబంధాలు అంత పటిష్టంగా ఉంటాయి. అంతేకాదు, అవి విశాఖపట్నంలో దసపల్లా హిల్స్ భూములు కావచ్చు, హైదరాబాద్‌లోని మియాపూర్‌లోని భూములైనా కావచ్చు. ప్రభుత్వ భూముల మీద టైటిల్ డీడ్స్‌ను సంపాదించడంలో వీరిని ఏ శక్తీ ఆపలేదు. అందుకు ఎంతకాలమైనా పట్టవచ్చు. అంతదాకా వారు ఓపికగా వేచి ఉంటారు. చేతికి ఎముకలేని రీతిలో ఖర్చు పెడతారు. మధ్యలో కొరకరాని కొయ్య అనిపించే అధికారి ఎవరైనా వస్తే, అతడు వెళ్లిపోయే దాకా కూడా వేచి ఉండగలరు. లేకపోతే ఏదో మతలబు చేసి ఆయన్ని అక్కడ నుంచి వెళ్లిపోయేటట్టు చేస్తారు.

సక్రమంగా లేని భూదస్త్రాలు

భూదస్త్రాల నిర్వహణ సరిగా లేకుంటే, అది కూడా ఆ 'నిపుణుల'కు అవకాశం కల్పిస్తూ ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో అనుకూలురైన రెవెన్యూ అధికారులు, సేవాభావం మెండుగా ఉన్న రాజకీయ నేతల సాయం కూడా అందుతుంది. ల్యాండ్ రెవెన్యూ కమిషనర్ కార్యాలయంలో అప్పీళ్ల కమిషనర్ అనే పేరుతో ఒక ఉద్యోగం ఉంది. అత్యంత అవినీతిపరుడు, అలాంటి ఉద్యోగం కోసం అర్రులు చాచేవారినే చూసి ఆ ఉద్యోగంలో నియమిస్తారు. భూ వివాదాలకు సంబంధించిన అన్ని అప్పీళ్లను ఆయనే విని, పరిష్కరిస్తాడు. కానీ నిజం చెప్పాలంటే, ఇప్పటికే ప్రభుత్వానికి చెందిన విలువైన భూములన్నింటికీ రెక్కలు వచ్చాయి. మిగిలినవి కూడా మాయం కావడానికి కొద్ది సమయం మాత్రమే చాలు.

ఇలాంటి పరిస్థితులలో మిగిలిన ఆ భూములను బహిరంగ వేలం పాటతో అమ్మివేయాలని ప్రతిపాదించడమే మంచిది. ఆ డబ్బుతో ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలి. ప్రభుత్వానికి అవసరమైనప్పుడు భూములను కొనడానికి, అంటే ప్రభుత్వం తన భూములను అట్టే పెట్టుకోలేనప్పుడు, ఈ నిధి ఉపయోగపడుతుంది. ఇంకా చెప్పాలంటే తన భూములను రక్షించుకోవాలన్న అభిప్రాయం, రక్షించుకునే శక్తి లేనప్పుడు తనకు అవసరమైన భూములను సమకూర్చుకోవడానికి ఆ నిధి ఉపయోగపడుతుందన్నమాట.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి

లాలూప్రసాద్ యాదవ్ (ఆర్జేడీ)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

రాంచీలో చలి ఎక్కువగా ఉన్నట్లుంది. బిర్సా ముండా జైలు కూడా రాంచీలో భాగమే కనుక ఇక్కడున్నవన్నీ చలికి బిగదీసుకుపోతున్నాయి. ఈ బిగదీసుకుపోతున్న వాటిలో పద్నాలుగు రోజులుగా నేనూ ఒకడిని.

ప్రార్థన, ఉదయపు నడక.. వీటితో నన్ను నేను వెచ్చబరుచుకుంటున్నాను. ఇంకా మూడేళ్ల చలికాలాలు నేనిక్కడ గడపాలి!

బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ ఇంటి నుంచి తెప్పించుకునే అవకాశం కల్పించారు. ఒక వంట మనిషిని పెట్టారు. కొన్ని పేపర్లు వస్తున్నాయి. టీవీ చూడనిస్తున్నారు. ఇవన్నీ నాకు అక్కరలేనివి. అందుకే సమకూర్చినట్లున్నారు! నాకు మనుషులు కావాలి. నేను మనుషులతో మాట్లాడాలి. అందుకు మాత్రం అనుమతించడం లేదు.

అడిగినవి కాదనడం కన్నా, అక్కర్లేనివి అందివ్వడం పెద్ద శిక్ష మనిషికి!

మునుపు ఇలా లేదు. గెస్ట్‌హౌస్‌నే నా కోసం జైలుగా మార్చారు. నన్ను కలవడానికి సీఎం కూడా వచ్చాడు. నేరుగా జైలుకే వచ్చాడు! హేమంత్ సోరేన్. కుర్రాడు. "లాలూజీ మీకు ఇక్కడ సౌకర్యంగానే ఉంది కదా" అని పక్కన కూర్చొని అడిగాడు. "లేకుంటే చెప్పండి ఏర్పాటు చేయిద్దాం" అన్నాడు.

"నాకు మనుషులు కావాలి" అన్నాను.



అర్థం చేసుకున్నాడు. మా పార్టీవాళ్లను పంపిస్తానన్నాడు. అవసరం అయితే తన పార్టీవాళ్లను కూడా పంపిస్తానన్నాడు. "మనవాళ్లు ఒడిశా, బెంగాల్‌లలో కూడా ఉన్నారు లాలూజీ, వాళ్లను కూడా రప్పిస్తాను" అన్నాడు.

హేమంత్ సోరేన్‌ది జార్ఖండ్ ముక్తి మోర్చా. పేరుకు జార్ఖండ్ సీఎమ్మే కానీ, బిహార్ పిల్లాడిలా ఉండేవాడు.

"మావాళ్లు చాలు హేమంత్" అన్నాను.

ఇప్పుడు వారానికి ముగ్గురిని మాత్రమే బయటి నుంచి నన్ను కలవడానికి అనుమతిస్తున్నారు.

వచ్చినవాళ్లు "ఎలా ఉన్నారు లాలూజీ" అని అడుగుతున్నారు.

వచ్చినవాళ్లను "పార్టీ ఎలా ఉంది?" అని నేను అడుగుతున్నాను. అక్కడితో టైమ్ అయిపోతోంది.


ఈ ఉదయం ఇంటి నుంచి అటుకులు, బెల్లం వచ్చాయి. కొన్ని పండ్లు, నువ్వులుండలు కూడా. నోటికి రుచిగా ఉన్నాయి. నా పక్క వాళ్లకు ఇచ్చాను.

"బాగున్నాయి లాలూజీ" అన్నారు. వాళ్లెవరో నాకు తెలీదు. లోపలికి వచ్చాకే పరిచయం.

"ఆ నితీశ్ కుమారే మిమ్మల్ని జైల్లో పెట్టించాడు లాలూజీ" అన్నాడు ఒక పరిచయస్తుడు. నవ్వాను. అతడు నా అభిమానిలా ఉన్నాడు. జైలుకు వచ్చినప్పటి నుంచీ అతను ఒకే మాట అంటున్నాడు. "మిమ్మల్ని కూడా మాతో కలిపేశారేంటి లాలూజీ" అని.

జీవితంలో మనిషి దేనికో ఒకదానికి బందీ కావాలి. నేను పార్టీకి బందీని అయ్యాను. ఇష్టమైన దానికి బందీ అవడం కంటే స్వేచ్ఛ ఏముంది? జైల్లో ఉన్నా నేను స్వేచ్ఛాజీవినే.

ఆ నాటకం ఓ స్వప్న సాఫల్యం


కరణ్ థాపర్

సినిమా కంటే రంగస్థలం అనేది ప్రజలు, వారి విలువలు, ప్రవృత్తులకు సంబంధించిన ఉత్తమ ప్రతిబింబంగా ఉంటుందని నేను చెబుతాను. ఉదాహరణకు, అవాస్తవాన్ని లేక పలాయనవాద కాల్పనికతను నమ్మింపజేయడం వెండితెర కంటే రంగస్థలం మీద చాలా కష్టం. సినిమాను ముందుగా తీసి చూపించడం కంటే, నాటకాన్ని అప్పటికప్పుడు ప్రదర్శించడం మరింత ఆసక్తిదాయకంగా ఉంటుంది. గత వారం లండన్‌లో నేను చూసిన ఒక సంగీత నాటకమే ఈరోజు మీకు నేను చెప్పబోతున్న ఉదాహరణ.

'ఎవ్రీబడీ ఈజ్ టాకింగ్ ఎబౌట్ జేమీ' అనే ఈ నాటకాన్ని బ్రిటన్ మధ్యప్రాంత పట్టణం షెఫీల్డ్‌లో రూపొందించారు. ఇది అమ్మాయిలా దుస్తులు ధరించాలనుకునే జేమీ అనే పదహారేళ్ల కుర్రాడి గురించిన కథ. అయితే జేమీ హిజ్రా కాదు. పైగా అతడుగే కావలసిన అవసరం కూడా లేదు. ఆకర్షణీయమైన రాణి కావాలనేది అతడి కల. ఆ కల ఎలా నెరవేరింది, శ్రోతల కోసం అతడు హీరోగా ఎలా పరిణమించాడు అనేదే నాటక ఇతివృత్తం.

మరిన్ని వివరాల్లోకి వెళ్లడానికి ముందు ఈ నాటకం గురించి స్థూలంగా చెప్పనివ్వండి. అ సమయంలోనే అమెరికన్ హిప్–హాప్ సంగీత రూపకం హామిల్టన్ బాగా ప్రాచుర్యంలో ఉండేది. ఆ ప్రదర్శన టిక్కెట్లు పూర్తిగా అమ్ముడైపోయాయి. బ్లాక్ మార్కెట్‌లో ఒక టికెట్‌ను వెయ్యి పౌండ్లకు అమ్మినట్లు దళారులు ఘనంగా ప్రకటించారు. వాస్తవం ఏమిటంటే ప్రతి ఒక్కరూ హామిల్టన్ రూపకం గురించే మాట్లాడుతున్నారు తప్ప జేమీ గురించి ప్రస్తావించే వారు కూడా లేరు.

లండన్‌లో ఆ రెండింటినీ నేను చూశాను. హామిల్టన్ చాలా మంచి ప్రదర్శన అంటే నేను నిరాకరించను. కానీ జేమీ మాత్రం అసాధారణమైంది, అరుదైనది కూడా. అదొక విశిష్ట రూపకం. మొత్తంమీద చెప్పాలంటే హామిల్టన్ రూపకం.. చూడటానికి మీరు పెట్టే డబ్బుకు తగిన విలువైనది కాదు. సగటు థియేటర్లలో ఉన్న ధర కంటే ఎక్కువ ధరను పెట్టినప్పటికీ, జేమీ కోసం మీరు పెట్టిన ప్రతి పెన్నీ కూడా విలువైనదే.

బ్రిటన్ గర్వించదగిన నాటకంగా జేమీ ఎందుకు విశిష్టమైనదో తెలుసుకోవడానికి ఇప్పుడు మళ్లీ వెనక్కు వద్దాం. ఒక అబ్బాయి ఒక అమ్మాయిలాగా దుస్తులు ధరించాలన్న కోరికను వెల్లడిస్తే ప్రపంచంలో ఉన్న పలు సమాజాలలో అది కుటుంబ విషాదంగానూ, జనానికి చికాకును, సంకటస్థితిని కలిగించే ఘటనగానూ తయారవుతుంది. అప్పటినుంచి అతడు తెరచాటునే ఉండాల్సి వస్తుంది. తలుపుల వెనుక అతడిని నిర్బంధిస్తారు. పైగా అతడిని ఇక మాట్లాడనివ్వరు. నిజాయితీగా చెప్పాలంటే, భారత్‌లో అతడితో మనం అలాగే వ్యవహరిస్తాం. కానీ ఈ నాటకం మాత్రం అలా చూపలేదు. అందుకే అది అత్యంత ప్రత్యేకమైన నాటకంగా నిలుస్తోంది.

కార్మికవర్గం ప్రధానంగా ఉండే యార్క్‌షైర్ సెట్టింగులో, జేమీ ఆకాంక్షను జీవితానికి సంబంధించిన పరమ సంతోషకరమైన సంబరంగా చిత్రించారు. మీకు మీరు నిజాయితీగా ఉండి, మిగిలిన ప్రపంచం ఏం చెబుతుందో లెక్కపెట్టకుండా ఉన్నట్లయితే, ఈ నాటకంలో సగ భాగం ఈ ఆనందకరమైన సంబరాన్నే చూపిస్తుంది. మరొకటి ఇంకా ముఖ్యమైంది. మీరు కోరుకున్నట్లు ఉండాలని మీరు భావిస్తే ప్రపంచం మిమ్మల్ని ఆమోదిస్తుంది, అంతేకాకుండా మిమ్మల్ని గౌరవించడానికి కూడా ముందుకొస్తుంది.

నాటకం కొనసాగిన రెండున్నర గంటల సమయంలో శ్రోతలు జేమీని చూసి, అతడి తల్లి తన కోరికను ప్రోత్సహించి, సమర్థించే తీరును చూసి పగలబడి నవ్వారు, ఏడ్చారు కూడా. జేమీ మారిన వస్త్రధారణను ఆమోదించని అతడి స్కూల్ టీచర్ తానెంత క్రూరమైన వ్యక్తి అన్నదాన్ని గుర్తించనప్పటికీ, అతడికి మద్దతు పలుకుతూ వచ్చిన తోటి విద్యార్థులు మాత్రం, పెద్దల కంటే పిల్లలే తరచుగా విజ్ఞత కలవారన్న అంశాన్ని శక్తివంతంగా శ్రోతలముందు పెడతారు.

ఆదిత్య హృదయం



చివరకు మెరిసే దుస్తులతో వాటికి సరిపోలే మహిళలు వాడే స్టిలెట్టో హీల్స్‌తో, ఒక బ్లాండ్ విగ్‌తో, మేకప్‌తో జేమీ పాఠశాలకు వచ్చినప్పుడు ఈ నాటకం తనదైన సుందర క్లైమాక్స్‌కు చేరుకుంటుంది. జేమీ మైమరపించే అమ్మాయిని తలపించడంలో సందేహం లేదు కానీ, ఆ క్షణంలో మీరు తిలకించే అసలు మ్యాజిక్ ఏమిటంటే, మానవ స్వప్న సాఫల్యానికి చెందిన నిసర్గ సౌందర్యమే. అది ఆచార సంప్రదాయాలను తోసిపుచ్చినప్పటికీ, జేమ్స్ స్నేహితులు, ఇరుగు పొరుగువారు జేమీ నూతన వస్త్ర ధారణను పూర్తిగా ఆమోదిస్తారు. పరమలోభి అయిన అతడి తండ్రి మాత్రమే వీళ్లందరికీ దూరం జరుగుతాడు.

నాటకం ముగియగానే శ్రోతలు సుదీర్ఘ కరతాళధ్వనులతో అభినందనల్లో ముంచెత్తారు. తర్వాత వెంటనే అందరూ లేచి నిలబడి మరీ ఆ నాటకాన్ని గౌరవించారు. జేమీ తండ్రిని ఛీకొట్టారు.

కాబట్టి, మీరు ఈ సంవత్సరం లండన్ సందర్శించాలని అనుకుంటే.. అడుక్కుని, అరువు తీసుకుని, టిక్కెట్ దొంగిలించి అయినా సరే.. జేమీ నాటకం తప్పక చూడండి. ఇలాంటి నాటకాన్ని మీరు భారత్‌లో ఎన్నటికీ చూడలేరు. నిజం చెప్పాలంటే, ఇలాంటి నాటకాన్ని, ప్రదర్శనను మీ జీవితంలో మరెన్నడూ చూడలేరు కూడా.

కొస మెరుపు : బ్రిటన్ సంగీత రూపకాల చరిత్రలో 'ఎవ్రీబడీ ఈజ్ టాకింగ్ ఎబౌట్ జేమీ' కొత్త ట్రెండ్ సృష్టించింది. 2017లో తొలిసారిగా ప్రదర్శితమైన ఈ సంగీత నాటకం సుప్రసిద్ధ పత్రికల ప్రశంసలను పొందుతోంది. బ్రిటన్‌లోని షెఫీల్డ్ పట్టణంలో, ఒక కౌన్సిల్ ఎస్టేట్‌లో నివసించే 16 ఏళ్ల కుర్రాడు జేమ్స్ పాత్ర మనిషి ఆకాంక్షలను సఫలం చేసుకునే కృషిని ఈ సంగీత రూపకంలో అత్యద్భుతంగా ప్రదర్శించింది. భవిష్యత్తు గురించి భయకంపితుడైన జేమ్స్ ప్రేమమూర్తి అయిన తన తల్లి, స్నేహాన్ని పంచే మిత్రుల దన్నుతో తనలోని దురభిప్రాయాలను అధిగమించి, అంధకారం నుంచి బయటపడటమే కాకుండా ప్రపంచం చూసి ఉండని ఒక సంచలనాత్మక ఘటనను ప్రపంచం ముందుకు తీసుకొచ్చాడు. చివరిక్షణంలో కూడా అనుకున్నది సాధించవచ్చని, మీరు కనే చిన్న చిన్న కలలను కూడా సాకారం చేసుకుని సమాజ ఆమోదం పొందవచ్చని ఒక సున్నితమైన అంశం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పిన ఈ నాటకం పండితులను, పామరులను, విమర్శకులను కూడా ఏకమొత్తంగా ఆకర్షించి తిరుగులేని ప్రాచుర్యం పొందుతోంది. 2017 ఫిబ్రవరి 13న షెఫీల్డ్ లోని క్రుసిబుల్ థియేటర్‌లో ప్రదర్శన ప్రారంభమైన ఈ సంగీత రూపకం బ్రిటన్‌లోని పలు ప్రాంతాల్లో సంవత్సరం పొడవునా ప్రదర్శితమవుతూనే ఉంది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

ఈ–మెయిల్ : karanthapar@itvindia.net

ఒబామా మాటలు – ముత్యాల మూటలు

ఆన్‌లైన్‌లో కనబడే స్థాయి కశ్మలం, రోత మన నిత్య జీవితాల్లో ఎక్కడా కనబడవన్నది నిజం. రాజకీయాలు, మతం వగైరాలపై ముఖాముఖీ కలుసుకున్నప్పుడు వాదించుకుంటే ఇంత చేటు దూషణలు, అవమానకరంగా మాట్లాడటం ఉండనే ఉండదు. ఇంటర్నెట్ మనల్ని గోప్యంగా ఉంచుతుందన్న భావనే ఇష్టానుసారం ఏమైనా మాట్లాడవచ్చునన్న ఆత్మ విశ్వాసాన్ని మనలో ఏర్పరుస్తుంది. వ్యక్తిగతంగా మనమంతా సమ్యక్ దృష్టితో మెలగుతాం. ఎవరో మనల్ని గమనిస్తున్నారన్న భావన వల్లే ఇలా ఉండగలుగుతాం.

అవలోకనం


ఆకార్ పటేల్

మన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మాదిరే అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కూడా ప్రపంచం గుర్తించి గౌరవించే మేధావి. వీరిద్దరూ విఫల నేతలేనని కొందరనుకుంటారు. అందుకు ఒక కారణం ఉంది. మన్మోహన్ వలే జనాకర్షణ శక్తిగానీ, సొంతబలంగానీ లేకపోవడం... ఒబామాలా జాతిపరంగా మైనారిటీ నేతలన్న భావం వీరిపట్ల ఉండటం ఆ కారణమని నేననుకుంటాను. అయితే ఈ నాయకులిద్దరూ ఇతర నేతల్లా తరచు మాట్లాడకపోవచ్చుగానీ చాలా తెలివైన వారు. వారు మాట్లాడినప్పుడు వినడం అనివార్యంగా మనకు ప్రయోజనకరమవుతుంది. కొన్ని రోజులక్రితం బ్రిటన్ యువరాజు ప్రిన్స్ హ్యారీకి ఒబామా అద్భుతమైన ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో ఆయన సామాజిక మాధ్యమాల గురించి, ఆధునిక ప్రపంచంపై దాని ప్రభావం గురించి ఎంతో చక్కగా మాట్లాడారు. ఉమ్మడి ప్రయోజనాలుండే వారందరూ ఒకరి గురించి ఒకరు తెలుసుకోవడానికీ, సంబంధబాంధవ్యాలు నెలకొల్పుకోవడానికీ ఈ మాధ్యమాలు నిజంగా శక్తివంతమైన ఉపకరణాలన్న సంగతిని ఆయన అంగీకరించారు. 'అయితే ఇలాంటి వారంతా ఏ పబ్‌లోనో, ప్రార్థనాలయం వద్దనో, మరెక్కడైనా కలుసుకోవాలి. ఒకరి గురించి మరొకరు తెలుసుకోవాలి' అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందుకు గల కారణం కూడా చెప్పారు. 'ఇంటర్నెట్‌లో ఏర్పడ్డ సంబంధాల్లో అంతా సూక్ష్మంగా, సాధారణంగా కనిపిస్తుంది. కానీ ముఖాముఖీ కలిసినప్పుడు మాత్రమే అవతలివారెంత సంక్లిష్టమైనవారో అర్థమవుతుంది' అని ఆయన వివరించారు. 'ఇంటర్నెట్‌తో ఉన్న మరో ప్రమాదమేమంటే తమకు దానిద్వారా పరిచయమయ్యే వారిలో వేరే రకమైన వాస్తవాలు దాగి ఉండొచ్చు. పర్యవసానంగా వారు తమకుండే దురభిప్రాయాలను బలపర్చుకునే సమాచారంలోనే కూరుకుపోతారు' అని కూడా ఒబామా అభిప్రాయపడ్డారు. మనం ఇంటర్నెట్ ఉపయోగించే తీరుకు సంబంధించి ఆయనొక ముఖ్యమైన, అవసరమైన విషయాన్ని పట్టుకున్నారని నాకనిపిస్తుంది. వ్యక్తిగతంగా నేను ఏ సామాజిక మాధ్యమాల్లో లేను. ఎందుకంటే అవి మన ఏకాగ్రతను భంగపరుస్తాయి. నా ఆన్‌లైన్ వ్యాసాలపై వచ్చే వ్యాఖ్యలను గమనించినప్పుడు నా మనసెంతో వ్యాకులపడుతుంది. ఆ వ్యాఖ్యల్లో కనబడే ఆగ్రహమూ, దుర్మార్గమూ, మితిమీరిన భాష గమనిస్తే ఎవరినైనా దూరం పెట్టక తప్పదనిపిస్తుంది.



ఆన్‌లైన్‌లో కనబడే స్థాయి కశ్మలం, రోత మన నిత్య జీవితాల్లో ఎక్కడా కనబడవన్నది నిజం. రాజకీయాలు, మతం వగైరాలపై ముఖాముఖీ కలుసుకున్నప్పుడు వాదించుకుంటే ఇంత చేటు దూషణలు, అవమానకరంగా మాట్లాడటం ఉండనే ఉండదు. ఇంటర్నెట్ మనల్ని గోప్యంగా ఉంచుతుందన్న భావనే ఇష్టానుసారం ఏమైనా మాట్లాడవచ్చునన్న ఆత్మ విశ్వాసాన్ని మనలో ఏర్పరుస్తుంది. వ్యక్తిగతంగా మనమంతా సమ్యక్ దృష్టితో మెలగుతాం. ఎవరో మనల్ని గమనిస్తున్నారన్న భావన వల్లే ఇలా ఉండగలుగుతాం. ఒబామా చెప్పిన మరో ముఖ్యాంశమేమంటే మనం ప్రత్యేకించి ఎంపిక చేసుకుంటే తప్ప లేదా కోరుకుంటే తప్ప అతడు/ఆమె వైఖరేమిటో మనకు తెలిసే అవకాశం లేదు. నిజజీవితంలో ఎవరితోనైనా మనం వ్యవహరిస్తున్నప్పుడు వారు చెప్పేది కూడా మనం విని తీరవలసి వస్తుంది. అది మన నిశ్చయాన్ని, మన ప్రతికూల అభిప్రాయాలను పల్చబారుస్తుంది. ఒబామా మనకిచ్చిన లోచూపు నుంచి మనం కొన్నిటిని గ్రహించవచ్చు. అందులో మొదటిది–తమ పని ద్వారా మార్పునాశించే క్రియాశీలవాదులు, రాజకీయ నాయకులు ఇంటర్నెట్ ద్వారా కాక నేరుగా ప్రజలను కలుసుకోవాలి. వారితో సంబంధాలు నెలకొల్పుకోవాలి. నేను పనిచేసే చోటుకు కొన్ని వారాల క్రితం దళిత నాయకుడు జిగ్నేశ్ మేవానీ వచ్చారు. ఆయన తన దృక్కోణాన్ని, ఆశలను వివరించారు. ఎన్నికల రాజకీయాల గురించి మాట్లాడినప్పుడు అది తన స్వల్ప కాల లక్ష్యమేమీ కాదని, పదిపదిహేనేళ్లుగా అందులో విజయం కోసం ఎదురుచూస్తున్నానని చెప్పారు. రెండు ప్రధాన పార్టీలు మాత్రమే బలంగా ఉండే గుజరాత్‌లాంటి రాష్ట్రంలో స్వతంత్ర అభ్యర్థిగా సులభంగా నెగ్గుతానని ఆయన ఎప్పుడూ అనుకుని ఉండరు. పైగా ఆయనకు బాగా ప్రాచుర్యంలో ఉన్న ఎన్నికల గుర్తు లేదు. కేవలం తన సొంత విశ్వసనీయతే ఆధారం. మరి ఇదెలా సాధ్యమైంది? తెలివిగా మాట్లాడటం, ఒప్పించే గుణం ఉండే ప్రసంగాలు చేయడం... వేలాదిమందిని వ్యక్తిగతంగా కలవడం వల్లే మేవానీ గెలుపు సాధించగలిగారని నేననుకుంటున్నాను.

నావంటి మానవ హక్కుల కార్యకర్త కూడా ఇదేవిధంగా జనాన్ని కలుసుకోవాలి. ఇది నేనెందుకు చెబుతున్నానంటే క్రియాశీల ప్రపంచం సామాజిక మాధ్యమాలపైనే దృష్టి పెడుతుంది. దానిద్వారా భారీ సంఖ్యలో ప్రజలకు చేరువ కావొచ్చునన్నది అందులో పనిచేసేవారి అభిప్రాయం. కానీ ఒబామా చెప్పినట్టు ఆ మాధ్యమాలు కృత్రిమంగా విభజితమై ఉంటాయి. నిరాదరణకు లోనయ్యే ముస్లింలు, దళితులు, ఆదివాసీలు లేదా కశ్మీరీ ప్రజల హక్కుల కోసం పనిచేసే వారికి మీరు సైనికుల హక్కుల గురించి మాట్లాడరేమన్న ప్రశ్న తరచుగా ఎదురవుతుంది. ఇంటర్నెట్‌లో అయితే ఇలాంటి తప్పుడు ద్వంద్వాలను సులభంగా కొనసాగేలా చూడొచ్చు. ముఖాముఖీలో అవతలి వ్యక్తి ఆందోళనల్ని కొట్టిపారేయడం అంత సులభం కాదు. మనం మన చుట్టూ ఉన్న పరిస్థితుల్ని చూసి నిరాశ పడనవసరం లేదని (తరచు నాకు అలా అనిపిస్తుంటుంది) ఒబామా అంతర్దృష్టి చెబుతుంది. అంతమాత్రాన సామాజిక మాధ్యమాలు ఉత్త చెత్త అని ఒబామా అన్నారని మనం అర్థం చేసుకోకూడదు. 'బహుళ విధ స్వరాలను అనుమతించేలా, అదే సమయంలో సమాజంలో చీలికలు తీసుకు రాకుండా, ఒక ఉమ్మడి భూమికను కనుగొనేలా రూపొందడం కోసం మనం ఈ సాంకేతికతను ఎలా నియంత్రణలోకి తెచ్చుకుంటామన్నదే ప్రశ్న' అని ఆయన చెప్పిన సంగతిని గుర్తుచేసుకోవాలి. అత్యద్భుతమైన ఈ మాటలు మన దేశానికి ఎంతో కీలకమైన ఈ కొత్త సంవత్సరంలో గుర్తుంచుకోదగ్గవి.

వ్యాసకర్త కాలమిస్టు, రచయిత

వేలానికి హిట్లర్ వాహనం

నాజీ సైనికుల వందనం తీసుకుంటూ జర్మనీ నియంత హిట్లర్ నిలబడి కనిపించిన వాహనం– మెర్సిడెజ్ బెంజ్ 770కె ఇప్పుడు వేలానికి వచ్చింది. వరల్డ్‌వైడ్ ఆక్షనీర్స్ సంస్థ దీనిని ఈ 17న వేలం వేస్తున్నది. కానీ ఈ వేలంలో అందరికీ ప్రవేశం లేదు. పాల్గొనే వారిని ముందు ఆక్షనీర్స్ సంస్థ వ్యవస్థాపకులలో ఒకడు రాన్ ఎడ్గాన్ పరీక్ష చేస్తారు. ఆ పరీక్షలో ఉత్తీర్ణులైతేనే వేలానికి వెళ్లాలి. 1945లో రెండో ప్రపంచ యుద్ధం చరమఘట్టంలో అమెరికా సైనికులు ఈ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కొద్దికాలం దీనిని ఫ్రాన్స్‌లో ఉంచారు. హిట్లర్, నాజీలు నిర్వహించిన శిబిరాలలో 60 లక్షల మంది యూదులు ఊచకోతకు గురయ్యారని చరిత్రకారుల అంచనా. ఈ వాహనం వేలం వేయగా వచ్చిన డబ్బును నాజీల చేతిలో నాశనమైన కుటుంబాల వారి పిల్లల చదువుకు ఉపయోగిస్తారట.

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం
దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం
తిథి బ.షష్ఠి రా.9.47 వరకు, తదుపరి సప్తమి
నక్షత్రం పుబ్బ ఉ.7.05 వరకు, తదుపరి ఉత్తర
వర్జ్యం ప.2.08 నుంచి 3.43 వరకు
దుర్ముహూర్తం సా.4.08 నుంచి 4.51 వరకు
అమృతఘడియలు రా.11.34 నుంచి 1.10వరకు.

నమాజ్ వేళలు

ఫజర్	:	5.31
జొహర్	:	12.22
అసర్	:	4.21
మగ్రీబ్	:	5.57
ఇషా	:	7.14

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం : 5.36
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

24 గంటల విద్యుత్‌పై స్వామినాథన్ ఆనందం

లేఖలో సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయడంపై ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ ఆనందం వ్యక్తం చేశారు. పాడి వ్యవసాయ రాష్ట్రమైన తెలంగాణలో రైతులకు ఇది వరం లాంటిందని ప్రశంసించారు. పంటల జీవాన్ని నిలిపే సాగునీరే వ్యవసాయంలో విజయవంతం కావడానికి కీలకమన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరాతో రైతులకు సాగునీటి భద్రత కల్పించినందుకు రైతుల తరపున ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన లేఖ రాశారు. అలాగే సీఎం కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు, రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సోమవారం కౌన్సెలింగ్‌కు హాజరుకానున్న ప్రదీప్



హైదరాబాద్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడి, తప్పించుకు తిరుగుతున్న ప్రముఖ యాంకర్ మాచిరాజు ప్రదీప్ సోమవారం బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్‌కు హాజరుకానున్నారు. ఈ మేరకు ట్రాఫిక్ డీసీపీ చౌహాన్‌కు ప్రదీప్ సమాచారం అందించారు. డిసెంబర్ 31న అర్ధరాత్రి సమయంలో మద్యం సేవించి వాహనం నడుపుతూ ప్రదీప్ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన విషయం తెలిసిందే. కౌన్సెలింగ్‌కు హాజరుకాకపోవడంతో పోలీసులు కేపీహెచ్‌బీలోని ఆయన కార్యాలయంతోపాటు మణికొండలోని నివాసంలో నోటీసులు అందించేందుకు యత్నించి అందుబాటులో లేకపోవడంతో వెనక్కి వచ్చారు. దీంతో ప్రదీప్ పరారీలో ఉన్నట్లు ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఇది తెలుసుకున్న ప్రదీప్ శుక్రవారం వీడియో ద్వారా తాను కౌన్సెలింగ్‌కు హాజరుకాబోతున్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం తల్లి లేదా భార్యను కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సి ఉంటుంది. పెళ్లి కాలేదు కాబట్టి తల్లిని తీసుకొని రావాలని నిబంధనలను పోలీసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా కారు అద్దాలకు బ్లాక్‌ఫిలిం ఏర్పాటు చేసుకున్న ఘటనలోనూ ప్రదీప్‌పై పోలీసులు జరిమానా విధించేందుకు సిద్ధమవుతున్నారు.

'3 నెలల్లో 500 కోట్ల ఉపాధి పనులు'

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 3 నెలల్లో రూ.500 కోట్ల ఉపాధి పనులు పూర్తిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారులతో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధి హామీ జాబ్ కార్డులున్న కూలీకి 100 రోజుల పనిదినాలను కల్పించాలనే లక్ష్యంతో పనిచేయాలని ఆదేశించారు. పథకం కింద చేపట్టిన పంచాయతీ భవనాలు, వైకుంఠధామాలు, స్కూల్ టాయిలెట్లు మార్చిలోగా పూర్తిచేయాలన్నారు. ఉపాధి కూలీలకు సంబంధించి సస్పెండ్ అకౌంట్లలో జమ అయిన డబ్బులను బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతాలు తెరిపించి, కూలీల ఖాతాల్లో జమ చేయాలన్నారు. వచ్చే ఏడాది హరితహారంలో మొక్కలు నాటేందుకు కావాల్సిన నర్సరీలను పెంచడానికి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు.

ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ మరియు డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా

INSURANCE REGULATORY AND DEVELOPMENT AUTHORITY OF INDIA

బీమాకి ప్రోత్సాహం బీమాదారుని సంరక్షణ.

3వ అంతస్తు, పరిశ్రమ్ భవన్, బషీర్‌బాగ్, హైదరాబాద్-500004

www.irda.gov.in www.policyholder.gov.in

సరైన నిర్ణయం ద్వారా బీమా విలువ అమూల్యం: కొన్ని ముఖ్య సలహాలు

1. నేరుగా నమోదిత బీమా కంపెనీలు లేదా దిగువ పేర్కొన్న వారి ద్వారా మీరు బీమా పాలసీలను కొనుగులు చేసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి:

- ఇన్సూరర్ ద్వారా నియమితులైన ఇన్సూరెన్స్ ఎజెంట్స్/కార్పోరేట్ ఎజెంట్స్
- లైసెన్స్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ మరియు సర్వసాధారణ సేవా కేంద్రాలు (సిఎస్‌సిలు)
- లైసెన్స్ వెబ్ ఎగ్రిగేటర్స్
- బీమా మార్కెటింగ్ సంస్థలు

2. చెల్లింపులు చేసే ముందు వ్యక్తి నిజాయితిని మరియు గుర్తింపు పరిశీలించుకోండి:

- వ్యక్తి యొక్క గుర్తింపు ఋజువును/అందిస్తున్న బీమా ఋజువును అడగండి
- వ్యక్తి యొక్క చిరునామా మరియు టెలిఫోన్ నంబర్ మరియు సంస్థ యొక్క గుర్తింపు ప్రత్యేకించి టెలిసేల్స్ అయితే తప్పకుండా అడగాలి
- బీమా కంపెనీలు, బ్రోకర్స్ మరియు వెబ్ ఎగ్రిగేటర్స్/ఐఎమ్ఎఫ్‌ల వివరాలు పరిశీలించుకునేందుకు ఐఆర్‌డిఏఐ వెబ్‌సైట్‌ని పరిశీలించండి.
- ఎజెంట్స్/కార్పోరేట్ ఎజెంట్స్‌కి సంబంధించిన పూచికోసం బీమా కంపెనీలను అడిగితెలుసుకోండి.
- చెక్ ద్వారా ప్రీమియం చెల్లింపులు కొనసాగిస్తే, దయచేసి దాని పైన నమోదిత బీమా కంపెనీ పేరు ఉండేలా చూసుకోండి మరియు చెల్లింపు రసీదు కూడా తీసుకోండి.
- వ్యక్తిగతంగా ఎవరి పేరు మీద కూడా చెల్లింపులు చేయకండి; ఒకవేల నగదు రూపంలో చెల్లింపులు కొనసాగిస్తున్నప్పుడు ఇస్తున్నవారి ప్రతిష్టను పరిశీలించుకోండి.

3. ఈ క్రిందివాటి ఆధారంగా మీకు అనువైన బీమా పాలసీని ఎంచుకోండి:

- జీవితపు దశ, ఆర్థిక స్థితి మరియు ఆర్థిక అవసరాలు
- పాలసీ కొనుగోలు చేయడానికి గల కారణాలు:
  - జీవితం లేదా ఆస్తికి కలిగే రిస్క్ (ప్రమాదం)ని బీమా చెయ్యడం
  - దీర్ఘ-కాలిక పొదుపుల నిమిత్తం
  - భవిష్యత్తులో ఆస్పత్రి చికిత్స ఖర్చుల నిమిత్తం
  - విధ్యుక్త (తప్పనిసరి) అవసరార్థం
  - వార్ధక్యం/ పెన్షన్/ అన్యుటీ కోసం ఆదా చెయ్యడం
- హామీ చెయ్యబడిన మొత్తం/బీమా చెయ్యబడిన మొత్తపు సముచిత ప్రయోజనాలు
- ఆదాయపు పన్ను మినహాయింపు నిమిత్తం (ఒకవేళ వర్తిస్తే)

4. ఒక బీమా పాలసీని కొంటున్నప్పుడు ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోండి:

- వివరణ పత్రాన్ని మరియు ప్రతిపాదన పత్రాన్ని (proposal form) జాగ్రత్తగా చదవండి
- ప్రతిపాదన పత్రంపై సంతకం చేసేముందు, వివరాలన్నిటినీ పూర్తిగా నింపండి
- ప్రతిపాదన పత్రం యొక్క కాపీని మీ అవసరార్థం ఉంచుకోండి



- బీమా చేస్తున్న సంస్థకి, ప్రతిపాదనని స్వీకరించిన 30 రోజులలోగా, ప్రతిపాదన పత్రం యొక్క కాపీని ఉచితంగా అందజేయవలసిన బాధ్యత ఉంది.
- పాలసీ డాక్యుమెంట్‌ని త్వరితంగా పొందేందుకు, బీమా సంస్థ లేదా ఏజెంట్/బ్రోకర్‌ను సంప్రదించండి.

5. జీవిత బీమా పాలసీ ముఖ్యంగా అపాయం నుంచి జీవిత బీమా రక్షణ కల్పిస్తుంది. కానీ ఇది దీర్ఘకాలిక పెట్టుబడికి ఒక సాధనంగా కూడా ఉపయోగ పడాలంటే, దీర్ఘకాలిక నిబద్ధత అవసరం. జీవిత బీమా పాలసీని పొందిన తర్వాత మీరీ క్రిందవాటిని శ్రద్ధగా గమనించండి:

- పాలసీ డాక్యుమెంట్‌ని చదవండి.
- ప్రీమియం చెల్లింపు విధానం, పాలసీ అవధి, ఆఫర్ చేస్తున్న పరిపక్వత ప్రయోజనాలు, లాక్-ఇన్ అవధి, సరెండర్ (సమర్పణ) మొత్తం మొదలైనవాటిని పరీక్షించుకోండి.
- పాలసీ దస్తావేజాలోగల నియమాలు మరియు నిబంధనలు కొనుగోలు ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు ప్రాస్పెక్టస్‌లో సూచించిన విధంగానే ఉన్నాయా చూసుకోవాలి.
- మీరు కనక షరతులు, నిబంధనలని అంగీకరించకపోతే, పాలసీ పొందిన తేదీకి 15 రోజుల లోగా (ఎలక్ట్రానిక్ పాలసీల విషయంలో 30 రోజులు) మీకు గల అభ్యంతరాలకి కారణాలను ఇస్తూ, పాలసీని బీమా సంస్థకి తిరిగి ఇచ్చేయవచ్చు. అనుపాత ప్రీమియం వైద్య పరీక్షలకై బీమా సంస్థ భరించిన ఖర్చులు మరియు స్టాంప్ ఛార్జీల మినహాయింపుల తర్వాత మిగిలిన మీ ప్రీమియంను (రీఫండ్) తిరిగి పొందేందుకు మీరు అర్హులు.
- ప్రీమియంను క్రమబద్ధంగాను, నిర్ణీత సమయానికీ కడుతూ ఉండండి; పాలసీ అంతరించకుండా (లాప్స్ అవకుండా) చూసుకోండి.
- సమయం ప్రకారం ప్రీమియం చెల్లిస్తేనే పూర్తి బీమా భద్రత మరియు లాభాలు దొరుకుతాయి కాబట్టి, బీమా పాలసీ నుంచి అత్యధిక లాభాన్ని పొందేందుకు నిరంతరాయంగా పాలసీని కొనసాగించుకోవాలి.
- మీ కుటుంబ సభ్యులకు, ప్రత్యేకించి నామినీలకు, బీమా పాలసీని కొన్న విషయం మరియు దాని ప్రయోజనాల గురించి తెలియజేయండి.

6. నకిలీ కాల్స్ చేసేవారి ప్రలోభాలకు లొంగి పోకండి. బీమా పాలిసీల అమ్మకం లేదా రిడెంప్షన్ (విడుదల)తో ప్రమేయం ఉన్న అధిక రాబడులు లేదా అకారణమైన లాభాల గురించి చేసే కృత్రిమ ఆఫర్లకు గురి కాకండి.

7. ఐఆర్‌డిఏఐ పేరు చెప్పుకొని బోనస్‌ను మరియు పెట్టుబడిపై లాభాల గురించి చెప్పేవారి ప్రలోభాలకు మోసపోవద్దు. ఐఆర్‌డిఏఐ ఎలాంటి బీమా పథకాలను మరియు ఆర్థిక పథకాలను అమ్మజూపదు మరియు బీమా ప్రీమియం పెట్టుబడులలో జోక్యం చేసుకోదు.

8. ఎవరైనా లైసెన్స్ లేని మధ్యవర్తులు లేదా రిజిస్టర్ చెయ్యని బీమా సంస్థలు బీమాని అభ్యర్థిస్తే, పోలీసు వద్ద ఎఫ్ఐఆర్‌ని నమోదు చేసి, ఐఆర్‌డిఏఐకి తెలియజేయండి. సదరు లైసెన్స్ లేని మధ్యవర్తులు లేదా రిజిస్టర్ చెయ్యని బీమా సంస్థలకు చేసిన ఏ చెల్లింపులకు, తదుపరి పరిణామాలకు మీరు మాత్రమే బాధ్యులు.

నిరాకరణ: ఇది మీకు సాధారణ సమాచారం అందజేసేందుకు మాత్రమే ఉద్దేశింపబడినది మరియు పూర్తి వివరణలు విపులీకరించలేదు. ఇది అవగాహన కల్పించటానికి మాత్రమే ప్రారంభింపబడినది మరియు మీకు ఎటువంటి న్యాయపరమైన సలహా ఇవ్వటానికి కాదు.

సాక్షి
రాష్ట్రీయం

హైదరాబాద్
ఆదివారం | జనవరి | 7 | 2018

ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు 23 అతిపెద్ద పతంగుల పండుగలు జరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా ఫిబ్రవరి, డిసెంబర్ నెలల్లో తప్ప ప్రతీ నెలా ఏదో ఒక చోట పతంగుల పండుగ జరుగుతుంది.



అసలు మందు బాబులు..



డిసెంబర్ 31 అనగానే నూతన సంవత్సర వేడుకలు గుర్తొస్తాయి. ఆ వేడుకలను ఒక్కొక్కరు ఒక్కో రీతిలో జరుపుకొంటారు. ఇక మందు బాబుల గురించి చెప్పక్కర్లేదు.. అయితే న్యూజిలాండ్‌లోని కోరమాండల్ ద్వీపకల్పంలో మద్యంపై పూర్తిగా నిషేధం ఉంది. అక్కడ కూడా మన దగ్గరి లాగే పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించారు.. ఎవరూ తాగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టారు. అయితే కొందరు మందు బాబులు ఏం చేశారో తెలుసా...? సముద్ర జలాల్లో నీరు తక్కువగా ఉన్న చోట ఇసుకతో చిన్నపాటి ద్వీపంలా కట్టేసుకుని.. బల్లలు వేసుకుని మందు కొడుతూ.. ఫుల్‌గా ఎంజాయ్ చేశారు. ఎందుకంటే సాంకేతికంగా వారు న్యూజిలాండ్ గడ్డపై లేరని.. అంతర్జాతీయ జలాల్లో ఉన్నారని.. దీంతో మద్య నిషేధానికి లోబడి ఉండాల్సిన అవసరం లేదన్నది వారి వాదన. ఇది తెలిసి పోలీసులు ముక్కున వేలేసుకున్నారు.

సుసుఫాన్ సూపర్

దేవుడు ఇచ్చిన లోపాలు కొందరి పాలిట వరంగా మారుతాయి. జుట్టు సుందరిగా పేరొందిన సుపాత్ర నాటీ సుసుఫాన్ ఓ రకంగా అదృష్టవంతురాలే..! ఆంబ్రోస్ సింబ్రోమ్ అనే వ్యాధి కారణంగా ఆమె శరీరం మొత్తం జుట్టు పెరిగింది. ముఖం కూడా జుట్టుతో నిండిపోయింది. 2010లో ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ జుట్టు కలిగిన మనిషిగా సుసుఫాన్ గుర్తింపు పొందింది.



గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి కూడా ఎక్కింది. ఏడేళ్ల తర్వాత సుసుఫాన్ సామాజిక మాధ్యమంలో చేసిన పోస్టు ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఏంటంటే తన జీవిత భాగస్వామిని కలుసుకున్నానని, పెళ్లి చేసుకున్నానని వెల్లడించింది. ఆంబ్రోస్ సింబ్రోమ్ జెనెటిక్ లోపం అత్యంత అరుదుగా వస్తుంది.



కేటీఆర్.. నోరు అదుపులో పెట్టుకో

టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: మంత్రి కేటీఆర్ నోటిని అదుపులో పెట్టుకోవాలని, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై మాట్లాడే స్థాయి కేటీఆర్‌కు లేదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, అధికార ప్రతినిధి జి.నిరంజన్ అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితోనే తెలంగాణ వచ్చిందన్నారు. సోనియాగాంధీ ఇచ్చిన తెలంగాణలో అధికారం సాధించిన కేటీఆర్‌కు అహంకారం పెరిగిపోయిందని, కన్నూ మిన్నూ కానకుండా మాట్లాడుతున్నాడని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించలేని అసమర్థతను ప్రధాన ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్ నిలదీస్తుందన్నారు. సమస్యల గురించి మాట్లాడకుండా కేటీఆర్ వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని, దూషణలు మానుకోకుంటే తగిన బుద్ధి చెప్తామని మల్లు రవి హెచ్చరించారు.

మంత్రి లక్ష్మారెడ్డి దొంగ డాక్టరే : రేవంత్



సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి దొంగ సర్టిఫికెట్ డాక్టర్ అని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఇప్పటికీ తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని, వాస్తవాలు నిరూపించడానికి బహిరంగచర్చకు సిద్ధమన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2004లో ఇచ్చిన ఎన్నికల అఫిడవిట్‌లో 1988లో గుల్బర్గా వర్సిటీ నుంచి, 2014 లో ఇచ్చిన అఫిడవిట్‌లో 1987లో కర్ణాటక వర్సిటీ నుంచి వైద్యవిద్యలో ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారన్నారు. ఈ రెండింటిలో ఏది వాస్తవమో మంత్రి చెప్పాలన్నారు. సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోపతి నుంచి 1990లో గుల్బర్గా వర్సిటీకి, కర్ణాటక వర్సిటీకి 1988లో అనుమతులు వచ్చాయన్నారు. ఆయా వర్సిటీలకు అనుమతులు రాకముందే లక్ష్మారెడ్డి ఉత్తీర్ణుడైనట్లున్నారన్నారు. తనపై, తన కుటుంబసభ్యులపై సోషల్ మీడియాలో వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ ప్రచారం చేస్తున్నారని, వీటికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

'మాకు తెలంగాణలో ఉద్యోగం ఇవ్వండి'

సాక్షి, హైదరాబాద్: 'బంగారు తెలంగాణ కోసం ఉద్యమంలో పాల్గొన్నాం. ప్రత్యేక తెలంగాణ వస్తే మన రాష్ట్రంలో మనం పని చేసుకోవచ్చని ఆందోళనలు చేశాం. తీరా తెలంగాణ వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు మమ్మల్ని కేటాయించడం బాధాకరం'అని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగులు ఏపీ సచివాలయం ప్రధాన గేటు ముందు శనివారం ఆందోళన నిర్వహించారు. తాము తెలంగాణ ప్రభుత్వంలో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కేసీఆర్‌కు అమ్ముడుపోయిన గవర్నర్: వీహెచ్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు గవర్నర్ నరసింహన్ అమ్ముడుపోయారని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, గవర్నర్ ఏకపక్షంగా పనిచేస్తున్నారని, ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గవర్నర్ పదవిని కాపాడుకోవడానికి చెంచాగిరీ చేస్తున్నారని ఆరోపించారు. గుళ్లు, గోపురాలు తిరగడానికి తప్ప గవర్నర్ దేనికీ పనికిరారని విమర్శించారు. ఇలాంటి గవర్నర్‌ను కలిస్తే ప్రయోజనం ఏమీ లేదన్నారు. రైతులకు నాణ్యమైన కరెంటును ఇస్తే సరిపోతుందని, 24 గంటల కరెంటు అవసరంలేదన్నారు. ఈ సమస్యలను గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం వల్ల ప్రయోజనం లేదన్నారు. గ్రామ గ్రామాన తిరిగి ప్రజలకే చెప్పాలని వీహెచ్ అన్నారు.

మేడారం జాతరకు రండి

ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్‌కు బీజేపీ ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు రావాల్సిందిగా బీజేపీ రాష్ట్ర శాఖ ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌ను ఆహ్వానించింది. ఈ మేరకు పార్టీ ప్రతినిధి బృందం ఆ రాష్ట్ర రాజధానికి వెళ్లి ఆయనకు ఆహ్వాన పత్రాన్ని అందించింది. జాతర వివరాలు తెలుసుకున్న రమణ్‌సింగ్ అందులో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నారని ప్రతినిధి బృందం తెలిపింది. రమణ్‌సింగ్‌ను కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చింతా సాంబమూర్తి, ప్రేమేందర్‌రెడ్డి, మేడారం జాతర సేవా సమితి అధ్యక్షుడు చందా లింగయ్య ఉన్నారు.

మేడారం జాతరకు రూ.2 కోట్లు

సాక్షి, హైదరాబాద్: మేడారం జాతరలో ఏర్పాట్ల కోసం దేవాదాయ శాఖ రూ.2 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వు జారీ చేసింది. నిధులు డ్రా చేసుకుని ఏర్పాట్లు చేపట్టాల్సిందిగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌కు సూచించింది.

మెడికల్ సీట్ల పేరుతో కుచ్చుటోపీ!

బెంగళూరు కేంద్రంగా దందా

- ఎంసెట్ స్కాం నిందితులే కీలక సూత్రధారులు?
- దేశవ్యాప్తంగా వందల మందికి కుచ్చుటోపీ పెట్టిన గ్యాంగ్
- నకిలీ ఓటర్, ఆధార్ కార్డులు చూపించి హోటల్‌లో బస
- బొల్లారంలో కేసు నమోదు, సీఐడీతో కలసి పోలీసుల దర్యాప్తు



సాక్షి, హైదరాబాద్:

అదే గ్యాంగ్... మళ్లీ అదే తరహా మోసం. తమ పిల్లలను డాక్టర్లు చేయాలన్న తల్లిదండ్రుల ఆరాటమే ఆ ముఠాకు కాసుల వర్షం కురిపిస్తోంది. గతంలో మెడికల్ పీజీ సీట్లు, ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తామని పలువురిని మోసగించినట్టే ఇప్పుడు కూడా సీట్ల పేరుతో ఆ ముఠా పలువురిని నిండా ముంచినట్టు తెలుస్తోంది. కర్ణాటక కేంద్రంగా సాగిన ఈ దందాలో మరోసారి రాష్ట్రంలోని పలువురు విద్యార్థులు అన్యాయమయ్యారు. కర్ణాటకలోని ప్రముఖ మెడికల్ కాలేజీలో మేనేజ్‌మెంట్ కోటాలో తక్కువ ఫీజుకే ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని చెప్పి హైదరాబాద్‌కు చెందిన ఓ డాక్టర్‌నుంచి ఈ ముఠా లక్షల రూపాయలను దండుకుంది.

తక్కువ ఫీజుకే సీటు పేరుతో ఎర!

ఎంసెట్ సీజన్ రాగానే గద్దల్లా వాలిపోయే పలు నకిలీ కన్సల్టెన్సీలు విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలను సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారింది. తక్కువ ఫీజుకే ఎంబీబీఎస్ సీటు వస్తుందంటే పక్క రాష్ట్రం అనికూడా చూడకుండా ముందే డబ్బు కట్టేస్తారు. ఇప్పుడు అదేరీతిలో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల పేరుతో కర్ణాటకకు చెందిన గ్యాంగ్ హైదరాబాద్ బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ డాక్టర్‌ను మోసం చేసింది. తమ అల్లుడికి ఎంబీబీఎస్ సీటు కోసం రూ.44 లక్షలు కట్టి మోసపోయినట్టు ఆ డాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన బొల్లారం పోలీసులు ఆ ముఠాకోసం దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. మన రాష్ట్రంతో పాటు రాజస్తాన్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఈ గ్యాంగ్ మేనేజ్‌మెంట్ కోటాలో సీట్ల పేరుతో వందలాదిమందిని మోసగించినట్లు తమ దర్యాప్తులో బయపడిందని నార్త్‌జోన్ డీసీపీ సుమతి 'సాక్షి'కి తెలిపారు. వీరందరినుంచి వసూలు చేసిన సొమ్ము కోట్లలో ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఎంసెట్ డాటా బేస్‌తోనే ఫోన్లు..

ఎంసెట్ రాసే విద్యార్థుల డాటా బేస్‌తో వారి తల్లిదండ్రులను ఈ ముఠా ఫోన్లలో సంప్రదించినట్టు పోలీసులు తెలిపారు. ఇందులో భాగంగానే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి వారిని బెంగళూరులోని రిడ్జ్ హోటల్‌కు పిలిపించుకున్నారు. మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు, కాలేజీల వివరాలు చెప్పి నమ్మించారు. అక్కడే వారి నుంచి కొంత నగదు తీసుకొని తర్వాత చేతులెత్తేసినట్టు తెలిపారు. గతంలో కూడా ఇదే రీతిలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో పీజీ మెడికల్ సీట్ల స్కాం జరిగింది. గత ఏడాది కూడా సీట్లు ఇప్పిస్తామంటూ ఏకంగా ఎంసెట్ ప్రశ్నపత్రం లీక్ చేయించారు. లీకైన ప్రశ్న పత్రం ఆధారంగా విద్యార్థులను ముంబై, కోల్‌కతా, పుణే తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి శిక్షణ ఇప్పించారు.

నకిలీ ఆధార్, ఓటర్ కార్డులు..

మేనేజ్‌మెంట్ కోటా సీట్ల పేరుతో మోసానికి పాల్పడ్డ గ్యాంగ్ చాకచక్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. బెంగళూరులోని హోటల్‌లో దిగిన ఈ ముఠా సభ్యులు రూం బుక్ చేసిన సందర్భంలో ఆధార్, ఓటర్ కార్డులను అడ్రస్ నిమిత్తం సమర్పించారు. అయితే దర్యాప్తులో పోలీసులకు ఆశ్చర్యపోయే విషయాలు తెలిశాయి. ముఠా సభ్యులు బస చేసిన హోటల్‌కు సమర్పించిన ఆధార్, ఓటర్ కార్డులు నకిలీవని తేల్చారు. అలాగే పలువురు తల్లిదండ్రులు నగదును బదిలీచేసిన బ్యాంక్ ఖాతా వివరాలను తనిఖీ చేయగా, కోల్‌కతాలోని ఆ బ్యాంకుకు సైతం నకిలీ డాక్యుమెంట్లు సమర్పించినట్టు తేలింది. దీనితో బొల్లారం పోలీసులు దర్యాప్తులో ముందుకెలా వెళ్లాలన్న దానిపై సీఐడీ సహాయం తీసుకుంటున్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఫోన్ వచ్చిన నంబర్ల ఆధారంగా ప్రస్తుతం విచారణ కొనసాగిస్తున్నారు.

ఎంసెట్ స్కాం నిందితులదే కీలక పాత్ర..?

డాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్న బొల్లారం పోలీసులు గతంలో ఇదే రీతిలో ఎంసెట్, పీజీ స్కాంలకు పాల్పడిన రాజగోపాల్‌రెడ్డి ముఠాపై అనుమానం వ్యక్తంచేస్తున్నారు. రాజగోపాల్‌రెడ్డి మేనేజ్‌మెంట్ సీట్ల పేరుతో మోసం చేయడంలో దిట్ట అని చెబుతున్నారు. గత స్కాంలపై దర్యాప్తు చేసిన సీఐడీ అధికారులు కూడా రాజగోపాల్‌రెడ్డి గ్యాంగ్‌పై అనుమానం వ్యక్తంచేస్తున్నారు. దీంతో బొల్లారం, సీఐడీ పోలీసులు ఇప్పుడు రాజగోపాల్ రెడ్డిపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ప్రశ్నిస్తే జైలుకు పంపుతారా?

బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అన్యాయాన్ని ప్రశ్నించే వారిని జైలుకు పంపే పాలన సాగుతోందని బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి విమర్శించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేసిన వారిపై కేసీఆర్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరించడమే దీనికి నిదర్శనమన్నారు. పత్రికలను కూడా బెదిరిస్తూ తను చెప్పిందే రాయాలన్నట్లుగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. శనివారం ఇక్కడ జరిగిన బీజేపీ లీగల్ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు అనుకూలంగా చట్టాలు రూపొందించుకుంటున్న కేసీఆర్ ప్రభుత్వం తీరును అడ్డుకునేందుకు లీగల్ సెల్ క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. ఇందుకు సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఓటు బ్యాంకు రాజకీయాలను అడ్డుకోవాలి: దత్తాత్రేయ

కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. ట్రిపుల్ తలాక్ విషయంలో లీగల్ సెల్‌లోని మహిళా న్యాయవాదులు విస్తృత ప్రచారం చేయటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. భూసేకరణలో నష్టపోయిన రైతులకు లీగల్ సెల్ న్యాయవాదులు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. హైకోర్టు విభజన టీఆర్‌ఎస్‌కు ఇష్టం లేదని, బీజేపీ పోరాటం వల్లనే ఇప్పుడు విభజనకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని ఎమ్మెల్సీ రాంచందర్‌రావు అన్నారు. మంద కృష్ణను ఏ నిబంధన ప్రకారం అరెస్టు చేశారో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.


పార్థసారథికి అరుదైన అవకాశం

కొలంబో విత్తన సదస్సులో కీలకోపన్యాసానికి ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: ఫిబ్రవరి 5, 6వ తేదీల్లో శ్రీలంకలోని కొలంబోలో జరిగే భారత విత్తన కాంగ్రెస్– 2018లో కీలకోపన్యాసం ఇచ్చే అరుదైన అవకాశం సీనియర్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి సి.పార్థసారథికి లభించింది. భారత విత్తన కాంగ్రెస్ నుంచి ఈ మేరకు తమకు ఆహ్వానం అందినట్లు పార్థసారథి తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్ సింగ్ హాజరుకానున్నారు. తెలంగాణ విత్తన సేంద్రియ ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కేశవులు కూడా ఈ సదస్సుకు హాజరవుతారు. విత్తన ధ్రువీకరణపై తెలంగాణ చేస్తున్న కృషికి గుర్తింపుగానే కీలకోపన్యాసం చేయడానికి అవకాశం కల్పించినట్లు పార్థసారథి తెలిపారు.

హరితహారం.. దేశానికే ఆదర్శం

కేంద్ర మంత్రి మహేశ్‌శర్మ



సాక్షి, హైదరాబాద్: తాను హెలికాప్టర్‌లో వస్తుంటే తెలంగాణలో గ్రీనరీ కనిపించిందని కేంద్ర అటవీ, పర్యావరణ, కల్చరల్ శాఖల మంత్రి డాక్టర్ మహేశ్‌శర్మ అన్నారు. తెలంగాణ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం అని, రాష్ట్రానికి కేంద్రం సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. శనివారం ఆర్‌ఎఫ్‌సీలోని హోటల్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి క్యాలెండర్, స్టిక్కర్స్‌ను, ఈపీటీఆర్‌ఐ వార్షిక నివేదికలను మహేశ్‌శర్మ, రాష్ట్ర అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమ శాఖల మంత్రి జోగు రామన్నతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేశ్‌శర్మ మాట్లాడుతూ, చారిత్రక ఘట్టాలకు తెలంగాణ నిలువుటద్దమనీ, అందుకే తెలంగాణ రాష్ట్రం పట్ల ప్రధాని నరేంద్రమోదీకి ప్రత్యేక అభిమానం అని చెప్పారు. హరితహారం కార్యక్రమం తెలంగాణ మెడలో మణిహారమని, ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శమన్నారు. నాలుగేళ్లలో 230 కోట్ల మొక్కలను నాటడం అంటే మామూలు విషయం కాదని ఆయన అన్నారు. టూరిజానికి మంచి భవిష్యత్తు ఉందని, టూరిజం ద్వారా తెలంగాణ భవిష్యత్ మారనుందన్నారు. మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపడుతున్న పథకాలతో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోందన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో లైవ్ స్టాక్ హెరిటేజ్ ఫాం నెలకొల్పాలని జోగు రామన్న కేంద్ర మంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్, పీసీబీ మెంబర్ సెక్రటరీ సత్యనారాయణరెడ్డి, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ కల్యాణ చక్రవర్తి, పీసీసీఎఫ్ ప్రశాంత్ కుమార్ ఝా పాల్గొన్నారు.

'మిడ్‌మానేరు' అక్రమార్కులపై కేసులు

ప్రాజెక్టుపై సమీక్షలో మంత్రి హరీశ్



సాక్షి, హైదరాబాద్: మిడ్‌మానేరు భూ నిర్వాసితుల నష్టపరిహారం కోసం తప్పుడు అఫిడవిట్లు సమర్పించిన అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని నీటిపారుదల మంత్రి టి.హరీశ్‌రావు ఆదేశించారు. నిర్వాసితుల నష్ట పరిహారం చెల్లింపుల్లో అవకతవకలు జరగకుండా చూడాలని, ముంపునకు గురయ్యే నిర్మాణాల అంచనాలు రూపొందించడంలో అవకతవకలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం హైదరాబాద్‌లోని జలసౌధలో మిడ్‌మానేరు పనుల పురోగతి, భూ నిర్వాసితుల నష్టపరిహారం, పునరావాస కార్యక్రమాలపై హరీశ్ సమీక్షించారు. పరిహారాల్లో అవకతవకలు, రికార్డుల తారుమారు, వాటి నిర్వహణ వంటి అంశాలపై రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన నటరాజ్ అనే అధికారి నిర్వాకం వల్ల పరిహార చెల్లింపులు ఆలస్యమయ్యాయని, రికార్డుల్లో అవకతవకలు జరిగాయని కలెక్టర్ పేర్కొనడంతో ఆ అధికారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని హరీశ్ ఆదేశించారు. మిడ్‌మానేరు కింద ముంపునకు గురవుతున్న 7,419 ఇళ్లలో ఇప్పటికే 3 వేలకుపైగా ఇళ్లు నిర్మించామని, మరో 1,500 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. మిగతా వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని హరీశ్ ఆదేశించారు. ఇప్పటికే 7,159 ఇళ్లకు పరిహారం పూర్తయిందని, మిగతా ఇళ్ల పరిహారాన్ని వారంలో చెల్లించాలని కలెక్టర్‌కు సూచించారు. ఆర్ అండ్ ఆర్ పనుల్లో జాప్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ముంపు గ్రామాల్లో కొన్ని చోట్ల ప్రజలు ఇంకా ఇళ్లు ఖాళీ చేయలేదని అధికారులు వివరించగా పెండింగ్‌లో ఉన్న చెల్లింపులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. నిర్వాసితులకు ఇందిరా ఆవాస్ యోజన కింద నిధులు మంజూరు చేయాలని హౌసింగ్ ఎండీ చిత్రా రామచంద్రన్‌ను మంత్రి ఆదేశించారు. నిర్వాసితుల గృహ నిర్మాణాలకు నష్టపరిహారం కింద రూ. 40 కోట్లు, ఆర్ అండ్ ఆర్ కోసం మరో రూ. 25 కోట్లు మంజూరు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు ఆర్ అండ్ ఆర్ కింద 1,200 కోట్లు చెల్లించామన్నారు.

వచ్చే నెల 15లోగా ప్రాజెక్టు పనులు పూర్తి...

మిడ్‌మానేరు ప్రాజెక్టు గేట్ల బిగింపు సహా సివిల్, మెకానికల్, సాంకేతిక పనులన్నీ ఫిబ్రవరి 15లోగా పూర్తి చేయాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులు ఊపందుకున్నందున మిడ్‌మానేరు పూర్తి కావడం కీలకమన్నారు. మొత్తం 25 గేట్ల ఫ్యాబ్రికేషన్, బిగింపు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు పరిధిలోని ఆర్ అండ్ ఆర్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

మేం వస్తే ఉచితంగా పంటల బీమా

ఆర్మూర్ రైతు సదస్సులో ఉత్తమ్‌కుమార్ రెడ్డి హామీ



ఆర్మూర్ సదస్సుకు హాజరైన రైతులు (ఇన్‌సెట్) ఉత్తమ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/ఆర్మూర్: రానున్న ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ 'ఆర్మూర్ డిక్లరేషన్' పేరుతో మేనిఫెస్టో అంశాలను ప్రకటించింది. శనివారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం ఆలూరులో జరిగిన రైతు సదస్సులో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాటాడారు. 2019లో అధికారంలోకి వచ్చాక రైతులకు ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. వంద రోజుల్లో రైతుల పంట రుణాలను రూ.2 లక్షల వరకు ఒకేసారి మాఫీ చేస్తామన్నారు. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో రైతులకు సంబంధించి బీమా ప్రీమియాన్ని చెల్లిస్తామని చెప్పారు. రైతు సంక్షేమం–రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలపై 'ఆర్మూర్ డిక్లరేషన్' పేరుతో పలు అంశాలను ఉత్తమ్ ప్రకటించారు. అంతకుముందు దివంగత సీఎం వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమీపంలో ఉన్న పసుపు పంటను పరిశీలించారు. పంటల వారీగా మద్దతు ధరలను ప్రకటించారు. ఏటా రూ.5 వేల కోట్లతో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ కేటాయిస్తామన్నారు. రైతులకు అందే ప్రయోజనాలన్నింటినీ కౌలుదారులకూ అందేలా చూస్తామన్నారు. నూతన విత్తన చట్టాన్ని తీసుకొచ్చి, కల్తీ విత్తనాలను అరికడతామన్నారు. ఏటా రెవెన్యూ రికార్డుల జమాబందీ నిర్వహిస్తామని, రైతుల ఉత్పత్తులపై విధించే జీఎస్టీని ప్రభుత్వమే భరించేలా చూస్తామన్నారు. నిజాం దక్కన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి ఉత్పత్తి ప్రారంభిస్తామన్నారు. వీటినే ఎన్నికల మేనిఫెస్టోగా భావించాలన్నారు.


రైతులకు శాపంగా కేసీఆర్ పాలన

సీఎం కేసీఆర్ పాలన రైతులకు శాపంగా మారిందని ఉత్తమ్ ఆరోపించారు. నాలుగేళ్లలో రూ.5 లక్షల కోట్ల బడ్జెట్‌లో రైతుల ఉత్పత్తులకు మద్దతు ధర అందించేందుకు పైసా కూడా నిధులు కేటాయించలేదని విమర్శించారు. విడతల వారీగా చేసిన రుణమాఫీతో ఏర్పడిన వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని అసెంబ్లీలో ప్రకటించిన సీఎం కేసీఆర్, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో 3,500 మంది రైతుల ఆత్మహత్యలకు కేసీఆరే బాధ్యుడని ఆరోపించారు. కాగా, రాష్ట్రంలో పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని అప్పట్లోనే వైఎస్ఆర్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారని కాంగ్రెస్ రైతువిభాగం నేత కోదండరెడ్డి అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత వై.ఎస్.రాజశేఖరరెడ్డిదేనని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి మాట్లాడుతూ గుర్తు చేశారు.

గవర్నర్‌పై అట్రాసిటీ కేసు నమోదును పరిశీలించాలి: మధుయాష్కీగౌడ్

ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను ఫెలో అంటూ సంబోధించిన గవర్నర్ నరసింహన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసే అంశాన్ని ఎందుకు పరిశీలించకూడదని ఏఐసీసీ నేత మధుయాష్కీగౌడ్ అన్నారు. మండలిలో విపక్ష నేత షబ్బీర్ అలీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బంధువులే రాష్ట్రంలో ఇసుక, మద్యం అక్రమ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఎర్రజొన్నకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ వారసులుగా రైతుల వద్దకు వచ్చామని మాజీ స్పీకర్ సురేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆకుల లలిత, పీసీసీ కార్యదర్శి బొమ్మా మహేశ్‌కుమార్ గౌడ్, నాయకులు అరికెల నర్సారెడ్డి, ఈరవత్రి అనిల్, సౌధాగర్ గంగారాం, డీసీసీ అధ్యక్షుడు తాహెర్ బిన్‌హందాన్, ఇతర నేతలు వెంకట్రాంరెడ్డి, రత్నాకర్, నగేశ్‌రెడ్డి, రాజారాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంతా వైఎస్ పుణ్యమే..



'వ్యవసాయాన్నే నమ్ముకున్న నేను వైఎస్ పుణ్యమా అని తెల్ల అంగీ వేసుకుంటున్న. లేకపోతే నేనూ చినిగిపోయిన బట్టలతో కష్టాల్లో ఉండేవాడిని' అంటూ దివంగత నేత వై.ఎస్. రాజశేఖరరెడ్డిపై అభిమానాన్ని చాటాడు బార్ల గణపతి అనే రైతు. రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ.. వై.ఎస్.రాజశేఖరరెడ్డి నిర్మించిన గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా తమ గ్రామానికి సాగునీరందడంతో పంటలను బాగా పండిస్తున్నట్లు చెప్పాడు. ఆయనే లేకపోతే రైతులందరి పరిస్థితి దయనీయంగా ఉండేదన్నారు. రైతులకు కూడా పెన్షన్లు, హెల్త్ కార్డులు అందేలా చూడాలని కాంగ్రెస్ నేతలను కోరారు. కాగా, రైతుల సంక్షేమం కోసం వై.ఎస్.రాజశేఖరరెడ్డి చేసిన సేవలను సదస్సుకు హాజరైన పలువురు రైతులు గుర్తుచేసుకున్నారు.

పంటల వారీగా ఉత్తమ్ ప్రకటించిన కనీస మద్దతు ధరలు (రూ.లలో)

పంట	మద్దతు ధర (క్వింటాలుకు..)
వరి ధాన్యం	2,000
పత్తి	6,000
సోయాబీన్	3,500
కందులు	7,000
మినుములు	7,000
పెసర్లు	7,000
పొద్దుతిరుగుడు	5,000
సజ్జ, జొన్న	2,000
మిర్చి	10,000
పసుపు	10,000
ఎర్రజొన్న	3,000

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం, 7-1-2018


హెబ్బా పటేల్

ఫొటో: శివ మల్లాల

సింగిల్ సినిమాతో కుమారి అనిపించుకుంది. ఆ సినిమా తర్వాత హెబ్బా పటేల్ అంటే 'ఎవరూ? కుమారి 21ఎఫ్ అమ్మాయా ?' అని ఇప్పటికీ అడుగుతున్నారు. పోనీ పెళ్లి అయినా చేసుకుంటే ఈ గొడవ తప్పుతుంది అంటే.. సినిమాలకి, ఫ్యామిలీకి తప్ప మనస్సులో ఇంకెవరికీ చోటు లేదని 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పింది.

సాక్షి ఎక్స్‌క్లూజివ్

కుమారి హెబ్బా

● 2017 ఎలా గడిచింది?
అప్ అండ్ డౌన్స్‌తో సాగింది. కొన్ని పాఠాలు నేర్పింది. ఆ లెసన్స్ 2018కి ఉపయోగపడతాయి. అందుకే గతేడాది కన్నా ఈ ఇయర్ బాగుంటుందనుకుంటున్నా.

● హెబ్బా అంటే 'గాడ్స్ గిఫ్ట్' అని అర్థం. మూవీస్‌కి ఆ దేవుడు ఇచ్చిన గిఫ్ట్ మీరని అనుకోవచ్చా?
(నవ్వేస్తూ). మా అమ్మానాన్నలకు ఆ దేవుడు ఇచ్చిన గిఫ్ట్ నేను. సినిమాలకు నేను గిఫ్ట్ కాదు.. ఆ దేవుడు నాకిచ్చిన గిఫ్ట్ సినిమాలు.

● ఇంకా దేవుడు మీకేమేం బహుమతులు ఇచ్చాడు?
నేను అనుకోకపోయినా హీరోయిన్‌ని చేశాడు. ఫేమస్ అవ్వాలనుకున్నాను. అది తీర్చేసేశాడు. ఏదో వచ్చాం.. సో..సోగా సినిమాలు చేసేసి వెళ్లిపోదామనుకోలేదు. నేను అనుకున్నట్లుగానే నాకు పేరు తెచ్చే సినిమాలే ఇస్తున్నాడు. ఇంతకు మించి దేవుణ్ణి ఏమైనా కోరుకుంటే బాగుండ దేమో. అయినా ఓ పెద్ద కల ఉంది. అది ఇప్పుడు చెప్పను.

● ఆ విషయం చెప్పి, మీ ఫ్యాన్స్‌కి మీరు కూడా గిఫ్ట్ ఇవ్వొచ్చు కదా?
ఫ్యాన్స్ అంటున్నారు కాబట్టి, చెప్పేస్తున్నా. మరేం లేదు. పెద్ద ఇల్లు కొనాలనే కల ఉంది. అదీ నెరవేరుతుందనే నమ్మకం ఉంది.

● తెలుగు, తమిళ, కన్నడంతో కలిపి పది సినిమాల దాకా చేసేశారు. ఇల్లు కొనడం మీకు పెద్ద కల అవుతుందా?
లెక్క చెప్పుకోవడానికి పది సినిమాలున్నాయి. కానీ, ఇంకా సెటిలవ్వడానికి చాలా టైమ్ పడుతుందండి. 'ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు' అంటారు కదా.

● సో.. ఇల్లు కట్టాక పెళ్లన్న మాట?
అయ్య బాబోయ్. ఏదో మాట వరసకి అన్నాను. అప్పుడే పెళ్లి అంటూ పెద్ద పెద్ద మాటలు మాట్లాడను. ఇంకా చాలా సినిమాలు చేయాలి కదా.

● హైదరాబాద్‌లో ఇల్లు ఎక్కడ కట్టుకోవాలనుకుంటున్నారు?
ఇక్కడ కాదు. ముంబైలో మంచి ఏరియాలో కొనుక్కోవాలనుకుంటున్నా. ఆ బాధ్యత మా ఇంట్లోవాళ్లకి అప్పగించేస్తాను.

● క్యాష్ ఇక్కడ... ఇల్లు అక్కడా?
హైదరాబాద్ అంటే ఇష్టం లేక కాదు. కానీ, మావాళ్లంతా ముంబైలోనే ఉంటారు. హైదరాబాద్ షిఫ్ట్ కావడం వాళ్లకు ఇష్టంలేదు. ఇంట్లోవాళ్ల కంఫర్ట్ కోసం ముంబైలో ప్లాన్ చేశా. నా వరకు మాత్రమే అయితే ఇక్కడే ప్లాన్ చేసుకునేదాన్ని.

● ఓకే.. బర్త్‌డే (06.01.) ఎలా జరుపుకున్నారు?
షూటింగ్ స్పాట్‌లోనే. నాకన్నా నా ఫ్యామిలీ, నా ఫ్రెండ్స్ నా బర్త్‌డేని స్పెషల్‌గా ఫీలవుతారు. అది నాకు హ్యాపీగా ఉంటుంది.

● హీరోయిన్ అయిన ఈ నాలుగేళ్లల్లో ఖాళీగా ఉన్న బర్త్‌డే ఏదైనా ఉందా?
లేదు. అమ్మో దిష్టి తగులుగుతుందేమో.. టచ్ ఉడ్ (దిష్టి తగలకుండా అలా అనుకుంటారు). యాక్చువల్లీ ఒక్క బర్త్‌డేకి ఖాళీగా ఉన్నా నేను బాధపడేదాన్ని. షూటింగ్ స్పాట్‌లో ఉండి, 'ఓకే.. మనం బిజీగా ఉన్నాం' అనే ఫీలింగ్ కన్నా వేరే ఆనందం ఏముంటుంది?

> **జర్నలిస్ట్ అవ్వాలనుకుని మాస్ కమ్యూనికేషన్ చేశాను. చదువుకుంటూనే పాకెట్ మనీ కోసం మోడల్స్‌కి స్టేజ్ హెల్పర్‌గా చేసేదాన్ని. అప్పుడెవరో మోడల్‌గా ట్రై చేయొచ్చు కదా అంటే, చేశాను. అవి చూసి, సినిమాలకు అవకాశం ఇచ్చారు. ముందు తమిళ సినిమా 'తిరుమణమ్ ఎన్నుమ్ నిక్కా', ఆ తర్వాత తెలుగులో 'అలా ఎలా'కి చాన్స్ వచ్చింది. మధ్యలో 'అధ్యక్ష'తో కన్నడకు పరిచయమయ్యా. 'కుమారి 21ఎఫ్' నా కెరీర్‌కి మంచి టర్నింగ్ అయింది.**

● బర్త్‌డే సందర్భంగా కొత్త నిర్ణయాలేమైనా?
ఎక్కువ ఆశించకూడదు. సిన్సియర్‌గా పని చేయాలి. ఇంకా స్ట్రాంగ్‌గా ఉండాలను కుంటున్నాను. తక్కువ ఆశిస్తే ఏ బాధా ఉండదని అనుభవం నేర్పింది.

> **● పెద్ద హీరోల పక్కన నటిస్తే కెరీర్ ఇంకా పుంజుకుంటుంది కదా.. ట్రై చేయడంలేదా?**
> **మీరన్నది కరెక్టే. కానీ అవకాశాలు వాటంతటఅవి రావాలి. ఏదేమైనా ఇప్పుడు చేస్తున్న, చేసిన సినిమాలవైజ్‌గా నాకెలాంటి రిగ్రెట్స్ లేవు. 'ఐయామ్ హ్యాపీ'.**

● సిన్సియర్‌గా పని చేయాలనుకుంటున్నా అన్నారు. ఇప్పటివరకూ అలా చేయలేదా?
నిజానికి నన్ను నేనెప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదు. సినిమాలు ఒప్పుకోవడం, చేయడం అంతే. సినిమాల సెలక్షన్ విషయంలో కూడా పెద్దగా జాగ్రత్త తీసుకోలేదు. ఇకనుంచి కొంచెం కేర్‌ఫుల్‌గా ఉండాలనుకుంటున్నా.

● 'కుమారి 21ఎఫ్' రిలీజై రెండేళ్లకు పైనే అయినా మిమ్మల్ని కుమారి అంటున్నారు..
(నవ్వేస్తూ). అవునండి. ఎక్కడికెళ్లినా 'కుమారి' అంటున్నారు. ఇలా అయితే నా అసలు పేరుని మరచి పోతారేమో అనిపిస్తుంది. కానీ, ఒక పాత్ర అంత ఇంపాక్ట్ చూపించినందు కు హ్యాపీగా ఉంది. సేమ్ టైమ్ 'కుమారి'ని మరిపించే పాత్ర చేయాలనుకుంటున్నా.

● మీరేమో 'సింపుల్ హోమ్లీ గర్ల్'లా కనిపి స్తారు. 'కుమారి 21 ఎఫ్'లో అంత హాట్‌గా ఎలా యాక్ట్ చేశారా? అనిపిస్తుంటుంది..
నాకూ ఆశ్చర్యంగానే ఉంటుంది. నన్ను నేను హాట్ అనుకోలేదు. చూసేవాళ్లు కూడా అనుకోరు. అయితే సుకుమార్‌గారు, సూర్యప్రతాప్‌గారు కుమారి పాత్రకు నేను ఫిట్ అవుతాననుకున్నారు. వాళ్లేం చెబితే అది చేసేశా.

● అంత బోల్డ్ క్యారెక్టర్ చేస్తే 'బ్యాడ్ ఇమేజ్' వస్తుందని భయపడలేదా?
ఫ్రాంక్‌గా చెప్పాలంటే ఆ టైమ్‌లో నా చేతిలో సినిమాలు లేవు. అది ఒప్పుకోవడం మినహా వేరే ఛాయిస్ లేదు. సుకుమార్‌గారి ప్రొడక్షన్ అంటే ఆలోచించడానికి ఏముంటుంది? పైగా టైటిల్ రోల్. ఇమేజ్ గురించి ఆలోచించకుండా ఒప్పుకున్నాను. నన్నింత ఫేమస్ చేస్తుందనుకోలేదు. 'కుమారి 21ఎఫ్' నా జీవితాన్ని మార్చేసింది.

● 'మిణుగురులు' ఫేమ్ అయోధ్యకుమార్ డైరెక్షన్‌లో 'శ్రీలక్ష్మి అండ్ 24 కిస్సెస్' అనే సినిమా చేస్తున్నారట?
అవును. కానీ ఆ సినిమా గురించి ఇప్పుడేమీ చెప్పను. ఒక్కటి చెబుతాను. 'కుమారి 21ఎఫ్'కన్నా ఇది ఫుల్ డిఫరెంట్‌గా ఉంటుంది.

● అప్పుడప్పుడూ ఇద్దరు కథానాయికలున్న సినిమాలు చేస్తున్నారు. ప్రాబ్లమ్ అనిపించదా?
నో ప్రాబ్లమ్. మన బలం ఏంటో మనం తెలుసుకుంటే అభద్రతాభావం ఉండదు. నేను గొప్ప ఆర్టిస్ట్‌ని అని చెప్పడంలేదు కానీ ఏ క్యారెక్టర్ ఒప్పుకున్నా, దాన్ని అర్థం చేసుకుని యాక్ట్ చేయగల కెపాసిటీ ఉంది. ప్లస్ ఇద్దరు ముగ్గురు హీరోయిన్ల కాంబినేషన్‌లో సినిమాలు చేసినా నా క్యారెక్టర్‌కీ కథలో ఇంపార్టెన్స్ ఉంటుంది.

● ఫైనల్లీ.. మీ మనసులో ఎవరో ఉన్నారట..
అవును. మా అమ్మానాన్న, ఇంకా నా ఫ్యామిలీ మెంబర్స్ ఉన్నారు.

● కాదు.. ఎవరో కుర్ర హీరో ఉన్నారట కదా?
ఎవరి కోసమూ మనసు ఖాళీ లేదు (నవ్వుతూ). ఐయామ్ సింగిల్.

- డి.జి. భవాని



పెయింటర్ శ్రీదేవి!



యాక్టర్–డైరెక్టర్, యాక్టర్– ప్రొడ్యూజర్.. ఎప్పుడూ వినిపించేమాట. తక్కువగా వినిపించే మాట యాక్టర్– పెయింటర్. ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో సల్మాన్‌ఖాన్ అందరికీ తెలిసిన యాక్టర్– పెయింటర్. టైమ్ దొరికినప్పుడు ఆయన పెయింటింగ్ వేస్తారు. ఫ్రెండ్స్‌కి గిఫ్టుగా ఇస్తారు. ఛారిటీ కోసం కొన్నిటిని అమ్మేస్తారు. ఆయన ఒక్కరేనా ఇలా యాక్టర్–పెయింటర్? ఇంతవరకు ఒక్కరే అనుకున్నాం. ఇక ముందు అలా అనుకోడానికి లేదు. సీనియర్ నటి శ్రీదేవి వచ్చే నెల దుబాయ్‌లో జరుగుతున్న వేలానికి తన పెయింటింగ్‌లను పంపుతున్నారు. అరే! ఎప్పుడు వేశారు? వారానికి 5 నుంచి పది గంటలకు పెయింటింగ్‌లోనే ఉంటున్నారట శ్రీదేవి. 'సావారియా'లో సోనమ్ కపూర్ పోర్ట్రైట్‌ని, మైఖేల్ జాన్సన్‌నీ కంప్లీట్ చేసి ఫ్లయిట్‌కి కూడా సిద్ధం చేస్తున్నారు. మిగతావి కూడా కొన్ని ఉన్నాయి. వాటిల్లో ఈ రెండు పెయింటింగ్‌లనే శ్రీదేవి ఎంపిక చేసుకున్నారు. వేలంలో ఒక్కో పెయింటింగ్ ప్రారంభ ధర 8 లక్షల రూపాయలట. వచ్చిన డబ్బుని సేవా సంస్థలకు విరాళంగా ఇవ్వాలని శ్రీదేవి ముందే నిర్ణయించుకున్నారు.

ఆలియాకు కరణ్ సారీ



మగాళ్లు ఎలా ఉన్నా పర్వాలేదు, బాలీవుడ్‌లో హీరోలైపోతారు! అమ్మాయిలే.. పాపం స్లిమ్‌గా ఉండాలి. స్లిమ్‌గా లేకపోతే చచ్చినట్లు స్లిమ్ అవ్వాలి. ఆలియాను ఆమె ఫస్ట్ మూవీ 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్'కు తీసుకోడానికి కరణ్ జోహార్ నానా తిప్పలు పెట్టాడు! ఇంత బొద్దుగా ఉంటే నిన్నెవరు చూస్తారు అన్నాడు. 'తగ్గు. తిండి తగ్గించు, జిమ్‌కి వెళ్లు' అని ఫోర్స్ చేశాడు. ఆలియా చాలా కష్టపడి బరువు తగ్గింది. ఆమెను అంత కష్టపెట్టినట్టు.. ఐదేళ్ల తర్వాత ఇప్పుడు కరణ్ జోహార్‌కి గుర్తొచ్చి ఆలియాకు 'సారీ' చెప్పాడు! అయినా ఇప్పుడెందుకు ఆయనకు అకస్మాత్తుగా ఆ సంగతి గుర్తొచ్చింది! టీవీ షోలో ఇటీవల ఒక కాలర్ కరణ్‌తో మాట్లాడుతూ.. ''సర్, ఆలియాను బరువు తగ్గమని మీరు అప్పట్లో చాలా బలవంత పెట్టారు కదా. తేలిగ్గా కూడా మాట్లాడారు గుర్తుందా? ఒక ఆడపిల్లను మీరు అలా అనొచ్చా?'' అని అడిగాడు. కరణ్ షాక్ కొట్టినట్లు అయిపోయి, కొన్ని క్షణాలు ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లిపోయాడు. ''అవును నిజమే. అయామ్ సారీ ఆలియా'' అని అప్పటికప్పుడే ఆలియాకు బహిరంగంగా క్షమాపణ చెప్పాడు. ఏమిటి.. కరణ్‌లో సడెన్‌గా ఇంతమార్పు? మొదట్లో అతడు దురుసుగా ఉండేవాడు. అమ్మాయిల్ని హర్ట్ చేసేవాడు. 'స్క్రీన్‌కి పనికొచ్చే షేప్ కాదు' అని కూడా అనేసేవాడు. ఇప్పుడు మనిషి అయ్యాడు! ఎప్పట్నుంచీ? 'రూహీ' ఇంట్లోకి వచ్చినప్పటి నుంచి. రూహీ కరణ్ కూతురు. ఏడాది వయసు. సరోగసీ చైల్డ్. అందుకే కూతురు ఉండాలంటారు. కూతురు ఉంటే కుటుంబంలోని మగవాళ్లకు సంస్కారం అలవడుతుంది. ''అమ్మాయిలు ఎంత అపురూపమైనవారో నాకు ఇప్పుడు తెలుస్తోంది'' అని కూడా కరణ్ ఇప్పుడిప్పుడే అంటున్నాడు.. రూహీని ముద్దాడుతూ.

చెట్టు నీడ

నిన్ను నువ్వు పట్టించుకో



ఒక గ్రామంలో చెప్పులు కుట్టే ఆయన ఉన్నాడు. ఆయన్ని 'పాదరక్షకుడు' అందాం. ఆ గ్రామం మొత్తానికి ఆయనే పాదరక్షకుడు. చెప్పులు మరమ్మతు చేయించుకోడానికి, కొత్త చెప్పులు చేయించుకోడానికి ఊరివాళ్లంతా ఆయన దగ్గరికే వస్తారు కాబట్టి ఎప్పుడూ తీరిక లేకుండా పని చేస్తుండేవాడు. ఓసారి ఆయన చెప్పులే పాడైపోయాయి. తన చెప్పులు బాగు చేసుకునే ఆ కొద్ది సమయంలో బయటి వారి చెప్పుల్ని బాగు చేయొచ్చు కదా అని, తన చెప్పుల గురించి ఆలోచించడం మానేశాడు. చివరికి అవి శిథిల దశకు వచ్చాయి. పాదరక్షకుడి పాదంలో ఆనెలు వచ్చాయి. ఆ నొప్పిని భరించలేకపోయినా అలానే నడిచేవాడు కానీ, తన చెప్పుల గురించి పట్టించుకునేవాడు కాదు. వాళ్లూ వీళ్లూ చూసి, 'అదేం పనయ్యా! నీ గురించి నువ్వు శ్రద్ధ వహించాలి కదా' అనేవారు. అయినా ఆయన పట్టించుకోలేదు. చివరికి పాదం నొప్పి ఎక్కువై, పరిస్థితి ప్రాణాంతకమై మంచాన పడ్డాడు. దాంతో ఆ గ్రామంలో చెప్పులు కుట్టేవాళ్లే లేకుండా పోయారు. పర్యవసానంగా గ్రామస్థులు కూడా చాలాకాలం ఇబ్బందులు పడ్డారు. మొత్తం ఊరే నడవలేనట్లుగా అయిపోయింది!

మనం ఏదైనా బాధ్యతాయుతమైన పనిలో ఉన్నప్పుడు, మధ్యమధ్య మనల్ని కూడా పట్టించుకుంటుండాలి. నాయకులు, సామాజిక కార్యకర్తలు, టీచర్లు, ఇంటిపెద్ద, గృహిణి.. వీళ్లంతా తమ ఆరోగ్యం గురించి, తమ క్షేమం గురించి శ్రద్ధ తీసుకోవాలి. అప్పుడే కుటుంబాలు, సమాజం సజావుగా ఉంటాయి.

(గమనిక : నిన్నటి 'చెట్టు నీడ'లో 'జీవితం సంతోషాల పూదోట' అని వచ్చిన సందేశం పోప్ ఫ్రాన్సిస్ పేరిట సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలో ఉన్న ప్రసంగ భాగం అని పాఠకులు గమనించగలరు)

సాక్షి ఫ్యామిలీ సన్నిధి
హైదరాబాద్
ఆదివారం
7-1-2018

వివేకవాణి

- సహనం ఎప్పుడూ చేదుగానే ఉంటుంది. దాని ఫలితాలెప్పుడూ తియ్యగానే ఉంటాయి.
- మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆలోచననూ స్వీకరించండి. బలహీనపరిచే ప్రతి ఆలోచననూ తిరస్కరించండి.
- నిరంతరం వెలిగే సూర్యుణ్ణి చూసి చీకటి భయపడుతుంది.
- నిత్యం పని చేసే శ్రామికుణ్ణి చూసి ఓటమి భయపడుతుంది.
- జీవితంలో భయం లేకుండా ఆత్మ విశ్వాసం ఉన్నవారు గొప్ప విజయాలు సాధించగలుగుతారు.
- ప్రేమ, నిజాయితీ, పవిత్రత ఉండేవారిని ఈ ప్రపంచంలో ఏ శక్తీ ఓడించలేదు.
- ఒక ధ్యేయంతో కృషి చేస్తే, నేడు కాకపోతే రేపయినా విజయం తప్పదు.
- జీవితంలో ధనం నష్టపోతే కొంత కోల్పోయినట్టు.. కానీ వ్యక్తిత్వం కోల్పోతే సర్వస్వం పోగొట్టుకున్నట్టే!



ఉపశమనం

నట్టింట్లో పాపాయి పారాడాలంటే...

ఎన్ని సంపదలు ఉన్నా, ఇంట్లో పిల్లలు లేకపోతే లోటుగానే ఉంటుంది. కొందరికి పెళ్లి జరిగి ఏళ్లు గడుస్తున్నా సంతానం కలగదు. ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకుంటారు. అంతా బాగున్నట్లే వైద్యులు చెబుతారు. అయినా, కడుపు పండటం కష్టమవుతుంది. సంతానం కోసం వ్రతాలు, ఉపవాసాలు చేస్తున్నా ఫలితం కనిపించదు. అలాంటప్పుడు పాటించాల్సిన కొన్ని పరిహారాలు...

● నిత్యపూజలో ప్రతిరోజూ వినాయకుడిని ప్రత్యేకంగా పూజించాలి. ఉదయం పూట ముందుగా శునకాలకు ఆహారం తినిపించి, ఆ తర్వాతే ఏదైనా తినాలి ● సంతాన గోపాలుని ఆరాధన వల్ల కూడా ఫలితం ఉంటుంది. గురువుల వద్ద సంతాన గోపాలమంత్రం ఉపదేశం పొంది, నియమబద్ధంగా జపించాలి ● నైరుతి దిశలో పడక గది ఉండేలా చూసుకోవాలి. కుదరకపోతే, దంపతులు శయనించే మంచాన్ని నైరుతి దిశలో ఏర్పాటు చేసుకోవాలి. అయితే, గర్భం దాల్చిన తర్వాత మాత్రం గర్భిణులు నైరుతి గదిలో శయనించరాదు ● ఇంటి నడిమధ్య భాగాన్ని బ్రహ్మస్థానం అంటారు. ఆ ప్రదేశాన్ని ఎల్లప్పుడూ ఖాళీగానే ఉంచాలి. ఎలాంటి వస్తువులను ఉంచకూడదు ● ఏదైనా గురువారం సూర్యోదయ సమయంలో దురదగొండి మొక్క వేర్లు సేకరించి, వాటిని శుభ్రపరచి తాయెత్తులో ఉంచి ఎర్రదారంతో దంపతులిద్దరూ మెడలో ధరించాలి.



– పన్యాల జగన్నాథదాసు

సుడోకు

1	4		5				6	
8		9	1					3
7						1	2	
					2	6		
6	7	1	9	8	3	5	4	2
		4	6					
	8	5						1
2					5	4		6
	9				8		3	5

నిబంధనలు

ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

7	6	1	9	8	4	3	5	2
9	5	8	3	1	2	4	6	7
2	4	3	5	6	7	9	1	8
3	1	7	6	4	5	2	8	9
5	9	6	8	2	3	1	7	4
4	8	2	1	7	9	6	3	5
6	7	9	2	5	1	8	4	3
1	2	5	4	3	8	7	9	6
8	3	4	7	9	6	5	2	1

ఆచార్య దేవోభవ

గురువుకన్నా అధికుడు లేడు

గురువుకి వశవర్తియై ఆయన శాసకుడన్న భావనతో గురువు చెప్పినది పాటించేవాడిని శాస్త్రం 'గురువ్రత' అన్నది. గురువుకింత పెద్దస్థానం ఎందుకిచ్చారంటే ఆయన పురోహితుడు కనుక. వశిష్ఠులవారు ఇక్ష్వాకుల వంశానికి కుల పురోహితుడు. పురోహితుడంటే కేవలం వారి ఇంట్లో జరిగే శుభాశుభ కార్యక్రమాలలో మంత్రభాగాన్ని అన్వయించేవాడని కాదు. పుర హితం కోరి మంగళ కార్యక్రమాలను, ఆ తర్వాత చేయవలసిన విహిత కర్మలను చేయిస్తుంటాడు. తప్పేం కాదు. పురం– అంటే పూర్వంనుంచి ఆయన అలవాటు ఏంటంటే– హిత వాక్యాలను మాట్లాడడం. ఏవో మాట్లాడి నవ్వించి చప్పట్లు కొట్టించుకోవడానికి మనోరంజకంగా మాట్లాడే మాటలు కావవి. పితికేటప్పుడు ఆవుపాలు పాత్రలో పడేటంత జాగ్రత్తగా చెవితో పట్టుకుని మనసులో పెట్టుకుని ఉద్ధరణకు ఉపయోగించుకోవాల్సిన మంచి మాటలను శాస్త్రాల నుండి, పురాణాలనుండి గ్రహించి అన్వయం చేసి కష్టపడి చెమటలు పట్టేటట్లుగా తన హితం కోరి మాట్లాడేవాడెవడో వాడు గురువు. లోకక్షేమం కోరి వశిష్ఠుడు నోరు విప్పాడు. ఈ హితకరమైన వాక్కులు ఆయన ఎప్పటినుంచో ఇస్తున్నాడు. ఆయనకు అదే పని. అందుకే రుషి తర్పణం వచ్చింది. మనకి రుషి జాతి వేరైపోయింది. రుషి మనుష్యుడిగా పుట్టినా వేరే తర్పణం వచ్చింది. కారణం– ఆయన పురోహితుడయ్యాడు. ఎప్పుడూ హితవాక్కు పలుకుతాడు. అందుకే మనకు ఉపనిషత్తులొచ్చాయి. వశిష్ఠుడు చేసిన మహోపకారం ఎవరు చేస్తారు? రాముడికి రామనామం ఉంచడమే ఆయన చేసిన మహోపకారం. 'రా', 'మ'..రెండూ తెలికయిన అక్షరాలు. 'రా' అగ్నిబీజం. 'మ' అమృత బీజం. 'రా' అన్నప్పుడు– పాపం కాలిపోయింది. అమృత బీజం కను 'మ' అన్నప్పుడు పాపాలు లోపలికి రాకుండా పెదవులు మూసుకుపోతాయి. ఈ రెండక్షరాలు పలికినంత మాత్రం చేత సమస్త పాపరాశి దహనమయిపోయి అనుగ్రహాన్ని పొందుతాం కనుక దార్శనికుడైన వశిష్ఠుడు ఆ నామాన్ని ఉంచాడు. నామకరణంలో ఎప్పుడో పలికిన హితవాక్కు ఇప్పటికీ మనందరికీ పనికొస్తున్నది. అంత హితం చేసిన వాడు కాబట్టి పురోహితుడయ్యాడు.





బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

గురుశిష్య సంబంధమనేది నరులలోనే కాదు, భగవంతునికి కూడా అన్వయమవుతుంటుంది. భగవంతుడు కూడా గురువన్న పేరు వినబడితే వంగిపోవాల్సిందే. కారణం–అది అంత ఉత్కృష్ట స్థానం. 'నగురోరధికం, న గురోరధికం, న గురోరధికం.. ఇతి శివశాసనతః' – గురువు కన్నా అధికుడు లేడు కాబట్టి గురువు అన్న మాట వినబడితే పరమేశ్వరుడు అవతారంతో వచ్చినా వంగిపోతాడంతే. చిత్రం ఏమిటంటే – అద్వైత సంప్రదాయంలో మొదటి గురువు నారాయణుడు, ఆయన శిష్యుడు బ్రహ్మ. బ్రహ్మ శిష్యుడు వశిష్ఠుడు. కాబట్టి అక్కడ నారాయణుడు వశిష్ఠులకు పరమ గురువయ్యాడు. అటువంటి నారాయణుడు ఇక్కడ రాముడిగా వశిష్ఠుడికి శిష్యుడయ్యాడు. శిష్యుడిగా నారాయణుడు కూడా వశిష్ఠుడికి నమస్కారం చేయవలసిందే. నరుడిగా నమస్కరించాడంతే. అదీ గురుశిష్య సంబంధం అంటే. అదీ భగవంతుడు మనకు నేర్పిన మార్గం.

అందుకే పార్వతీ దేవి పరమశివుణ్ణి గురువుగా స్వీకరించింది. సహజంగా భర్త గురువు. భర్తకు మంత్రోపదేశం చేస్తే చాలు. తర్వాత భర్త భార్యకు చేస్తాడు. అలా భర్త దగ్గర పార్వతీ దేవి విద్య నేర్చుకుంది. మనుష్యులు తరించి పోవడానికి ఏదయినా చిన్న ఉపాయం చెప్పమని అడిగింది. రామ, రామ, రామ అని మూడు సార్లంటే వెయ్యి సార్లు విష్ణునామం చెప్పినట్లే. గురువయిన భర్త నుంచి ఆవిడ నేర్చుకుంది కాబట్టి మనకు అందింది.

పాశుర ప్రభాతం

23వ పాశురం

మారి మలై ముళంజిల్ మన్ని క్కిడన్దుఱంగుమ్,
శీరియశిఙ్గ మఱివిత్తు త్తీవిళిత్తు,
వేరిమయిర్ పొంగు వెప్పాడుమ్ పేర్ న్దుదఱి,
మూరి నిమిర్న్దు ముఴంగి ప్పుఱప్పట్టు,
పోదరుమాపోలే నీ పూవైప్పూవణ్ణా, ఉన్
కోయిల్ నిన్రు ఇంగునే పోన్దరుళి, క్కోప్పుడైయ
శీరియ శింగాసనత్తిరున్దు, యామ్ వన్ద
కారియ మారాయ్ న్దరుళేలో రెమ్బావాయ్.

భావం



అతసీపుష్పంవలె నల్లనైన శరీరము కల ఓ కృష్ణా! వర్షాకాలంలో పర్వతగుహల్లో కదలక మెదలక నిదురించిన శౌర్యం గల సింహం మేల్కొన్న తరువాత శత్రు మృగాలపై కోపంతో నిప్పుకణాలను రాల్చునట్లుగా కన్నులను తెరిచి చూడుము. సింహం తన సువాసనా భరితమైన జూలు నిక్కపొడుచునట్లుగా చేసి అన్నివైపులా దొర్లి శరీరాన్ని అంతటిని సాగదీసి (ముందుకు, వెనుకకు చాపి) గర్జించి, గుహనుండి బయటకు వచ్చునట్లుగా ఓ కృష్ణా నీవు కూడా నీ రాజప్రాసాదం నుండి ఇక్కడకు విచ్చేయుము. పరమవిలక్షణమైన రీతిలో రమణీయమైన సన్నివేశాన్ని తలపిస్తూ మా సంకల్పాన్ని నెరవేర్చగల విలక్షణమైన సింహాసనంపై కూర్చుని మేము వచ్చిన కార్యాన్ని తెలుసుకొని మాపై దయను చూపి మా అభీష్టమును నెరవేర్చుమని గోపికలు ఈ పాశురంలో శ్రీ కృష్ణుని కోరుతున్నారు.

– ఎస్. శ్రీప్రియ

అంతరార్థం

ఇదీ ఇరుముడిలోని రహస్యం



'స్వామియే శరణం అయ్యప్పా!' అని శరణుఘోష మిన్నంటుతుండగా, కుటుంబ సభ్యులు, బంధు, మిత్రులు వెంట రాగా... 40 రోజుల దీక్షని పూర్తి చేసిన సంతృప్తి కనులలో కదలాడుతుండగా, భక్తిభావం నిలువెల్లా ముంచెత్తుతుండగా... వేలాది భక్తులు గురుస్వామి చేత ఇరుముడి కట్టించుకుంటూ... కనిపిస్తుంటారు ఈ వారమంతా ఇంచుమించు అన్ని ఆలయాలలోనూ కనిపించే దృశ్యాలివే! ఇంతకూ ఇరుముడిలో ఏముంటుందో తెలుసా... ఇరు అంటే రెండు అని అర్థం. ఇరుముడి అంటే రెండు భాగాలు కలది అని చెప్పుకోవచ్చు. ఇరుముడిలో రెండు భాగాలు ఉంటాయి. ముందు భాగంలో పూజాసామాగ్రి, వెనుక భక్తునకు కావలసిన వస్తువులు, తినుబండారాలు ఉంటాయి. ముందు భాగంలో ఉండే ఆవునెయ్యి భక్తుని ఆత్మతో సమానం. కొబ్బరికాయ దేహంతో సమానం. అంటే భక్తులైనవారు ఆత్మతో సమానమైన నేతితో స్వామికి అభిషేకం చేసి (ఆత్మార్పణం గావించి) దేహం వంటి కొబ్బరికాయను స్వామి సన్నిధిలోగల హోమకుండంలో వేయాలి. కామ క్రోధాలను వీడి, కొబ్బరికాయలో ఉన్న మోహమనే నీళ్లను త్రోసి, జ్ఞానమనే నెయ్యిని పోసి, భక్తి నిష్ఠలనే ఇరుముడులను వేసి నలభై ఒక్కరోజులు స్వామి తలపులతోనే కఠినమైన జపం చేయాలి. అంటే శరీరం మీద మోహాన్ని విడిచి, మనశ్శరీరాలను భగవంతునికే అంకితం చేయాలని అర్థం. వెనుక భాగంలో ఉన్న తినుబండారాలు మానవుని ప్రార్థబ్ధకర్మలు. ఎవరి ప్రారబ్ధాన్ని వారే మోసుకొని పోవాలి, వారే అనుభవించాలి.

సువార్త

దేవుడు మీముందుంటే... ఆశీర్వాదాలు మీ వెంటే

క్రైస్తవమంతా దేవుడు వాడుకున్న, దేవునికి, ఆయన సంకల్పాలకు విశ్వాసంతో తలవంచి విధేయత చూపిన ఒక వ్యక్తి 'అబ్రాహాము'తో ఆరంభమైంది. మానవాళితో సహా విశ్వాన్నంతా సృష్టించి, దానంతటికీ యజమాని అయిన దేవుణ్ణి మానవాళి సృష్టి, ఆరంభంలోనే కొన్ని తరాల తర్వాతే పక్కన పెట్టి ఆరాధనల పేరిట నరబలుల, దుర్బలుల శ్రమదోపిడి, దేవాలయాల్లోనే శృంగారం, మితిమించిన విగ్రహారాధన వంటి దుష్ట సంప్రదాయాలను అనుసరిస్తున్న నేపథ్యంలో, దేవుడు అబ్రాహాము ద్వారా తన మార్గనిర్దేశనం చేశాడు. మధ్య ప్రాచ్య ప్రాంతమైన మెసొపొటేమియా (ఇప్పటి ఇరాన్, ఇరాక్ ప్రాంతం)లో ఉన్న అబ్రాహామును 'నీవు లేచి నేను చూపించే దేశానికి వెళ్లు'అని ఆదేశించాడు. 'ఏదేశానికి? అదెలా ఉంటుంది?' అన్న ఎదురు ప్రశ్న వేయకుండా అప్పటికప్పుడు దైవాజ్ఞ పాలనకు అబ్రాహాము నడుము కట్టి బయలుదేరాడు. లోకాన్ని ప్రశ్నించడం అనేది మనిషి నైజంలో ఉంది. అయితే లోకాన్ని ప్రశ్నించడం హేతువాదమనిపిస్తుంది. దేవుణ్ణి ప్రశ్నించకపోవడమే నిజమైన విశ్వాసమనిపిస్తుంది.



'నీవు వెళ్లు' అన్న దైవాజ్ఞ పాలన వెనుక అబ్రాహాముకు ఆ దేవుని శక్తి సామర్థ్యాలు, ప్రేమాపూర్ణత పట్ల అవగాహన ఉంది. ఆ అవగాహనలో నుండే అతని విశ్వాసం పుట్టింది. ప్రశ్నించడం హేతుబద్ధమే కాని అది అవిశ్వాసం!!

తల వంచి దేవునికి అవిధేయులం కావడం వల్ల లోకం సృష్టిలో మనం బలహీనులం కావచ్చు. కాని అదే ఆశీర్వాదాలకు ఆరంభం!! అందుకే తన పట్ల మానవాళి భక్తిశ్రద్ధలకు దేవుడు అబ్రాహాము విశ్వాసాన్ని ప్రామాణికం చేశాడు. కొత్త ఏడాది ముంగిట్లో నిలబడ్డ మనతో కూడా నీవు వెళ్లు అంటున్నాడు దేవుడు. రాబోయే 365 రోజుల కాలఖండంలో మనకేమేమి అనుభవాలు ఎదురుకానున్నాయో మనకు తెలియదు. కాని 'నీవు నేను చూపించే దేశానికి వెళ్లు' అని దేవుడాదేశిస్తే విధేయుడై వెళ్లిన అబ్రాహాము పాలు తేనెలు ప్రవహించే కనానులో కాలు పెట్టినట్టే, మీరూహించని ఆశీర్వాదాలు, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అద్భుతాలు చలిచూడనున్న మరో ఏడాదిలోకి మీరు కాలుపెట్టబోతున్నారు. ఎందుకంటే 'నీవు వెళ్లు' అని ఆదేశించిన దేవుడే అబ్రాహాముకు ముందుగా నడిచినట్టే, మీరు కాలు పెట్టకముందే 'కొత్త ఏడాది'లో ఉన్న దేవుడు మీతో పాటు ఉంటాడు. కనానులో అబ్రహాము కరువు నెదుర్కొన్నాడు. కాని అలా జరిగిన ప్రతిసారీ ఆయన విశ్వాసంలో స్థిరపడ్డాడు. రెట్టింపు ఆశీర్వాదాలు పొందాడు. ఇప్పుడిప్పుడే మనం కాలుపెట్టిన కొత్త ఏడాదిలోనూ కొన్ని చేదు అనుభవాల్లో కూడా అసాధారణమైన దైవ కృపను, ఆయన సాన్నిధ్యాన్ని మీరనుభవిస్తారు. దేవుడున్న చోట లోకసంబంధమైన భయమనేది ఉండదు. అందువల్ల 'మీకు దేవుడు ముందుంటే, విజయాలు, ఆశీర్వాదాలు మీ వెంటే!

– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్

ఇస్లాం వెలుగు

గుండెల నిండా ప్రేమను నింపుకోవాలి

మనం మన తల్లిదండ్రుల్ని, పెద్దల్ని, గురువుల్ని ప్రేమిస్తాం, గౌరవిస్తాం. ఎందుకూ? వారు మన మేలు కోరేవారు. బాగు కోరేవారు. మన ఉన్నతిని కాంక్షించేవారు. మన శ్రేయోభిలాషులు. వారి ప్రేమాభిమానాలు, కారుణ్య వాత్సల్యాలు అనునిత్యం మనపై ప్రసరిస్తున్నాయి. చేసిన మేలును గుర్తించడం, చేసిన వారి పట్ల కృతజ్ఞత చూపడం మానవ నైజంలో ఉండే సహజ గుణం. ఉపకారి ముందు వినయ వినమ్రతలు కలిగి ఉండడం, అతని అభీష్టానికి అనుగుణంగా నడుచుకోవడం, వారు చెప్పింది చేయడం, వారి ఇష్టానికి వ్యతిరేకంగా నోరు మెదపకపోవడం వారిపట్ల విధేయతకు, అంకితభావానికి నిదర్శనం.

కాని ఇంతకన్నా ఎక్కువ, లెక్కకు మిక్కిలి మేళ్ళు, ఉపకారాలు,అనుగ్రహాలు, వరాలు దైవం మనపై కురిపించాడు. మనపైనే కాదు, అందరిపై కురిపించాడు. ధనిక, పేద అనే భేదం లేకుండా, పాలకుడు సేవకుడు అన్న తేడాలేకుండా, పల్లె పట్నం అన్న వ్యత్యాసం లేకుండా, ఆడా మగా అన్న తారతమ్యం లేకుండా,



వృద్ధులు– పిల్లలన్న విభజన లేకుండా ఆ కరుణామయుని అనుగ్రహాలు, ఆ దయామయుని కారుణ్య ఛాయ సమస్తాన్నీ పరివేష్టించి ఉంది. గుడిసెవాసులపై అయినా, భవనవాసులపై అయినా, అడవుల్లో అయినా, మైదానాల్లో అయినా, ఎటుచూసినా, ఎక్కడ చూసినా రేయింబవళ్ళు, ప్రతినిత్యం, అనుక్షణం ఆయన కారుణ్యానుగ్రహాలు వర్షిస్తూనే ఉన్నాయి.


ఆయన దాహార్తులకు దాహాన్ని, అన్నార్తుల క్షుద్బాధను తీరుస్తున్నాడు. వస్త్రవిహీనులకు ఆచ్ఛాదన ప్రసాదిస్తున్నాడు. వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యాన్నిస్తున్నాడు. ప్రజల ఆందోళన దూరం చేస్తున్నాడు. కష్టాలు బాధల నుండి రక్షిస్తున్నాడు. నిస్సహాయులకు అండగా నిలుస్తున్నాడు. నీడ లేని వారికి గూడు కల్పిస్తున్నాడు. నిరాశ్రయులకు ఆశ్రయమిస్తున్నాడు. సమస్త ప్రాణుల సుఖమయ జీవనానికి సమతుల ప్రకృతిని సిద్ధంచేసి పెట్టాడు. ఏ వ్యక్తి, ఏ సమూహం, ఏ ప్రాణి కూడా ఏ ఒక్క క్షణమూ ఆయన అనుగ్రహానికి దూరంగా లేదు. అనుగ్రహం లేకుండా లేదు, మనజాలదు. మరి అలాంటి దయాసముద్రుని పట్ల, కరుణామయుని పట్ల మనకెలాంటి ప్రేమ ఉండాలి? ఆయనతో మనకెలాంటి అనుబంధం ఉండాలి? ఎవరైనా చెప్పగలరా.. అంచనా వేయగలరా..? లెక్కలు కట్టగలరా? ఆయన సకల లోకాలకు ప్రభువు. రాజాధిరాజు. ప్రభువులకు ప్రభువు. దయాళువు, కారుణ్య సముద్రుడు. క్షమానిధి. అన్నీ చూసేవాడు, అన్నీ వినేవాడు. నిదుర పోనివాడు. కునుకు రానివాడు. అలసిపోనివాడు. అలుపులేనివాడు. అన్నిటిపై అధికారం కలిగిన వాడు. పాలించేవాడు, పోషించేవాడు. అధికుడు, ఆధిక్యుడు. సర్వ వ్యాపి. సర్వాంతర్యామి. జీవన్మరణాల విధాత. అలాంటి పరమ ప్రభువుపట్ల గుండెలనిండా ప్రేమ నింపుకోవాలి.

– ముహమ్మద్ ఉస్మాన్‌ఖాన్

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

జెన్‌పథం

ఒక్కరోజే కదండీ మోయాల్సింది!



ఆయన ఓ తత్వజ్ఞాని. ఆయన ప్రసంగం వినడానికి ఇరుగు పొరుగు ప్రాంతాల నుంచి అనేక మంది వచ్చిపోతుండేవారు. వాటిని ఆధారంగా చేసుకుని తమ ఆధ్యాత్మిక చింతనను పెంచుకునే వారు. ఆయనను ప్రశంసించే వారనేకం.

ఆయన ప్రసంగాలలో ఆధ్యాత్మిక చింతనే కాకుండా రోజువారీ మామూలు విషయాలు కూడా ఉపయోగపడేవిగా ఉంటూ ఉండేవి. బుద్ధుడు, మహావీరుడు తదితర పెద్దల మాటలను కూడా ఆయన తన ప్రసంగాలలో ఉదహరిస్తూ వచ్చేవారు.

ఓరోజు ఆయన వీధిలో నడచుకుంటూ పోతున్నారు. ఇంతలో అనుకోకుండా ఆయన చెప్పులు తెగిపోయాయి. ఆయన మెల్లగా కాళ్ళీడుస్తూ రోడ్డుపక్కనున్న చెప్పులు కుట్టే వ్యక్తి దగ్గరకు చేరుకున్నారు.

''ఇదిగో, ఈ చెప్పులు బాగు చేసివ్వు. తెగిపోయాయి'' అన్నారాయన చెప్పులు కుట్టే వ్యక్తికి రెండు చెప్పులూ ఇస్తూ.

చెప్పులు కుట్టే వ్యక్తి వాటిని అటూ ఇటూ తిప్పి చూసాడు. అవి బాగా అరిగిపోయున్నాయి.

''ఇక్కడ వదిలేసి వెళ్ళండి, సరిచేసి పెడతాను. రేపొచ్చి తీసుకుపోగలరు'' అన్నాడతను.

''ఏంటీ, రేపా'' అన్నారు జ్ఞాని.

''అవునయ్యా, ఇప్పటికే చేతి నిండా బోలెడంత పని ఉంది. ఆ పనంతా పూర్తి చేస్తే తప్ప మీ చెప్పుల విషయానికి రాలేను. పైగా ఈ చెప్పులు బాగు చేయడానికి చాలా సమయం పడుతుంది'' అన్నాడు.

అప్పుడు జ్ఞాని ''ఓ రోజంతా చెప్పులు లేకుండా ఎలా గడపాలి'' అని అడిగారు జ్ఞాని.

''ఒక్క రోజే కదండీ, వీటికి బదులు నా దగ్గరున్న మరో జత చెప్పులు ఇస్తాను. వాటితో గడపండి'' అన్నాడు ఆ పనివాడు.

''ఏంటీ'' అని స్వరం పెంచారు జ్ఞాని. ''మరొకరి చెప్పులను నా కాళ్ళు మోయాలా, నీకలా చెప్పడానికి ఎలా మనసొచ్చింది'' అని జ్ఞాని ఆవేశంగా అన్నారు.

చెప్పులు కుట్టే వ్యక్తి ఓ నవ్వు నవ్వాడు.

అనంతరం అతను ఆయనను చూసి ''ఇతరులు చెప్పిన అభిప్రాయాలన్నింటినీ మీ బుర్రలో పెట్టుకుని మోస్తూ తిరుగుతుంటారు. వాటిని అందరికీ చెప్తుంటారు... అలాంటిది మీరు ఒక్కరోజుమాత్రమే మరొకరి చెప్పులు వేసుకుని వాటిని మోయడంలో మీకొచ్చిన కష్టమేమిటండీ'' అని అడిగాడు.

ఆ మాటలతో జ్ఞాని ''సరే రేపు వస్తాను.... '' అని అక్కడి నుంచి మరొక్క మాట మాట్లాడకుండా వెళ్ళిపోయారు.

– యామిజాల జగదీశ్

మీకు తెలుసా

ప్రాచీన ప్రదేశాలు... ఆధునిక నామధేయాలు

1. మహావిష్ణువు గజేంద్రుణ్ణి మొసలి బారి నుంచి రక్షించిన స్థలం – దేవ్ ధాం, నేపాల్.
2. నృసింహస్వామి హిరణ్యకశిపుని వధించిన స్థలం – అహోబిలం, ఆంధ్రప్రదేశ్.
3. జమదగ్ని మహర్షి ఆశ్రమం – జమానియా, ఉత్తర్ ప్రదేశ్.
4. మాహిష్మతి (కార్తవీర్యార్జునుని రాజధాని) – మహేశ్వర్, మధ్యప్రదేశ్
5. శమంత పంచకం (పరశురాముడు ఇరవై ఒక్క మార్లు క్షత్రియులపై దండెత్తి వారి రక్తంతో 5 మడుగులు నెలకొల్పిన చోటు) దుర్యోధనుని చంపిన చోటు–కురుక్షేత్ర, హర్యానా
6. పరశురామక్షేత్రం (పరశురాముడు తన గొడ్డలిని సముద్రంలోకి విసిరి, సముద్రజలాలను వెనక్కి పంపి తనకోసం నేలను సృష్టించుకొన్న ప్రాంతం) – కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర సముద్రతీర ప్రాంతం
7. మహేంద్ర పర్వతం (పరశురాముడు తపస్సు చేసిన స్థలం) – పశ్చిమ ఒరిస్సా
8. నిషాద రాజ్యం (నల మహారాజు రాజ్యం) – గ్వాలియర్ జిల్లా, మధ్యప్రదేశ్
9. వ్యాస మహర్షి పుట్టిన స్థలం– ధమౌలి, నేపాల్
10. నైమిశారణ్యం (వ్యాస మహర్షి తన శిష్యులకు వేదాలు, పురాణాలు బోధించిన ప్రాంతం) – సీతాపూర్ జిల్లా, ఉత్తర్ ప్రదేశ్
11. వ్యాస మహర్షి చెబుతుండగా, విఘ్నేశ్వరుడు మహాభారతం వ్రాసిన చోటు– మన గ్రామం, ఉత్తరాంచల్
12. ప్రతిష్టానపురం (పురూరవుని రాజధాని) –ఝూన్సీ,అలహాబాద్.
13. సాళ్వ రాజ్యం(సావిత్రీ,సత్యవంతుల కథలో సత్యవంతుని రాజ్యం)–కురుక్షేత్ర దగ్గర.
14. హస్తినాపురం (కౌరవుల రాజధాని) – హస్తినాపూర్, ఉత్తర్ ప్రదేశ్.
15. మధుపురం / మధువనం (కంసుని రాజధాని) –మధుర, ఉత్తర్ ప్రదేశ్.
16. వ్రేపల్లె / గోకులం – గోకుల్, మధుర దగ్గర.
17. కుంతిపురి (పాండురాజు మొదటి భార్య కుంతిదేవి పుట్టినిల్లు) – గ్వాలియర్.
18. మద్ర దేశం (పాండురాజు రెండో భార్య మాద్రి పుట్టినిల్లు) – పంజాబ్ ప్రావిన్స్, పాకిస్తాన్.
19. ద్రోణనగరి (ద్రోణుడు నివసించిన ప్రాంతం)– డెహ్రాడూన్.
20. గురుగ్రామం (కురుపాండవులు విద్యాభ్యాసం చేసిన చోటు) – గురుగావ్, హర్యానా.

హైదరాబాద్
ఆదివారం
7-1-2018
సినిమా
సాక్షి ఫ్యామిలీ

పరి పరిశోధన


మొక్కల దాహం చెప్పేస్తాయి...

మొక్కలు ఏపుగా పెరిగి మోపెడంత పంట ఇవ్వాలంటే నీరు బాగా అవసరం. మరి ఇదే నీరు మోతాదుకు మించి అందితే.. మొక్కలు కుళ్లిపోతాయి. లేదంటే నీరు వథా అవుతుంది. రెండింటితోనూ నష్టమే కదా.. అందుకే అయోవా స్టేట్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మొక్కల నీటి అవసరాలను సులువుగా గుర్తించేందుకు ఓ వినూత్నమైన పద్ధతిని ఆవిష్కరించారు. చిన్నసైజు పట్టీల్లా ఉండే గ్రాఫీన్ పొరలను మొక్కల ఆకులపై అతికిస్తే చాలు.. ఎప్పుడు నీరు పట్టాలో ఇట్టే తెలిసిపోతుంది.



గ్రాఫీన్‌లోని కర్బన అణువులు ఒక నిర్దిష్ట పద్ధతిలో అమరి ఉంటాయి. పైగా ఇది విద్యుత్తు ప్రసారానికి బాగా సహకరిస్తుంది. ఈ లక్షణాలను ఉపయోగించుకుని లియాంగ్ డాంగ్ అనే శాస్త్రవేత్త వీటిని గ్రాఫీన్‌ను తేమను గుర్తించే సెన్సర్‌గా మార్చేశారు. అతి చౌకగా, సులువుగానూ ఉత్పత్తి చేసుకోగల ఈ సెన్సర్లు మొక్కల ఆకుల నుంచి వెలువడే నీటి ఆవిరిలో వచ్చే తేడాలను గుర్తిస్తాయి. ఇందులో వచ్చే మార్పుల ఆధారంగా మొక్కకు నీటి అవసరం ఎప్పుడు ఉంటుందో గుర్తించవచ్చు. తాము ఈ పద్ధతిని ఇప్పటికే కొన్ని మొక్కజొన్న పంటల్లో వాడి మంచి ఫలితాలు సాధించామని డాంగ్ తెలిపారు. ఈ సెన్సర్లు చాలా పలుచగా, చిన్నగా ఉండటం వల్ల మొక్కల సాధారణ ఎదుగుదలకు ఏమాత్రం ఇబ్బంది ఉండదని అంచనా. పొలంలో అక్కడక్కడా కొన్ని మొక్కలకు ఈ సెన్సర్లను అతికిస్తే పంటలకు ఎప్పుడు నీళ్లు పట్టాలో తెలుస్తుందన్నమాట!

ఈ కిటికీలతో బోలెడంత కరెంటు...



ఇంటి కిటికీలు వెలుతురుతోపాటు కరెంటు కూడా అందిస్తే బాగుంటుందని చాలాకాలంగా అనుకుంటున్నారా? అయితే మీ ఆశలు తీరే రోజు దగ్గరకు వచ్చేసింది. అమెరికాలోకు చెందిన లాస్ అలమోస్ నేషనల్ లేబొరేటరీ శాస్త్రవేత్తల బందం ఇలాంటి సరికొత్త కిటికీలను అభివద్ధి చేసింది మరి! మార్కెట్‌లో ఇప్పటికే కొన్ని పారదర్శక సోలార్ ప్యానెల్స్ ఉన్నప్పటికీ వాటికంటే ఎక్కువ విద్యుత్తును ఉత్పత్తి చేసేలా తాము చేయగలిగామని ఈ ప్రాజెక్టుకు నేతత్వం వహించిన శాస్త్రవేత్త విక్టర్ క్లిమోవ్ తెలిపారు. రెండు పొరలుగా ఉండే ఈ కొత్త రకం సోలార్ ప్యానెల్ సాధారణ ప్యానెల్స్ విద్యుత్తు ఉత్పత్తి చేయలేని కాంతులనూ వాడుకోగలగడం విశేషం. కిటికీలోని రెండు పొరలు వేర్వేరు రంగులను శోషించుకోవడమే కాకుండా.. ప్రత్యేక పద్ధతి ద్వారా ఈ రంగులను కిటికీకి ఒకవైపున ఉండే చిన్నసైజు సోలార్ ప్యానెల్స్‌వైపు మళ్లిస్తారు. దీంతో అక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్తు మోతాదు ఎక్కువగా ఉంటుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు ఈ కొత్త టెక్నాలజీ ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తల అంచనా.

తర్వాత సంగతి తర్వాత!



● శ్రియ

కొంతమంది మనస్తత్వం అంతే.. మనసులో ఏదనిపిస్తే అది బయటకు చెప్పేస్తారు. తర్వాత సంగతి తర్వాత అంటారు. ఎవరేమనుకుంటారో అని భయపడరు. లోపల ఒకటి అనుకొని బయట ఇంకోలాగా ప్రవర్తించటం వాళ్లకు చేత కాదు. అలాంటి మనస్తత్వం ఉన్న పాత్రనే పోషించారు శ్రియ 'గాయత్రి' సినిమాలో. ఈ సినిమాలో శ్రియ లుక్‌ను శనివారం విడుదల చేశారు. 'నేనేదనుకుంటే అది చెప్పటం నాకలవాటు.. తర్వాత సంగతి తర్వాత' అని క్యాప్షన్ ఉన్న ఆమె పోస్టర్ ఆకట్టుకునే విధంగా ఉంది. అరియానా, వివియానా మరియు విద్యా నిర్వాణ సమర్పణలో మంచు మోహన్‌బాబు నటించి, శ్రీ లక్ష్మీప్రసన్న పిక్చర్స్ పై నిర్మించిన ఈ సినిమాలో గాయత్రి పాత్రను నిఖిలా విమల్ పోషించారు. విష్ణు, శ్రియ భార్యాభర్తలుగా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. షూటింగ్ కంప్లీట్ చేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమాకు మదన్ రామిగాని దర్శకుడు. ఫిబ్రవరి 9న ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: సర్వేష్ మురారి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: విజయ్‌కుమార్.ఆర్.

గోపీచంద్ పంతం!



● గోపీచంద్

విలన్స్‌ను రఫ్ఫాడిస్తున్నారు హీరో గోపీచంద్. ఎక్కడ అంటే... హైదరాబాద్‌లోనే. ఎందుకంటే.. అది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్. చక్రి దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా కేకే రాధామోహన్ ఓ సినిమా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మెహరీన్ కథానాయిక. ఈ సినిమాకు 'పంతం' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేయాలన్న ఆలోచనలో చిత్రబృందం ఉన్నారని ఫిల్మ్‌నగర్ టాక్.

నేనే చెబుతా



● వరుణ్ తేజ్

... అప్పటి వరకు వెయిట్ చేయండి. నా నెక్ట్స్ సినిమా గురించి ఊహాగానాలను, గాసిప్‌లను నమ్మొద్దు అంటున్నారు హీరో వరుణ్‌తేజ్. వెంకీ అట్లూరి దర్శకత్వంలో వరుణ్‌తేజ్, రాశీఖన్నా జంటగా రూపొందుతున్న 'తొలిప్రేమ' సినిమా పూర్తి కావచ్చింది. ఫిబ్రవరి 9న రిలీజ్ కానుంది. దీంతో వరుణ్‌తేజ్ నెక్ట్స్ ప్రాజెక్ట్‌పై ఊహగానాలు మొదలయ్యాయి. ''నా కొత్త ప్రాజెక్ట్ ఇంకా ఏదీ ఫైనలైజ్ కాలేదు. ఓకే అయితే నేనే చెబుతాను'' అని సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు వరుణ్.

సూపర్ హిట్ జర్నీ



● బీఏ రాజు

పాత్రికేయుడిగా, 'సూపర్‌హిట్' పత్రికాధినేతగా, పీఆర్వోగా, నిర్మాతగా బీఏ రాజు జర్నీ సక్సెస్‌ఫుల్. నేడు ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా కొత్త సినిమా విశేషాలను తెలియజేశారు. 'చంటిగాడు, గుండమ్మగారి మనవడు, లవ్లీ, వైశాఖం' వంటి చిత్రాలను తెరకెక్కించిన డైనమిక్ లేడీ డైరెక్టర్ జయ. బి దర్శకత్వంలో ఆర్‌జే సినిమాస్ పతాకంపై బీఏ రాజు మరో సినిమా నిర్మించనున్నారు. ఆయన మాట్లాడుతూ – ''నిర్మాతగా 15 ఇయర్స్ కంప్లీట్ అయ్యాయి. మా బేనర్‌లో వచ్చిన సినిమాలను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. గతేడాది నిర్మించిన 'వైశాఖం' మంచి విజయం సొంతం చేసుకుంది. ఇప్పుడు మరో చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు శ్రీకారం చుట్టాం. స్టోరీ డిస్కషన్స్ జరుగుతున్నాయి. జూన్‌లో ప్రారంభించాలనుకుంటున్నాం'' అన్నారు.



● జ్ఞానవేల్ రాజా, వంశీ, విఘ్నేష్ శివన్, రమ్యకృష్ణ, కీర్తీ సురేశ్, సూర్య, అల్లు అరవింద్

ఆంధ్రా మీల్స్ చాలా కారం కానీ.. సినిమా పై మీ ప్రేమ అపారం

- దర్శకుడు విఘ్నేష్ శివన్

''సూర్యతో నాకు 'గజిని' సినిమా నుంచి అనుబంధం కొనసాగుతోంది. మా కాంబినేషన్‌లో సినిమా చేయాలని ఐదేళ్లుగా ప్రయత్నిస్తున్నాం కానీ కుదరడంలేదు. త్వరలో అవుతుందనుకుంటున్నాను. కీర్తీ సురేష్ నా స్నేహితుడి కూతురు. రమ్యకృష్ణ నా హీరోయిన్. నేను నిర్మించిన సినిమాల్లో యాక్ట్ చేశారు. తమిళంలో జ్ఞానవేల్ రాజాగారిది పెద్ద బ్యానర్. వంశీకు సినిమా అంటే పిచ్చి. సినిమా తీసి, అమ్ముకొని డబ్బులు చేసుకొని వెళ్లిపోయేవాళ్లు చాలామంది ఉన్నారు కానీ నిలబడి తీసి, దమ్ముతో ఆడించే తక్కువమందిలో వంశీ ఒకడు. అందుకే తనంటే నాకు ఇష్టం. సినిమాకు వర్క్ చేసిన అందరికీ నా అభినందనలు'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్. సూర్య, కీర్తీ సురేష్ జంటగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందిన 'తానా సేంద కూట్టమ్' చిత్రాన్ని తెలుగులో యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్‌లు 'గ్యాంగ్' పేరుతో రిలీజ్ చేస్తున్నారు. అనిరుధ్ సంగీత దర్శకుడు. ఈ చిత్రం ప్రీ–రిలీజ్ ఫంక్షన్ హైదరాబాద్‌లో జరిగింది. సూర్య మాట్లాడుతూ– ''మన స్కూల్‌లో, కాలేజ్‌లో, ఆఫీస్‌లో ఇలా ప్రతి చోటా మనకు ఒక గ్యాంగ్ ఉంటుంది. గ్యాంగ్ మన లైఫ్‌లో ఒక కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సినిమాతో యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ మా గ్యాంగ్‌లో మెంబర్స్ అయ్యారు. అల్లు అరవింద్‌గారు 'గజిని' సినిమా నుంచి మా గ్యాంగ్‌లో ఉన్నారు. ఈ సినిమాలో నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకున్నాను. తమిళ ఫ్లేవర్ కనిపిస్తే క్షమించండి. కుటుంబం అంతా చూసే చిత్రం అవుతుంది'' అన్నారు. ''ఆంధ్రా మీల్స్ చాలా కారం, కానీ.. సినిమాపై మీ (ప్రేక్షకులు) ప్రేమ అపారం. అందరూ గ్యాంగ్‌గా వచ్చి ఈ సినిమాను చూడండి'' అన్నారు దర్శకుడు. ఈ వేడుకలో దర్శకుడు మారుతి, నటి రమ్యకృష్ణ, కథానాయిక కీర్తీ సురేష్ పాల్గొన్నారు.



● ఐశ్వర్యా రాయ్


● సోనమ్ కపూర్

ఇరుగమ్మ పొరుగమ్మ.. సంగతేంటమ్మా?

విషయం చదివిన తర్వాత షాక్ అవుతారేమో. కొంచెం కూల్ వాటర్ తాగి, ప్రశాంతంగా చదవండి. చెప్పబోయే విషయం అలాంటిది మరి. అసలు విషయం ఏంటంటే... 21 కోట్ల రూపాయలతో ఇల్లు కొనుక్కున్నారు అభిషేక్ బచ్చన్–ఐశ్వర్యా రాయ్. 21 కోట్లా? అని షాక్ అయ్యారు కదా. ఐశ్వర్యవంతులు ఇల్లంటే మజాకానా? అన్నేసి కోట్లు పోసి కొంటారు మరి. ముంబైలోని బాంద్రా- కుర్లా కాంప్లెక్స్‌లో ఈ జోడీ ఒక అపార్ట్‌మెంట్ తీసుకున్నారు. 2015లోనే ఈ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేశారు. 5500 చదరపు అడుగుల ఈ అపార్ట్‌మెంట్‌లో చదరపు అడుగు 38 వేలు అట. ఇక ఇంటీరియర్ డెకరేషన్ అయితే కళ్లు చెదిరేలా ఉంటుందట. ముంబైకి చెందిన ఫేమస్ ఇంటీరియర్ డిజైనర్స్ 'తలటి పంతకీ అసోసియేట్స్' (టి.పి.ఎ)తో చాలా లావిష్‌గా డిజైన్ చేయించుకున్నట్లు సమాచారం. మరి.. కొత్తింట్లోకి ఎప్పుడు షిఫ్ట్ అవుతారో చూడాలి. వీళ్ల పక్కింట్లో ఉండబోయేది ఎవరో తెలుసా? సోనమ్ కపూర్. ఈవిడగారి ఇంటి రేటు 35 కోట్లు అట. సరే.. కోట్లున్నాయి కాబట్టి కొన్నారు. అంతా బాగానే ఉంది. అయితే ఐష్‌కీ సోనమ్‌కీ పెద్దగా పడదు. ఓసారి 'ఆంటీ' అని ఐశ్వర్యను సోనమ్ పిలిచినందుకు ఐష్ ఫీలైపోయారు. అలాగే, కాన్స్ చిత్రోత్సవాల్లో ఇద్దరూ పాల్గొంటారు కాబట్టి, పోటీ ఫుల్‌గా ఉంది. మరి.. ఇరుగుపొరుగు కాబోతున్న ఈ ఇద్దరూ ఎడమొహం పెడమొహంగా ఉంటారో.. ఫ్రెండ్లీగా ఉంటారో చూడాలి. ఏం జరిగినా న్యూసే కదా.

ముగ్గు-ముచ్చట

11 చుక్కలు – 11 వరుసలు – సరిచుక్కలు



ఎస్.బి. సురేఖ, మైదుకూరు, వైఎస్సార్ కడప జిల్లా

27 చుక్కలు
చుక్క మధ్య చుక్క
14 వచ్చే వరకు



శివపార్వతి
తిరువూరు, కృష్ణా జిల్లా

24 చుక్కలు
10 వరుసలు
10 వచ్చే వరకు




బొజ్జం పద్మారెడ్డి, హన్మకొండ

ముగ్గులకు ఆహ్వానం ముగ్గులు పంపవలసిన చిరునామా ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. muggulu.sakshi@gmail.com; మరిన్ని ముగ్గులకు ... sakshi.com చూడండి.

సాక్షి ఫ్యామిలీ
సినిమా
హైదరాబాద్
ఆదివారం
7-1-2018


● సూర్య, కీర్తీ సురేష్


● హన్సిక, ప్రభుదేవా


● షణ్ముగ

సదరన్ స్పైస్


రెండు రోజులు ముందే పండగ!


● విక్రమ్, తమన్నా

ఇక్కడ సంక్రాంతి.. అక్కడ (తమిళనాడు) పొంగల్... పేర్లు వేరైనా పండగ జోష్‌లో మాత్రం ఏ తేడా ఉండదు. తెలుగు బాక్సాఫీస్ వద్ద నాలుగు సినిమాలు రెడీగా ఉన్నాయి. మరి... తమిళ బాక్సాఫీస్ వద్ద ఎన్ని సినిమాలు ఉన్నాయి అంటే.. అక్కడ కూడా నాలుగే. అయితే ఇంట్రస్టింగ్ మేటర్ ఏంటంటే.. ఈ నాలుగు సినిమాలు ఒకే తేదీన.. అది కూడా పండగ రెండు రోజులు ముందే (12.01.18) విడుదల కానున్నాయి.

సంక్రాంతికి బాక్సాఫీస్‌ను కొల్లగొట్టేందుకు అందరికంటే ముందు కర్చీఫ్ వేసింది హీరో సూర్యానే. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ఆయన హీరోగా రూపొందిన సినిమా 'తానా సేంద కూట్టమ్'. తెలుగులో 'గ్యాంగ్' అనే టైటిల్‌తో రిలీజ్ చేస్తున్నారు. కీర్తి సురేశ్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో రమ్యకృష్ణ కీలక పాత్ర చేశారు. హిందీ చిత్రం 'స్పెషల్ 26'లో ఉన్న మెయిన్ పాయింట్ ఇందులో ఉందట. సూర్య తర్వాత పండక్కి మేం వస్తున్నాం అని ఎనౌన్స్ చేశారు ప్రభుదేవా. కల్యాణ్ దర్శకత్వంలో ఆయన హీరోగా రూపొందిన సినిమా 'గులేభకావళి'. హన్సిక కథానాయికగా నటించిన ఈ సినిమాలో సీనియర్ నటి రేవతి కీలక పాత్ర చేశారు. అయితే.. టైటిల్ చదవగానే పాత సినిమా గుర్తుకు రావచ్చు. అందుకే.. గతంలో ఇదే టైటిల్స్‌తో వచ్చిన సినిమాలకు కనెక్ట్ అయ్యేలా ఈ సినిమాలో ఫ్లాష్ బ్యాక్ ఏదో ప్లాన్ చేశారట చిత్రబృందం. ఇక, పొంగల్ సందడిలో బాక్సాఫీస్ వద్ద స్కెచ్ వేస్తున్నామని విక్రమ్ ఎప్పటినుంచో చెబుతూనే ఉన్నారు కానీ.. ఎప్పుడో కరెక్ట్‌గా చెప్పలేదు. ఫైనల్‌గా జనవరి 12న బాక్సాఫీస్‌ను షేక్ చేసేందుకు రెడీ అయ్యారాయన. విజయ్ చందర్ దర్శకత్వంలో విక్రమ్, తమన్నా జంటగా నటించిన చిత్రం 'స్కెచ్'. ఈ సినిమాను కేరళలో కూడా 12నే రిలీజ్ చేస్తున్నారు. ముగ్గురు బడా హీరోలు పండక్కి బాక్సాఫీస్ వద్ద కాచుకుని ఉంటే.. ఏం పర్లేదు. మా సినిమా కంటెంట్‌పై భరోసా ఉంది. సో.. పండగ బరిలో దిగేందుకు సిద్ధమే అని 'మధుర వీరన్' టీమ్ సై అంటూ సంక్రాంతి బరిలోకి దిగారు. పీజీ ముత్తయ్య దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో సీనియర్ నటుడు విజయకాంత్ తనయుడు షణ్ముగ పాండియన్, సముద్రఖని ముఖ్యపాత్రలు పోషించారు. ఇవికాక.. సుందర్. సి దర్శకత్వంలో రూపొందిన 'కలకలప్పు–2', అరవింద్‌స్వామి నటించిన 'భాస్కర్ ఒరు రాస్కెల్' సినిమాలు సంక్రాంతి బరిలో ఉంటాయన్న ఊహాగానాలున్నాయి. అయితే.. ఇప్పటివరకూ ఈ చిత్రాల విడుదల తేదీలను అధికారికంగా ప్రకటించలేదు. ఆల్రెడీ నాలుగు సినిమాలు రెడీ అయిపోవడంతో ఈ సినిమాలు రాకపోవచ్చన్నది కొందరి వాదన. పండక్కి ఎన్ని సినిమాలు విడుదలైనా చూసే తీరిక ప్రేక్షకులకు ఉంటుందన్నది మరికొందరి వాదన. మరి.. సంక్రాంతికి ఎన్ని సినిమాలొస్తాయి? బరిలో గెలుపు ఎవరిది? 'వెట్రి యారుక్కున్ను అంజు నాళ్ పొరుత్తి రిందు పార్పోమ్'. అర్థం కాలేదా? 'గెలుపు ఎవరికన్నది ఐదు రోజులు వేచి చూద్దాం' అని అర్థం.

జేమ్స్‌తో గేమ్సా?


● మమ్ముట్టి

క్రైమ్ జరిగింది. క్లూస్ నిల్. ఆధారాలు కనిపెట్టే అవకాశాలు ఆల్మోస్ట్ క్లోజ్ అయ్యాయి. కానీ కేస్‌లో దోషులకు శిక్ష పడాలి. ఎలా? అప్పుడే ఎంట్రీ ఇచ్చాడు మిస్టర్ జేమ్స్. కూపీ లాగుతూ దోషులను బయటపెట్టాడు. మరి జేమ్స్ ఎలా కనిపెట్టాడు? జేమ్స్‌తో గేమ్స్ ఆడాలనుకున్న వారి ఆట ఎలా కట్టించాడు? అనే కథాంశంతో సాగే సినిమా 'స్ట్రీట్‌లైట్స్'. ప్లె హౌస్ మోషన్ పిక్చర్స్ ప్రైవెట్ లిమిటెడ్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమాకు కెమెరామెన్ శ్యామ్‌దత్ సైనుద్దీన్ దర్శకత్వం వహించారు. తమిళ, మలయాళ సినిమాలకు కెమెరామెన్‌గా వర్క్ చేసిన శ్యామ్‌దత్ పదేళ్ల క్రితం తెలుగులో వచ్చిన 'ప్రస్థానం' సినిమాకు కెమెరామెన్‌గా వర్క్ చేశారు. తమిళ, మలయాళం భాషలతోపాటుగా తెలుగులోనూ 'స్ట్రీట్‌లైట్ ' చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు. టీజర్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. ''మమ్ముట్టి నటించిన సినిమాలు తెలుగులో పెద్ద విజయాలు సాధించాయి. అందుకే 'స్ట్రీట్‌లైట్స్'ని తెలుగులో రిలీజ్ చేయాలనుకుంటున్నాం. శ్యామ్‌దత్ కథ, కథనం ప్రేక్షకులకు కొత్తగా ఉంటాయి'' అన్నారు చిత్రబృందం. స్టంట్ శివ, మొట్ట రాజేంద్ర, పాండిరాజన్ కీలకపాత్రలు చేసిన ఈ చిత్రానికి సంగీతం: ఆదర్శ్ అబ్రహం.

సూపర్ మచ్చీ


● విజయ్

మురుగదాస్ దర్శకత్వంలో విజయ్ హీరోగా ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. ఇందులో సమంత, కాజల్, అనుష్క.. వీళ్లలో ఒకరు హీరోయిన్ అని, అనిరుధ్ సంగీతం అందిస్తాడని ఊహాగానాలు వినిపించాయి. ఈ ఊహాగానాలన్నింటికీ తెరదించుతూ చిత్రనిర్మాణ సంస్థ సన్ నెట్‌వర్క్ ఆర్టిస్ట్స్, టెక్నీషియన్ల వివరాలను ప్రకటించింది. ఇందులో కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటించనున్నారు. ఎ.ఆర్. రెహమాన్ సంగీత దర్శకుడు. 'కలి, అంగమలై డైరీస్' వంటి మలయాళ సినిమాలకు కెమెరామెన్‌గా పని చేసిన గిరీశ్ గంగాధరన్ ఈ సినిమాకు ఛాయాగ్రాహకుడు. హై బడ్జెట్ స్టైలిష్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ సినిమాలో విజయ్ లుక్‌కు సంబంధించిన టెస్ట్‌షూట్ ఇటీవల జరిగింది. షూట్‌లో భాగంగా రోల్స్ రాయిస్ కార్‌ను ఆనుకొని స్టైల్‌గా సిగార్ తాగుతున్న విజయ్ ఫొటోలు, ఓ చిన్న వీడియో లీక్ అయ్యాయి. లుక్ సూపర్ మచ్చీ (సూపర్ మామ) అని విజయ్ ఫ్యాన్స్ సంబరపడిపోతున్నారు.

ప్యారిస్‌లో డాన్ లవ్


● సాయేషా

సెంటిమెంట్స్ లేని సెటిల్‌మెంట్స్ చేస్తూ సూట్‌కేసులు అందుకుంటూ దాదాగిరి చేసుకునే డాన్ అతను. మూడు గన్స్, ఆరు సూట్‌కేసుల్లా అతని లైఫ్ సాగుతుంది. కానీ సడన్‌గా గన్ పక్కన పెట్టి గులాబీ పట్టుకున్నాడు. ఎందుకలా అంటే.. డాన్ మనసులో ప్రేమ చిగురించింది. అది ఎంత స్ట్రాంగ్ అంటే.. ఆ అమ్మాయి కోసం ఏకంగా ఇండియా నుంచి ప్యారిస్ వెళ్లాడు. నెక్ట్స్ ఏమైంది అంటే.. 'చెప్పమండి.. ఎలాగూ థియేటర్స్‌కి వస్తాంగా. చూసి, మా జుంగ లవ్ ఎలా ఉందో చెప్పండి'' అంటున్నారు చిత్రబృందం. 'కాష్మోరా' ఫేమ్ గోకుల్ దర్శకత్వంలో 'పిజ్జా' ఫేమ్ విజయ్ సేతుపతి, సాయేషా, నేహా శర్మ ముఖ్య పాత్రల్లో రూపొందుతున్న సినిమా 'జుంగ'. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను శుక్రవారం విడుదల చేశారు. టైటిల్ టీజర్‌ను శనివారం రిలీజ్ చేశారు. వేసవిలో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు.


● విజయ్ సేతుపతి

వెరీ స్పెషల్


● దిలీప్

ఐదు నెలల తర్వాత ఫేస్‌బుక్‌లో ఓ పోస్ట్ చేశారు మలయాళ నటుడు దిలీప్. అంత గ్యాప్ ఎందుకొచ్చింది? అంటే.. నటి భావన కేసులో నిందితుడిగా ఆల్మోస్ట్ 80 రోజులు జైల్లో ఉన్నారాయన. గతేడాది జూలై 10న దిలీప్ 'రామలీల' సినిమాలోని ఓ లుక్‌ను పోస్ట్ చేశారు. అదే రోజున భావన కేసుకు సంబంధించి ఆయన అరెస్ట్ అయ్యారు. దిలీప్ రిలీజైన తర్వాత విడుదలైన 'రామలీలా' సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్‌ను రాబట్టింది. అయితే.. ఇప్పుడు ఆయన పోస్ట్ చేసింది తన అప్‌కమింగ్ సినిమా 'కమ్మార సంభవం' గురించి. ఈ సినిమాలో ఆర్మీ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్న లుక్‌ను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారాయన. దిలీప్, సిద్ధార్థ్, నమితా ప్రమోద్, బాబీ సింహా ముఖ్య తారలుగా నటిస్తున్నారు. రతీస్ అంబత్ దర్శకత్వం వహిస్తున్నారు. నిజానికి 2016లో ఈ సినిమా స్టార్టైంది. దిలీప్ అరెస్ట్ ఇష్యూతో షూటింగ్ లేట్ అయ్యింది. అందుకే ఈ సినిమా షూటింగ్‌ను ప్రస్తుతం వేగంగా జరుపుతున్నారు. ఇంకో విషయం ఏంటంటే.. మలయాళంలో సిద్ధార్థ్‌కు ఈ సినిమా ఫస్ట్ మూవీ. 'మలయాళంలో నా తొలి చిత్రం 'కమ్మార సంభవం' ఫస్ట్ లుక్ ఇది. దిలీప్ లుక్ బాగుంది కదూ. వెరీ స్పెషల్ లుక్. నాకు వెరీ వెరీ స్పెషల్ పిక్చర్' అని సిద్ధార్థ్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. సిద్ధార్థ్ కూడా ఈ సినిమాలో ఆర్మీ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారని సమాచారం.

అయినా మంచి భర్తే!


● ప్రేమ్‌కుమార్

భార్య కాలికి దెబ్బతగిలి హస్పిటల్‌లో జాయిన్ అయితే.. ఏ భర్త అయినా చూడకుండా ఉంటాడా? పోనీ.. రెండేళ్లుగా ఇంటిని పట్టించుకోకపోవడమే కాకుండా.. ఒక్క పండగని కూడా ఫ్యామిలీ మెంబర్స్‌తో కలిసి చేసుకోలేకపోతే.. ఆ భర్త 'మంచివాడు' అవుతాడా? కాదు కదా. అయినా ఇప్పుడు చెప్పబోతున్న దర్శకుడు ప్రేమ్ మాత్రం మంచివాడే. భార్యను పట్టించుకునే తీరిక అతనికి లేదు. ఫ్యామిలీతో పండగలు చేసుకునే ఖాళీ లేదు. ఎందుకలా? అంటే.. ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్ 'ది విలన్' కోసం. శివరాజ్ కుమార్, సుదీప్, అమీజాక్సన్ ముఖ్య తారలుగా ప్రేమ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'ది విలన్'. న్యూ ఇయర్ స్పెషల్‌గా టీజర్‌ను లాంచ్ చేయాలనుకున్నారు. కానీ గ్రాఫిక్స్ వర్క్స్ పెండింగ్ ఉండటం వల్ల వీలుపడలేదట. ఇందుకు ప్రేమ్ సోషల్ మీడియాలో వివరణ ఇచ్చుకున్నారు. ఈ సినిమా గురించి మరిన్ని విశేషాలు చెప్పారాయన. ''బ్యాలెన్స్ టాకీ పార్ట్‌ను, ఫోర్ సాంగ్స్‌ను ఫిబ్రవరి కల్లా కంప్లీట్ చేయాలనుకుంటున్నాం. ఇందుకోసం ఫోర్ డిఫరెంట్ స్టూడియోస్‌లో సెట్ వర్క్ స్టార్ట్ చేశాం. ఏప్రిల్ కల్లా కంప్లీట్ అవుతుందని అనుకుంటున్నాం. మల్టీస్టారర్ సినిమా కావడంతో రెండు టీజర్స్‌ను రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అంటూ తన పర్సనల్ లైఫ్ గురించి ప్రేమ్ మాట్లాడుతూ– ''నా భార్య రక్షిత కాలికి గాయమైనప్పుడు నేను హస్పిటల్‌కి వెళ్లలేదు. ఇంట్లో పండగ సంబరాలు జరుపుకుని రెండేళ్లయింది. ఒక్కరోజు కూడా హాలీడే తీసుకోకుండా 'ది విలన్' సినిమా కోసం వర్క్ చేస్తున్నా'' అని చెప్పుకొచ్చారు. ఇప్పుడు చెప్పండి.. ప్రేమ్ మంచి భర్త అంటే ఒప్పుకుంటారు కదా.



● నిధి కుశలప్ప

కన్నడంలో కుమారి

''నా పేరు కుమారి, నా ఏజ్ 21, ఐయామ్ ఎ ఫీమేల్. ఏం.. నన్ను లవ్ చేయటానికి నేను సరిపోనా. నా బ్యాక్‌గ్రౌండ్ మొత్తం కావాలా...'' అంటూ 'కుమారి 21ఎఫ్' సినిమాలో హెబ్బా పటేల్ పలికిన సంభాషణలను ఎవరూ మర్చిపోలేరు. రాజ్ తరుణ్, హెబ్బా పటేల్ జంటగా సుకుమార్ రైటింగ్స్ నిర్మాణంలో సూర్యప్రతాప్ పల్నాటి దర్శకత్వం వహించిన 'కుమారి 21ఎఫ్' మంచి సక్సెస్ సాధించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ సినిమా కన్నడంలో అదే టైటిల్‌తో రీమేక్ అయింది. హెబ్బా పటేల్ పోషించిన కుమారి పాత్రను నిధి కుశలప్ప పోషించారు. కుమారి బాయ్ ఫ్రెండ్ రాజ్ తరుణ్ పాత్రలో ప్రణామ్ దేవరాజ్ నటించారు. అవినాష్, మనోజ్, అక్షయ్, రితేష్ కీలక పాత్రల్లో కనిపిస్తారు. ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌ను సంపత్ కుమార్, శ్రీధర్ సంయుక్తంగా నిర్మించగా శ్రీమన్ వేముల దర్శకత్వం వహించారు. మణిశర్మ తనయుడు సాగర్ మహతి సంగీతం అందించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది.

Dwaraka

కుభీర్ మండలంలోని జామ్‌గావ్ గ్రామం



'మత్తు'కు దూరంగా మనుషులకు దగ్గరగా

మద్యం, మాంసం ముట్టని నిర్మల్ జిల్లా గ్రామాలు
ఆదర్శంగా నిలుస్తున్న పాంగ్రా, ఝరి(బి), హిప్నెల్లి, జామ్‌గావ్, వాస్తపూర్

నిర్మల్ జిల్లాలోని కుభీర్, తానూరు, మామడ మండలాల పరిధిలోని ఆరేడు తండాలు/గ్రామాలు మద్యపానంపై స్వీయ నిషేధం విధించుకున్నాయి. ఈ ఊళ్లలో మందు సీసాలే కాదు.. కల్లు అమ్మే దుకాణం కూడా కనిపించదు. మేకలు, కోళ్లు కోయడమనే ముచ్చటే ఉండదు. మద్యం, మాంసాహారం గురించి మాట్లాడినా ఆ గ్రామాల ప్రజలు సున్నితంగా తిరస్కరిస్తారు. ఏ నిర్ణయమైనా సంఘటితంగా తీసుకుంటారు. సమష్టిగా గ్రామ అవసరాలు తీర్చుకుంటారు. ఎవరికీ భారం కాకుండా ఊరంతా కలసి సామూహికంగా తమ పిల్లలకు వివాహాలు చేస్తారు. ఇవే వారిని, వారి గ్రామాలను ప్రత్యేకంగా నిలుపుతున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా 'మద్యం' మహమ్మారి జాడ లేకపోవడంతో ఈ గ్రామాల్లో నేరాలు, ఘోరాలు దాదాపుగా లేకపోవడం గమనార్హం.

ఎక్కడైనా నలుగురు కలిస్తే మద్యం తాగడం, మాంసాహారం తినడం ఓ ఫ్యాషన్‌గా మారిపోయిన రోజులివి. పండుగలొచ్చినా, పబ్బాలొచ్చినా.. మంచైనా, చెడైనా.. మద్యం, మాంసాహార వినియోగం తప్పనిసరిగా మారిపోయింది. మద్యం మహమ్మారి కారణంగా ఎన్నో ప్రాణాలు పోతున్నాయి. పేద కుటుంబాలు కకావికలం అవుతున్నాయి. ఇలాంటి సమయంలో నిర్మల్ జిల్లాలోని పలు గ్రామాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయి. మద్యపానానికి, మాంసాహారానికి దూరంగా ఉండడమే కాదు సమష్టితత్వం, పరస్పర సహకారంతో అభివృద్ధి బాటన ప్రయాణిస్తున్నాయి. హంగులు, ఆర్భాటాలు వదిలేసి సేవాతత్వంలో నడుస్తూ సరికొత్త బాటను చూపుతున్నాయి. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో నిర్మల్ జిల్లాలోని కుభీర్, తానూరు, మామడ మండలాల్లో ఉన్న ఈ గ్రామాలపై ఈ వారం 'ఫోకస్'..
– నిర్మల్



పాంగ్రాలోని ఏకముఖి దత్తాత్రేయుడు

వాస్తపూర్.. ప్రతి ఇల్లు దేవాలయమే


చుట్టూ పచ్చని చెట్లతో ఎత్తయిన గుట్టలు, దట్టమైన అడవి మధ్య గ్రామం వాస్తపూర్. బాహ్య ప్రపంచానికి దూరంగా మామడ మండలంలోని తాండ్ర గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఈ గ్రామ జనం.. ముప్పై ఏళ్లుగా మద్యమాంసాలకు దూరంగా ఉంటున్నారు. 450 మంది మాత్రమే ఉన్న ఈ గ్రామస్తులు మద్యం, మాంసాలను ఎప్పుడూ ముట్టకూడదని తమకు తాముగా ప్రతిజ్ఞ చేసుకున్నారు. ఇక ఈ గ్రామంలో ప్రతి ఇల్లూ ఒక దేవాలయమే. అడవిలో ఉన్నా తమ ఇళ్లలో పేడతో అలికి, ముగ్గులు వేసుకుంటారు. ప్రతి శనివారం ఊరంతా కలసి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో సామూహికంగా భజన నిర్వహిస్తారు. గ్రామంలోకి ఎవరు వచ్చినా.. మర్యాదగా స్వాగతిస్తారు. చేలలో విత్తనాలు చల్లే సమయంలో, శివరాత్రి సమయంలో దీక్షలు చేపట్టి.. కఠిన నియమాలను అనుసరిస్తుంటారు. ఇక వాస్తపూర్‌కున్న మరో ప్రత్యేకత ఏమిటంటే... ఏ ఎన్నికలు వచ్చినా నిర్మల్ నియోజకవర్గ నాయకులు ఈ కుగ్రామం నుంచే ప్రచారం ప్రారంభించడం ఆనవాయితీ కావడం గమనార్హం.

ఏళ్లుగా పాటిస్తున్నాం



"మాది అడవిలో ఉండే ఊరైనా ముప్పై ఏళ్లుగా మద్యమాంసాలకు దూరంగా ఉంటున్నాం. ప్రకృతి ఒడిలో ఉండే తమ గ్రామంలో ఏ పండుగ వచ్చినా ప్రతి కుటుంబం పాలు పంచుకుంటుంది. ఉదయం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో సామూహిక పూజలు చేశాక రోజూ పనులు ప్రారంభిస్తాం.."
– గంగారాం పటేల్, వాస్తపూర్

పుట్టిన్నుంచి మందు చూడలె..



"నాకిప్పుడు తొంభయ్యేళ్లపైన ఉంటయ్. నేను పుట్టినప్పటి నుంచి మద్యం చూడలె. పాంగ్రాలో తరాల కిందనే మందు బంజేసిండ్రు. ఇప్పటికీ మా కొడుకులు, మనుమలు కూడా దూరంగనే ఉంటున్నరు. అదే మా ఊరికి మంచి పేరు తెస్తున్నది.."
– కెర్భా పటేల్, పాంగ్రా

మూడు తరాల నుంచి పచ్చగా..

నిర్మల్ జిల్లా భైంసా పట్టణం నుంచి కుభీర్ వెళ్లే మార్గంలోని చిన్న గ్రామం పాంగ్రా. ఇక్కడ దాదాపుగా మూడు తరాల నుంచి మద్యం, మాంసం వినియోగం బంద్. ఇప్పటి యువత సైతం మద్యపానానికి దూరంగా ఉండటం విశేషం. గ్రామంలో ఉన్నా, చదువుకునేందుకు పట్టణాలకు వెళ్లినా వారు ఊరి పద్ధతిని వీడడం లేదు. వేరే గ్రామం నుంచి వచ్చిన కోడళ్లు, అల్లుళ్లు ఈ 'మర్యాద'ను పాటిస్తుంటారు. "మా తాత చెప్తుండె.. మన ఊళ్లో జమానా నుంచి మందు తాగుడు, మాంసం తినుడు లేదురా అని.. ఇట్ల మూడు పిడిల (తరాల) కెళ్లి మా ఊళ్లె తాగుడు తినుడు ముచ్చట్నే లేదు.." అని పాంగ్రా గ్రామ మాజీ సర్పంచ్ దిగంబర్ పటేల్ తమ ఊరి గొప్పదనాన్ని వివరించారు.

కుభీర్ మండలంలోని పాంగ్రా గ్రామం



ఎటు చూసినా పచ్చగా..

పత్తి, మొక్కజొన్న, శనగ, గోధుమ పంటలతో ఈ గ్రామం ఎటు చూసినా పచ్చగా కళకళలాడుతుంటుంది. గ్రామంలో వివిధ కులాల వాళ్లున్నా అందరూ ఒక్కటిగానే ఉంటారు. ఈ ఊరికున్న ప్రత్యేకత 'ఏకముఖి దత్తాత్రేయుడు'గా పిలుచుకునే ఆలయం. గ్రామశివారులో నిర్మించిన ఈ దత్తాత్రేయ ఆలయమే పాంగ్రాను కలిసికట్టుగా నడిపిస్తోంది, వ్యసనాలకు దూరంగా ఉంచుతోంది. దత్తాత్రేయ బోధనలను పాటించే గురువు 'మహానుభావు' మార్గాన్ని ఈ గ్రామ ప్రజలు అనుసరిస్తున్నారు. మద్యమాంసాలకు దూరంగా ఉంటూ కలసికట్టుగా జీవించడమే తమ మహానుభావు మతమని వారు చెబుతుంటారు. గ్రామంలో దసరా నవరాత్రులు, దత్తపౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు.

బాకోట్, సౌనా గ్రామాల్లోనూ..

పాంగ్రా గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామాలైన బాకోట్, సౌనా గ్రామాలు సైతం ఈ ఆదర్శాన్ని అందిపుచ్చుకున్నాయి. ఎంత పెద్ద పండుగైనా, ఏ వేడుకైనా సరే ఈ గ్రామాల్లోనూ మద్యమాంసాలను ముట్టుకోరు. అసలు ఇప్పటిదాకా తమ పంచాయతీ పరిధిలోని పాంగ్రా, బాకోట్, సౌనా ఊళ్లల్లో వాటి ముచ్చటే రాలేదని గ్రామ సర్పంచ్ ముక్తాబాయి చెబుతున్నారు. ఏదైనా కార్యం ఉంటే లడ్డూ, బూందీ వంటి తీపి పదార్థాలతోనే వేడుకలను నిర్వహించుకుంటామని అంటున్నారు. మద్యం లేనందునే తమ గ్రామాల్లో గొడవలు లేవని, ఇప్పటిదాకా పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన దాఖలాలు లేవని చెబుతున్నారు.

మేం అదృష్టవంతులం..



"మా పాంగ్రా గ్రామపంచాయతీలోని బాకోట్, పాంగ్రా, సౌనా ఈ మూడు ఊళ్లు మద్యం, మాంసానికి దూరంగా ఉంటాయి. ఇలాంటి గ్రామాల్లో పుట్టడం అదృష్టంగా భావిస్తున్నాం. మద్యానికి దూరంగా ఉండటం వల్లే ఇప్పటిదాకా గొడవలు, కేసులేవీ లేవు.."
– ముక్తాబాయి, సర్పంచ్, కుభీర్ మండలం సౌనా

యువకులు, మహిళలు ముందుకువచ్చి..



"ఒకప్పుడు మా ఝరి (బి) గ్రామం మద్యం కారణంగా ఇబ్బందులు పడింది. పరిస్థితి గొడవలు, హత్యల వరకూ వెళ్లింది. యువత, మహిళలు ముందుకువచ్చి పట్టుబట్టడంతో మద్యానికి దూరమైంది.."
– ఆనంద్, నచికేత యూత్, ఝరి(బి) గ్రామం

ఈ గ్రామాలు.. ఆదర్శ 'ఝరులు'

ఆ గ్రామాలు కొన్నేళ్ల కిందటిదాకా మద్యపానం కారణంగా సమస్యలు అనుభవించాయి. నిత్యం తిట్టుకోవడాలు, కొట్టుకోవడాలే కాదు.. హత్యల దాకా వెళ్లాయి. కానీ ఇప్పుడా గ్రామాలు ఆదర్శ ఝరులుగా నిలుస్తున్నాయి. ఆ గ్రామాలే నిర్మల్ జిల్లా తానూరు మండలంలోని ఝరి(బి), హిప్నెల్లి తండాలు. స్థానిక యువకులు, డ్వాక్రా మహిళలు ముందుకు వచ్చి తమ గ్రామాల దుస్థితి మార్చేశారు. ఝరి(బి) గ్రామంలో నాలుగేళ్ల క్రితమే ఊరంతా కలసి మద్యపానాన్ని నిషేధించుకున్నారు. మహారాష్ట్ర నుంచి ఆ గ్రామానికి వచ్చిన శేష్‌రావ్ మహరాజ్ ఉపదేశంతో తండా వారంతా మందు ముట్టబోమని ప్రతిజ్ఞ చేశారు. ఇక ఈ ఊరు ఆదర్శవంతమైన సామూహిక వివాహాలకూ వేదికగా నిలిచింది. ఆర్భాటాల కోసం అనవసర ఖర్చులు చేయకుండా ఉండడంతోపాటు, సమష్టి తత్వాన్ని చాటేందుకు గ్రామ ప్రజలంతా కలసి తమ పిల్లలకు సామూహిక వివాహ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇదే తానూరు మండలంలోని హిప్నెల్లి తండా సైతం మద్యాన్ని తరిమికొట్టింది. రెండేళ్ల క్రితం వరకు మద్యపానం కారణంగా ఆత్మహత్య చేసుకున్న రైతులు కూడా ఈ తండాలో ఉండేవారు. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. బంజారాల ఆరాధ్య గురువైన సేవాలాల్ మహరాజ్ సందేశాలతో.. ఈ చిన్న గ్రామం ఎంతో మార్పు తెచ్చుకుంది. గ్రామాభివృద్ధి కోసం ఏ నిర్ణయమైనా సమష్టిగా తీసుకుంటూ ముందుకు సాగుతోంది.




కుభీర్ మండలం జామ్‌గావ్‌లో నిర్మించుకున్న అమృతాలయం

అమృత నిలయం.. జామ్‌గావ్

కుభీర్ మండల కేంద్రం నుంచి కొండలు, గుట్టలు దాటుకుని వెళ్తే మహారాష్ట్ర సరిహద్దులో ఉంటుంది జామ్‌గావ్. ఇక్కడ మద్యమనే మాటే లేదు.. మాంసం వినియోగం తెలియని ఇళ్లు ఉన్నాయి. ముప్పై ఏళ్ల కిందే ఈ గ్రామం భక్తిని తమ మార్గంగా ఎంచుకుంది. ముంబైలో పాండురంగ అథావలే ప్రారంభించిన స్వాధ్యాయ పంథాను జామ్‌గావ్ అందిపుచ్చుకుంది. ఉమ్మడి ఏపీలోనే తొలిసారిగా 1996లో స్వాధ్యాయ ఆధ్వర్యంలో ఈ గ్రామంలో అమృతాలయం నిర్మించడం గమనార్హం. దీనిని కేంద్రంగా చేసుకుని.. ఆ ఊళ్లో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు. నలభయ్యేళ్ల కిందటే ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవడం గమనార్హం. గ్రామస్తులంతా ఉపాధి పథకంలో కలసి పనిచేసి, వచ్చిన డబ్బులతో హనుమాన్ ఆలయాన్ని నిర్మించుకున్నారు. పండుగలప్పుడు ఒకరింటికి మరొకరు వెళ్లి జరుపుకోవడం, మంచిని ప్రచారం చేయడం, ఏడాదికోసారి ఊరంతా కలసి ఒక చేనులో పంట పండించి ప్రత్యేక రోజుల్లో వినియోగించడం వంటివి జామ్‌గావ్ మరిన్ని ప్రత్యేకతలు.

అందరం కలిసుంటాం..



"మా జామ్‌గావ్‌లో ఎలాంటి భేదభావాలు లేవు. అందరం ఒకటేనన్న భావనతో కలసి ఉంటాం. మద్యమాంసాల ముచ్చటే లేదు. రాజకీయం, ప్రచారం, హంగూ ఆర్భాటం లేకుండా భక్తి మార్గంలోనే నడుస్తాం. ఏళ్లుగా ఇలాగే కలసి ఉంటున్నం.."
– పెద్దకాపు చిన్నన్న, జామ్‌గావ్



తానూరు మండలం ఝరి(బి)లో సామూహిక వివాహాలు (ఫైల్)



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆరెకటిక పోరాట సమితి ప్రతినిధులు

ఫిబ్రవరి 8న శంఖారావం

ఆరెకటిక పోరాట సమితి

హైదరాబాద్: ఐదు లక్షల మందితో ఫిబ్రవరి 8న శంఖారావం, మహార్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆరెకటిక పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గోగికార్ సుధాకర్ తెలిపారు. శనివారం ఇక్కడ శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ కుల జనాభాను తక్కువ చేసి చూస్తోందని సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆరెకటికలు 70 వేల కుటుంబాలు, 12 లక్షల మంది జనాభా ఉన్నారని తెలిపారు. ఆరెకటిక కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని, రూ. 500 కోట్లతో ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శంఖారావం సభకు రాష్ట్రంలోని 31 జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఆరెకటికలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు అనిల్, కార్యదర్శి గురుచరణ్, సుమిత్రాబాయి, గీతాబాయి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి పలువురు ఖమ్మం నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు టీఆర్‌ఎస్, టీడీపీ నేతలు శనివారం ఢిల్లీలో రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీ రేణుకా చౌదరి ఆధ్వర్యంలో టీఆర్‌ఎస్ నేతలు మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ బి.దేవులానాయక్, పొంతంగి వెంకటేశ్వర్లు, రవిచంద్ర, టీడీపీ నేతలు వెల్లంకి వెంకటేశ్వరరావు, రామ్‌దాస్ నాయక్‌లు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాహుల్ వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణలో అధికార పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరడంపై రాహుల్ హర్షం వ్యక్తం చేసినట్టు నేతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషిచేసి వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా పనిచేయాలని రాహుల్ సూచించినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ కుంతియా, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పి.మంజుల తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రతీక.. కనబడదా ఇక..!

గొంగడికి గడ్డు కాలం

- తగ్గిపోతున్న దక్కన్ ప్రాంత రక్షణ కవచం గొంగడి
- నల్ల గొర్రెలు కనుమరుగవడంతో ఉనికి ప్రశ్నార్థకం
- ఉలెన్ బ్లాంకెట్లు, ప్రజల అలవాట్లలో మార్పులూ..
- గొంగళ్ల తయారీలో మిగిలినవి 20 కుటుంబాలే
- నారాయణ్‌ఖేడ్ ప్రాంతంలోనే నేత గొంగళ్లు



సాక్షి, హైదరాబాద్: గొంగడి.. తెలంగాణ సాహిత్య, సామాజిక, సాంస్కృతిక జీవనానికి ప్రతీక.. దక్కన్ ప్రాంత రక్షణ కవచం.. వందల ఏళ్లుగా తెలంగాణ జనజీవనంలో భాగమైన ఈ గొంగడి ఇప్పుడు మాయమైపోతున్నదా.. చలిలో వెచ్చదనం, మండుటెండలో చల్లదనాన్ని ఇచ్చే గొంగడి కనుమరుగు కానుందా.. ఉలెన్ దుప్పట్లు, బ్లాంకెట్లు, ప్రజల అలవాట్లలో మార్పులు గొంగడి ఉనికిని ప్రశ్నార్థకం చేశాయి. నల్లజాతి గొర్రెలతోపాటే గొంగడి కూడా క్రమంగా అంతరించిపోతోంది. అనేక సంవత్సరాలుగా గొంగళ్ల తయారీని నమ్ముకొని బతికిన కుటుంబాలు ఆ వృత్తికి దూరమయ్యాయి. ప్రస్తుతం మెదక్ జిల్లా నారాయణ్‌ఖేడ్‌లో 20 కుటుంబాలే నేత గొంగళ్లను తయారు చేసి విక్రయిస్తున్నాయి. ఈ కుటుంబాల్లోనూ పెద్దవాళ్లు తప్ప ఈతరం యువతీయువకులు వృత్తికి పూర్తిగా దూరమయ్యారు. కనుమరుగవుతున్న గొంగడిని కాపాడుకొనే లక్ష్యంతో దక్కన్ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం, ఆహార సార్వభౌమత్వ సంఘటనలు సంయుక్తంగా గొంగడి పరిరక్షణ ఉద్యమం చేపట్టాయి. శనివారం బేగంపేటలోని 'దారం'వస్త్ర షోరూమ్‌లో గొంగళ్ల ప్రదర్శనను ఏర్పాటు చేశాయి. ఈ నేపథ్యంలో 'సాక్షి'ప్రత్యేక కథనం..

నల్ల గొర్రెలు ఎక్కడ..?

గొర్రెల నుంచి బొచ్చు సేకరించి శుద్ధి చేసి దారంలా రూపొందించి మగ్గంపై నేయడానికి కనీసం 25 రోజులు పడుతుంది. ఒక గొంగడి తయారు చేయడానికి ఏడాది వయసు దాటిన గొర్రెలు కనీసం 25 అవసరమవుతాయి. వాటి నుంచి మాత్రమే 2 అంచుల పొడవున్న గొర్రె బొచ్చు లభిస్తుంది. గొర్రె వయస్సు పెరిగే కొద్దీ వెంట్రుకల పొడవు తగ్గి గొంగళ్ల తయారీకి పనికి రాకుండా పోతుంది. అయితే గత 20 ఏళ్లలో గొంగళ్ల తయారీకి ప్రధాన వనరైన నల్ల గొర్రెల సంఖ్య భారీగా పడిపోయింది. ఒకప్పుడు తెలంగాణలో లక్షలాది నల్ల గొర్రెలు ఉండగా.. ఇప్పుడు కేవలం 11 జిల్లాల్లో 10 వేలపైచిలుకే ఉన్నాయి. నల్ల గొర్రెల సంఖ్య తగ్గడంతో బొచ్చు సేకరణ సవాలుగా మారింది.

ఇప్పుడు మెదక్‌లోనే..

దక్కన్ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం అధ్యయనం ప్రకారం ప్రస్తుతం గొంగళ్ల తయారీ మెదక్‌లో తప్ప మరెక్కడాలేదు. గతంలో నారాయణ్‌ఖేడ్ పరిసరాల్లోని ప్రతి ఊళ్లో కనీసం రెండు, మూడు కుటుంబాలు గొంగళ్లను తయారు చేసేవి. సామాజికంగా గొల్ల, కురుమలే కాకుండా అనేక మంది గొంగళ్లను వినియోగించేవారు. దీంతో ఈ వృత్తికి ఆదరణ లభించింది. అయితే నల్ల గొర్రెల సంఖ్య తగ్గడంతో ఒకప్పుడు గొంగళ్ల నేయడమే వృత్తిగా బతికిన వందలాది కుటుంబాలు క్రమంగా ఆ వృత్తి నుంచి దూరమయ్యాయి. ఇప్పుడు నారాయణ్‌ఖేడ్, శివ్వంపేట, బిజిలీపూర్ ప్రాంతాల్లో 20 కుటుంబాలే మిగిలాయి.

గొంగడి అ'ధర'హో..

నల్లటి నేత గొంగడి ఆరోగ్య ప్రదాయిని. ఎన్ని రకాల దుస్తులు, సదుపాయాలు అందుబాటులోఉన్నా కాలానికి తగినట్లు సేవలందించేది ఒక్క గొంగడి మాత్రమే. అందుకే తెలంగాణ జీవితంలో, సంస్కృతిలో, ఆటపాటల్లో భాగమైంది. గోచి, గొంగడి తెలంగాణ కళారూపాలయ్యాయి. ఇంతటి ఘన చరిత్ర ఉన్న గొంగడి ఇప్పుడు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో ధరలూ కాస్త ఎక్కువే ఉన్నాయి. హైదరాబాద్ బేగంపేటలోని 'దారం'షోరూమ్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఒక్కో గొంగడి రూ.6000 నుంచి రూ.9,000 వరకు లభిస్తోంది. ఆదివారం కూడా ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు గొంగళ్ల ప్రదర్శన ఉంటుంది. ఒక్కసారి గొంగడి కొంటే 10–20 ఏళ్ల వరకు మన్నికైన సేవలందిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

ఈ వృత్తి మాతోనే పోయేటట్టున్నది..

'ఇప్పుడు గొర్రె బొచ్చు దొరుకుతలేదు. కత్తిరించి తెచ్చేవాళ్లూ లేరు. మాతోనే ఈ వృత్తి పోయేటట్టున్నది. మహా అయితే ఇంకో నాలుగైదేండ్లు మాత్రమే పని చేస్తాం కావచ్చు. మా పిల్లలకైతే ఈ పని రానే రాదు."
– గుండా యాదమ్మ, గొట్టిముక్కల, శివ్వంపేట మండలం

నేటి తరానికి పరిచయం అవసరం

మా ఇంట్లో ఇప్పటికీ గొంగడి వినియోగిస్తాం. ప్రత్యేకంగా నా కోసం ఓ గొంగడి కొనుక్కోవాలనే నాన్నతో కలసి వచ్చా. నేటి తరానికి గొంగడి గొప్పతనాన్ని పరిచయం చేయాల్సిన అవసరం ఉంది. – వర్ష శేష్, సైనిక్‌పురి

నల్లగొర్రెలు కావాలి

ఎర్ర గొర్రెలు కాకుండా నల్ల గొర్రెలను ఉత్పత్తి చేసి పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. అంతరించిపోతున్న గొంగడి తయారీని కాపాడాలి. హైదరాబాద్‌లో ఇప్పటికి ఏడుసార్లు, బెంగళూర్, ఢిల్లీల్లో రెండుసార్లు ప్రదర్శనలు ఏర్పాటు చేశాం. జనం ఆదరిస్తున్నారు. కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడు కావలసిందల్లా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం.
– యాదగిరి, గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం ప్రధాన కార్యదర్శి

సాక్షి
ఆంధ్రప్రదేశ్
హైదరాబాద్
ఆదివారం | జనవరి | 7 | 2018
www.sakshi.com
12

ప్రపంచంలో మొదటి కైట్స్ మ్యూజియాన్ని జపాన్‌లోని ఒసాకాలో ఏర్పాటు చేయగా.. రెండోది దేశంలోని అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేశారు.





ఇదర్ దేఖో.. మోదీ సాబ్!




శనివారం ఉదయం హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతం. చాలా నిర్మలంగా ఉన్న ఆ ప్రాంతంలో ఒక్కసారిగా హడావుడి మొదలైంది. జనమంతా చార్మినార్ వైపు ఆసక్తిగా చూశారు. అయితే చార్మినార్ వైపు కాదు. అక్కడికొచ్చిన 'మోదీ'ని చూసేందుకు. అదేంటి ప్రధాని నరేంద్ర మోదీ వస్తే కనీసం ఏ హంగూ ఆర్భాటం లేదేంటి అనుకుంటున్నారా..? కనీసం ముందు రోజు చిన్న వార్త కూడా లేదేంటి అని ఆశ్చర్యపోతున్నారా.. అసలు విషయం ఏంటంటే.. అక్కడికి వచ్చింది ప్రధాని మోదీ కాదు.. అచ్చు మోదీని పోలిన 59 ఏళ్ల సదానంద్ నాయక్. కర్ణాటకలోని ఉడిపి జిల్లా హిరియాడ్క గ్రామానికి చెందిన సదానంద్ జూనియర్ మోదీగా బాగా ఫేమస్. ఉడిపి జిల్లాలోని కస్తూర్బా మెడికల్ కాలేజీలో వంట మనిషిగా పనిచేస్తూ గతేడాది నవంబర్‌లో పదవీ విరమణ పొందాడు. అనుకోకుండా గడ్డం పెంచడంతో తోటి ఉద్యోగులు, మిత్రులు మోదీలాగా ఉన్నావని చెప్పడంతో.. వేషధారణ కూడా అలాగే చేసుకోవడం ప్రారంభించినట్లు చెప్పాడు. పేదరికం కారణంగా 5వ తరగతి వరకే చదువుకుని 12 ఏళ్ల వయసులో ఓ హోటల్‌లో పనికి కుదిరానని పేర్కొన్నాడు. నరేంద్ర మోదీ అంటే తనకు చాలా ఇష్టమని, ఇటీవల జరిగిన గుజరాత్ ఎన్నికల్లో కూడా బీజేపీ తరఫున ప్రచారం నిర్వహించినట్లు చెప్పాడు. -చార్మినార్

అజ్ఞాతవాసి!



పొద్దున లేవగానే ఫేస్‌బుక్‌లోనో.. వాట్సాప్‌లోనో, ట్వీటర్‌లోనో మన ఫొటోలు షేర్ చేస్తుంటాం. వాటికి లైక్స్.. కామెంట్లు.. షేర్లు ఎన్ని వచ్చాయో తరచూ చెక్ చేసుకునే వాళ్లూ ఉంటారు. అయితే ఇందుకు భిన్నంగా ఓ వ్యక్తి గత 25 ఏళ్ల నుంచి తనెవరో తెలియకుండా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాడు. ఆఖరికి గూగుల్ కంపెనీ కూడా అతడి ఫొటోల కోసం వెతికినా ఒక్కటంటే ఒక్కటి కూడా దొరకలేదు. అతడి పేరు జొనాథన్ హిర్షన్. పబ్లిక్ రిలేషన్స్ అధికారి. హిర్షన్ సోషల్ మీడియాలో ఎప్పుడూ



చాలా యాక్టివ్‌గా ఉంటాడట. అతడి ఫేస్‌బుక్‌లో దాదాపుగా 3వేల మంది ఫ్రెండ్స్ ఉన్నారు. అంతేకాదు.. ఎప్పటికప్పుడు తను ఏం చేస్తున్నాడో వ్యక్తిగత వివరాలను కూడా అప్‌డేట్ చేస్తుంటాడు. అయితే కేవలం అతడి ముఖాన్ని మాత్రం ఎవరికీ తెలియకుండా దాచేసుకున్నాడు. ఫొటోలు కూడా ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తుంటాడు కానీ ముఖంపై వేరు వేరు బొమ్మలను ఎడిట్ చేసి అప్‌లోడ్ చేస్తాడు. మరి ఎప్పటికి మనోడు అజ్ఞాతవాసం వీడుతాడో వేచిచూడాల్సిందే..!

లోకేష్ సీఎం కావాలనే క్షుద్రపూజలు: అంబటి



సాక్షి, హైదరాబాద్: నారా లోకేశ్‌కు వెంటనే ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టడం కోసమే ఆయన తల్లి భువనేశ్వరి రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో క్షుద్రపూజలు జరిపించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు పేర్కొన్నారు. లోకేశ్ కోసం చంద్రబాబు కుటుంబం దేవాలయాల్లో తాంత్రిక పూజలు చేసినట్లు లోకమంతా కోడైకూస్తోందన్నారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డిసెంబర్ 26వ తేదీన విజయవాడ దుర్గగుడిలో, డిసెంబర్ 18వ తేదీన శ్రీకాళహస్తి కాలభైరవ ఆలయంలో మద్యం సమర్పించి జంతువులను బలిచేసి తాంత్రిక పూజలు నిర్వహించినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. తాంత్రిక పూజలపై నిజనిర్ధారణ కమిటీ వల్ల ఉపయోగం లేదని, ఆ నివేదిక ప్రభుత్వానికే అనుకూలంగా ఉంటుందన్నారు.

బీడీ కార్మికుల జీవితాల్లో వెలుగు నింపుతాం

ముఖాముఖిలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా

- కార్మికుల వాటా మేరకు ప్రభుత్వం కూడా పీఎఫ్ సొమ్ము జమ
- గిట్టుబాటు కూలి లభించేలా చర్యలు.. ఆరోగ్యశ్రీతో అండగా నిలుస్తాం
- మనందరి ప్రభుత్వం రాగానే అన్ని విధాలా ఆదుకుంటామని హామీ

సాక్షి ప్రతినిధి, తిరుపతి : గిట్టుబాటు కూలి లభించేలా చూడటంతో పాటు ఆరోగ్యశ్రీ పథకాన్ని పక్కాగా అమలు పరిచి బీడీ కార్మికులకు అండగా నిలబడతామని ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా 54వ రోజు శనివారం మధ్యాహ్నం ఆయన చిత్తూరు జిల్లా కల్లూరు శివారులోని చల్లావారిపాలెం వద్ద మహిళా బీడీ కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ ప్రాంతంలో 30 వేల కుటుంబాలకు బీడీలు చుట్టే పనే జీవనాధారమని, మదనపల్లి ప్రాంతానికి చెందిన బీడీ కంపెనీల వారు ఆకు తెచ్చి ఇస్తే బీడీలు చుట్టి ఇస్తామని మహిళలు జగన్‌కు వివరించారు. 'కిలో ఆకుకు 2 వేల బీడీలు వస్తాయి. ఇంట్లో నలుగురు పని చేస్తే రోజుకు వెయ్యి బీడీలు చుట్టొచ్చు. వెయ్యి బీడీలకు కంపెనీ వారు రూ.150 ఇస్తారు. ఈ విధంగా నెలకు రూ.4500 నుంచి రూ.5 వేల వరకు వస్తుంది. వారానికోసారి తమ జీతంలోంచి రూ.200 చొప్పున.. నెలకు రూ.800 పీఎఫ్ కట్ చేసి, దానికి కంపెనీ వారు మరో రూ.800 కలుపుతున్నారు. అయితే ఇంట్లో నలుగురు బీడీలు చుట్టినా పీఎఫ్ మాత్రం ఒకరికే కట్ చేస్తున్నారు. మన ప్రభుత్వం వచ్చాక.. మా పీఎఫ్ వాటాకు సమానంగా కంపెనీ కలుపుతున్న నగదుతో పాటు, ప్రభుత్వం కూడా రూ.800 కలిపేలా చర్యలు తీసుకోవాల'ని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. దేవుడి దయ, మీ అందరి ఆశీస్సులతో మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అలాగే చేద్దామన్నారు. గిట్టుబాటు కూలి లభించేలా చర్యలు తీసుకుంటామని, వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తింప చేస్తామని, అందరికీ అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. మనందరి ప్రభుత్వం రావాలని మీరంతా 'దువా'చేయాలని జగన్ కోరగా.. 'మీరు మా పెద్దన్నయ్య.. మేమంతా మీ వెంటే ఉంటాం..'అని కార్మికులు అన్నారు.



చిత్తూరు జిల్లా కల్లూరు శివారులోని చల్లావారిపాలెం బీడీ కార్మికులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న వైఎస్ జగన్

నేటి నుంచి ఇండిగో విమాన సర్వీసులు

రేణిగుంట నుంచి బెంగళూరు, హైదరాబాద్‌కు..



రేణిగుంట: ఇండిగో విమాన సర్వీసు సంస్థ తిరుపతి విమానాశ్రయం నుంచి తమ సర్వీసులను ఆదివారం ప్రారంభించనుంది. రోజూ మూడు సర్వీసులు హైదరాబాద్‌కు, రెండు సర్వీసులు బెంగళూరుకు నడపనున్నారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి అశోక్‌గజపతిరాజు ఉదయం 9 గంటలకు ఈ సర్వీసులను ప్రారంభిస్తారు. ఇండిగో సంస్థ ప్రెసిడెంట్ ఆదిత్యఘోష్, ఎంపీలు వెలగపల్లి వరప్రసాదరావు, శివప్రసాద్ హాజరుకానున్నారు. ఇప్పటి వరకు రేణిగుంట విమానాశ్రయం నుంచి కేవలం హైదరాబాద్, విజయవాడలకు మాత్రమే విమాన సర్వీసులు నడుస్తున్నాయి. ఎయిరిండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్, స్పైస్‌జెట్, ట్రూజెట్ కంపెనీలు మాత్రమే తమ సర్వీసులు కొనసాగిస్తున్నాయి.


నేడు రాష్ట్రవ్యాప్తంగా 5కే రన్

జన్మభూమి సభలో సీఎం చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్రంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉన్నారో లేదో పరుగెత్తి పరీక్షించుకోవాలని, అందుకోసం జన్మభూమిలో భాగంగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో 5కే రన్ నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. దీనిలో అందరూ పాల్గొని పరుగెత్తాలని సూచించారు. 5 కిలోమీటర్లు సునాయాసంగా పరుగెత్తితే ఆరోగ్య సమస్యలు లేనట్లని, పరుగు తీయకపోతే ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు భావించాలని తెలిపారు. దీనిలో జర్నలిస్టులు ఏమీ మినహాయింపు కాదన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోడూరుపాడు గ్రామంలో శనివారం జరిగిన జన్మభూమి–మా ఊరు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... గడిచిన మూడున్నరేళ్లలో అనేక రకాలుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని శ్మశానాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తామన్నారు.

దుర్గ గుడి ఈవోపై బదిలీ వేటు

విజయవాడలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి (ఈవో) సూర్యకుమారిపై రాష్ట్ర



ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఇన్‌చార్జి ఈవోగా దేవాదాయ శాఖ కమిషనర్ అనూరాధను నియమిస్తున్నట్లు పేర్కొంది. డిసెంబరు 26వ తేదీన గుడిలో తాంత్రిక పూజలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు, ఆ శాఖ కమిషనర్ అనూరాధ, విజయవాడ నగర పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్ శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ రఘునాథ్ నేతృత్వంలోని నిజనిర్ధారణ కమిటీ గుర్తించిన అంశాలతో ముఖ్యమంత్రికి నివేదికను అందజేశారు. దుర్గ గుడిలో తాంత్రిక పూజల వ్యవహారంపై చర్చించారు. అనంతరం మంత్రి మాణిక్యాలరావు మీడియాతో మాట్లాడారు. ఈవోను తప్పించి, తాంత్రిక పూజల ఆరోపణలపై విచారణ కొనసాగించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు. పరిపాలన పరమైన లోపాల కారణంగానే ఈవో తప్పించామని. తాంత్రిక పూజలు జరగలేదని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు.

ముస్లింల కోసం ఏం చేయడానికైనా సిద్ధం: జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్రంలో ముస్లింలకు ఎలాంటి సహాయం చేయడానికైనా తాము సిద్ధమని, వారికి అన్ని విషయాల్లో తోడుగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ముస్లిం సోదరులకు ఎంత చేసినా తక్కువే అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా శనివారం 54వ రోజు చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని కల్లూరులో ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 'అస్సలాం.. అలైకుం..'అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన జగన్.. 'కడప ఎమ్మెల్యే అంజాద్ బాష అన్నను మేం నవాబూ.. అంటుంటాం.. మా నాన్న వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చినట్లుగానే బడ్జెట్‌లో 4 శాతం నిధులను కేటాయిస్తూ వారి కోసం ఒక సబ్‌ప్లాన్‌ను తీసుకు రావాలని అంజాద్ అన్న చెప్పారు. ముస్లిం సోదరులకు ఎంత చేసినా తక్కువేనని నేను గట్టిగా చెబుతున్నాను. దేవుడు ఆశీర్వదించి, మీ దీవెనలతో మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సబ్‌ప్లాన్‌ను తీసుకు వస్తాను'అని అన్నారు.

ప్రతి ఏటా ఉద్యోగ నోటిఫికేషన్

పుంగనూరు నియోజకవర్గంలోని కల్లూరు గ్రామంలో శనివారం నిర్వహించిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో పలువురు తమ సమస్యలను జగన్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు కొందరు లేవనెత్తిన అంశాలపై జగన్ స్పందిస్తూ '' దేవుని ఆశీర్వాదంతో ఖచ్చితంగా ఏదో ఒకరోజు రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుంది. అప్పుడు నిజంగా ఉద్యోగాల విప్లవాలు తీసుకురాగలమని గట్టిగా చెప్తున్నా. రాష్ట్రం విడిపోయినప్పుడు అక్షరాలా లక్షా 42 వేల గవర్నమెంట్ ఉద్యోగాలు ఉన్నాయని విభజన రిపోర్టు ఇచ్చారు. అయినా వాటిని భర్తీ చేసేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నించడంలేదు. దేవుని దయ వల్ల, మీ అందరి ఆశీస్సుల వల్ల అధికారంలోకి వచ్చాక ఏటా పరీక్షలు పెట్టి ఉద్యోగాలు ఇస్తామనే హామీని ఇస్తున్నా. అక్షరాలా 15 వేల గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో గ్రామ సెక్రటేరియేట్‌లు తీసుకొచ్చి ప్రతీ గ్రామ సెక్రటేరియేట్‌లో కనీసం పది మంది చొప్పున లక్షా 50 వేల మందికి ఉద్యోగాలిస్తానని హామీ ఇస్తున్నా. ప్రైవేటు సెక్టార్‌లో ఏవైతే జరగాలో అన్నీ చేస్తాం.'' అని జగన్ అన్నారు.

గంటన్నర ఆలస్యంగా దుర్గగుడి మూసివేత



సాక్షి, అమరావతి: ఇంద్రకీలాద్రిపై తాంత్రిక పూజలు జరిగాయని ఆరోపణలు వచ్చిన డిసెంబరు 26వ తేదీన రాత్రి గంటన్నర ఆలస్యంగా దుర్గగుడిని మూసివేసినట్లు నిజనిర్ధారణ కమిటీ తేల్చింది. సాధారణంగా ప్రతిరోజు రాత్రి 10 గంటలకు గుడిని మూసివేస్తారు. డిసెంబర్ 26న మాత్రం రాత్రి 11.30 గంటలకు మూసివేసినట్టు తమ పరిశీలనలో వెల్లడైందని నిజనిర్ధారణ కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. దుర్గగుడిలో తాంత్రిక పూజల వ్యవహారంపై విచారణను పూర్తి చేసిన ఈ కమిటీ సభ్యులు రఘునాథ్, శ్రీరామశర్మ తమ నివేదికను శనివారం ఉదయం దేవాదాయ శాఖ కమిషనర్ అనూరాధకు అందజేశారు. అనంతరం ఈ మొత్తం వ్యవహారంపై ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేసి దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు, కమిషనర్ అనూరాధ, నిజనిర్ధారణ కమిటీ సభ్యులు శనివారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమర్పించారు.

భద్రతాపరమైన లోపమేనట!

ఆగమ శాస్త్ర నిబంధనలకు విరుద్ధంగా డిసెంబర్ 26న రాత్రి ఆలయాన్ని గంటన్నర ఆలస్యంగా ఎందుకు మూసివేయాల్సి వచ్చిందన్న దానిపై అర్చకులు, ఆలయ సిబ్బందిని నిజనిర్ధారణ కమిటీ ప్రశ్నించింది. భద్రతా సిబ్బంది నుంచి వివరాలు సేకరించింది. భద్రతాపరమైన లోపం కారణంగానే ఆలయాన్ని గంటన్నర ఆలస్యంగా మూసివేశారంటూ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో దేవాదాయశాఖ స్పష్టం చేసినట్లు సమాచారం. అంటే భద్రతాపరమైన లోపం అనే చిన్న కారణం చూపి, తాంత్రిక పూజల వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకు దేవాదాయ శాఖ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

రౌండప్

మూత్ర పరీక్షతో టీబీ నిర్ధారణ



- జార్జ్ మాసన్ యూనివర్సిటీ వైద్యుల కొత్త ఆవిష్కరణ
- ఎక్స్‌రే, రక్త పరీక్షల కంటే 100 శాతం ఎక్కువ కచ్చితత్వం
- పరిశోధనా ఫలితాలు 'సైన్స్ ట్రాన్స్‌లేషన్ మెడిసిన్'లో ప్రచురితం
- నూతన విధానం త్వరలో ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి..

సాక్షి, అమరావతి: క్షయ (టీబీ–ట్యూబర్‌క్యులోసిస్) వ్యాధిని నిర్ధారించేందుకు సరికొత్త మార్గాన్ని అభివృద్ధి చేశారు. ఇన్నాళ్లూ ఛాతీని ఎక్స్‌రే తీయడం లేదా రక్తపరీక్ష ద్వారా క్షయను నిర్ధారించేవారు. ఈ విధానాల్లో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యేవి. ఒక్కోసారి రక్తపరీక్షలతో వ్యాధి నిర్ధారణ జరిగేది కాదు. దీనివల్ల రోగులు వ్యాధి తీవ్రంగా నష్టపోయేవారు. ఇప్పుడా పరిస్థితికి చరమగీతం పాడనున్నారు. అమెరికాకు చెందిన జార్జ్ మాసన్ యూనివర్సిటీ వైద్యులు కొత్తగా మూత్ర పరీక్ష ద్వారా టీబీని నిర్ధారించే మార్గాన్ని కనుగొన్నారు. ఎక్స్‌రే, రక్త పరీక్షల కంటే 100 శాతం ఎక్కువ కచ్చితత్వంతో వ్యాధిని నిర్ధారించవచ్చని నిరూపించారు. ఈ వివరాలు సైన్స్ ట్రాన్స్‌లేషన్ మెడిసిన్ అనే జర్నల్‌లో ప్రచురించారు.

25 శాతం కేసులు భారత్‌లోనే...

ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షలాది మంది టీబీ బారినపడి మరణిస్తున్నారు. దీనిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కొత్త నిర్ధారణ విధానం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. కఫం పరీక్ష కూడా టీబీ నిర్ధారణలో కీలక పాత్ర పోషిస్తోంది. అయితే, ఇప్పటిదాకా పాటిస్తున్న విధానాలు చాలా జాప్యంతో కూడుకున్నవి. పైగా పెద్దమొత్తంలో ఖర్చు కావడంతో పేద దేశాల్లో చాలామంది రోగులు టీబీ పరీక్షలు చేయించుకోలేకపోతున్నారని ఆ సంస్థ పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టీబీ కేసుల్లో 25 శాతం కేసులు భారతదేశంలోనే నమోదవుతున్నట్లు సెంటర్ ఫర్ డిసీజ్ డైనమిక్స్, ఎకనామిక్స్ అండ్ పాలసీ(సీడీడీఈపీ) వెల్లడించడం గమనార్హం.

త్వరలోనే అందుబాటులోకి...

టీబీ నిర్ధారణ కోసం రూపొందించిన కొత్త విధానం త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు శాస్త్రవేత్తలు ప్రకటించారు. తాజా పరిశోధనల్లో 'హైడ్రోజెల్ నానో కాజెస్'అనే విధానం ద్వారా మూత్ర పరీక్ష చేసి, దీంతో ట్యూబర్ క్యులోసిస్ బ్యాక్టీరియాను కొనుగొన్నారు. ఈ పరీక్ష ద్వారా బాక్టీరియా తీవ్రతతోపాటు మనిషిలోని ఇమ్యూనిటీ (వ్యాధి నిరోధక శక్తి)ని కూడా అంచనా వేయొచ్చు. దీనికోసం జెన్ ఎక్స్‌పర్ట్ మెషీన్లను ఉపయోగించారు. దాదాపు 8 ఏళ్లపాటు సాగించిన పరిశోధనలు ఫలించాయని, టీబీ నిర్ధారణలో ఇప్పటివరకూ ఉన్న పరీక్షలన్నింటి కంటే అత్యంత కచ్చితమైన ఫలితాలు వచ్చాయని కొత్త ఆవిష్కరణను ప్రచురించిన జర్నల్ ప్రకటించింది. ఇందులో అల్సెంద్రా లూసిని అనే సైంటిస్ట్ కీలక పాత్ర పోషించారు.

రాష్ట్రంలో విజృంభిస్తున్న క్షయ

ఆంధ్రప్రదేశ్‌లో టీబీ కేసులు ఒకరి నుంచి ఒకరికి వేగంగా విస్తరిస్తున్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఒక టీబీ రోగి నుంచి ఏడాదిలో కనీసం 12 మందికి ఈ వ్యాధి వ్యాపిస్తున్నట్టు తేలింది. అదే గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో వ్యాధిగ్రస్తుడి నుంచి నలుగురికి వ్యాపిస్తున్నట్టు వెల్లడైంది. రాష్ట్రంలో ప్రతి లక్ష మంది జనాభాలో 130 మందికి కొత్తగా టీబీ వ్యాధి సోకుతున్నట్టు కుటుంబ సంక్షేమశాఖ అధికారులు గుర్తించారు. మన రాష్ట్రంలో ఏటా దాదాపు 10,000 మంది టీబీ బాధితులు బయటపడుతున్నారు. దేశంలోనే ఎక్కువ మంది హెచ్‌ఐవీ బాధితులు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నారు. హెచ్‌ఐవీ బాధితుల్లో 80 శాతం మందికి టీబీ సోకుతోంది. వైద్యులు సూచించిన మందులు క్రమం తప్పకుండా వాడడం, పోషకాహారం తీసుకోవడం వంటి వాటితో క్షయ రోగం నుంచి విముక్తి పొందవచ్చు.

'అజ్ఞాతవాసి'ప్రత్యేక ప్రదర్శనలకు రాష్ట్ర సర్కారు అనుమతి

సాక్షి, అమరావతి: పవన్ కల్యాణ్ హీరోగా నటించిన అజ్ఞాతవాసి సినిమా ప్రత్యేక ప్రదర్శనలకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం అనుమతి మంజూరు చేసింది. ఈ నెల 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ప్రతిరోజూ రాత్రి 1 గంట నుంచి ఉదయం 10 గంటల వరకు స్పెషల్ షోలకు అనుమతించారు.

గజల్ శ్రీనివాస్‌ను స్వచ్ఛాంధ్ర మిషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా తొలగింపు

గజల్ శ్రీనివాస్‌ను స్వచ్ఛాంధ్ర మిషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017 మే 26న స్వచ్ఛాంధ్ర మిషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా సర్కారు నియమించింది. అయితే ఇటీవల గజల్ శ్రీనివాస్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

హైకోర్టు విభజనకు 3 కమిటీలు

- భవనాల పరిశీలన, ఉద్యోగుల విభజన, రికార్డుల డిజిటలైజేషన్‌లకు కమిటీలు
- ఫిబ్రవరి మొదటి వారంలో భవనాల పరిశీలన కమిటీ ఏపీ పర్యటన!
- నాగార్జున యూనివర్సిటీ, కంచికచర్ల వద్ద భవనాలను గుర్తించిన ఏపీ ప్రభుత్వం?

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి హైకోర్టు విభజనకు సంబంధించి ఇటీవల జరిగిన ఫుల్‌కోర్టు సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు మూడు కమిటీలు ఏర్పాటయ్యాయి. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, అమరావతిలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు భవనాల పరిశీలనకు ఓ కమిటీ, ఉద్యోగుల విభజనకు ఓ కమిటీ, అలాగే రికార్డుల డిజిటలైజేషన్ కోసం మరో కమిటీని ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీలో ఐదుగురికి స్థానం కల్పించారు. హైకోర్టు ఉద్యోగుల విభజన మార్గదర్శకాల రూపకల్పన కమిటీకి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వం వహిస్తారు. ఈ కమిటీలో న్యాయమూర్తులు జస్టిస్ సురేశ్ కెయిత్, జస్టిస్ అడవల్లి రాజశేఖర్‌రెడ్డి, జస్టిస్ అంబటి శంకర నారాయణ, జస్టిస్ షమీమ్ అక్తర్ ఉన్నారు. భవనాల పరిశీలన కమిటీకి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ నేతృత్వం వహిస్తారు. ఈ కమిటీలో జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ తాళ్లూరి సునీల్ చౌదరి, జస్టిస్ మల్లవోలు సత్యనారాయణమూర్తి ఉన్నారు. ఇక రికార్డుల డిజిటలైజేషన్ పర్యవేక్షణ కమిటీకి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి నేతృత్వం వహిస్తారు. ఇందులో జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్, జస్టిస్ పి.నవీన్‌రావు, జస్టిస్ ఎస్.వి.భట్, జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాద్‌రావు ఉన్నారు.

ఏపీకి ఆప్షన్ ఇచ్చిన వారి నుంచే భవనాల పరిశీలన కమిటీ



ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఆప్షన్ ఇచ్చిన న్యాయమూర్తుల నుంచే (జస్టిస్ రామసుబ్రమణియన్ మినహా) కొందరికి భవనాల పరిశీలన కమిటీలో స్థానం కల్పించారు. కాగా, ఫిబ్రవరి మొదటి వారంలో భవనాల పరిశీలన కమిటీ అమరావతికి వెళ్లే అవకాశం ఉన్నట్లు సమాచా రం. ఇప్పటికే నాగార్జున యూనివర్సిటీ లో ఖాళీగా ఉన్న కొన్ని భవనాలను హైకోర్టు కోసం ఏపీ ప్రభుత్వ వర్గాలు గుర్తించినట్లు తెలిసింది. విస్తీర్ణంలో పెద్దవిగా ఉండటంతో పాటు దాదాపు 1,000 కార్లు పట్టేంత పార్కింగ్ స్థలం ఉండడం వల్లే ఈ భవనాలను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. న్యాయమూర్తులకు నివాస ఏర్పాట్ల కోసం నాగార్జున యూనివర్సిటీకి సమీపంలోనే కొన్ని భవనాలను గుర్తించినట్లు సమాచారం. అలాగే కంచికచర్ల వద్ద కూడా ఓ భారీ భవనాన్ని హైకోర్టు ఏర్పాటు కోసం గుర్తించారు. వీటితో పాటు వేరే చోట మరో రెండు భవనాలను కూడా కమిటీ పరిశీలనకు సిద్ధం చేస్తున్నారు.

ఫుల్ కోర్టు ముందుకు భవనాలపై నివేదిక

ఈ భవనాలను పరిశీలించిన తరువాత కమిటీ ఓ నివేదికను సిద్ధం చేస్తుంది. ఆ నివేదికను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులందరితో కూడిన ఫుల్‌కోర్టు ముందుంచుతారు. ఈ సమావేశంలో భవనాల ఎంపిక జరిగిన తరువాత వాటిల్లో మార్పులు, చేర్పులను సూచిస్తారు. ఈ మార్పులను ఏపీ ప్రభుత్వం పూర్తి చేసిన తరువాత భవనాల కమిటీ మరోసారి పరిశీలిస్తుంది. కమిటీ పూర్తిస్థాయిలో సంతృప్తి వ్యక్తం చేస్తే, అప్పటి నుంచి అమరావతికి ఏపీ హైకోర్టు తరలింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ లోపు ఉద్యోగుల విభజన ప్రక్రియ కూడా కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

సాక్షి పెళ్ళిచూపులు

ఆదివారం 7-1-2018

వధువు కావలెను



బ్రాహ్మిణ్ /35Y/5'8"/ B.Com / Bank Job/ TL/ B'lore/ 9.6 PA/ 2nd Marriage / సొంతిల్లు/ No Kids/ Brahminsకు మాత్రమే. డైరెక్ట్ 09916575168/ 09482505997 (W.App) [H-0606779]

రెడ్డి/డైవర్సీ/33Y/5'10"/B.Tech (ECE) / MS (USA) / SWE/ 120K / 10 Cr ప్రాపర్టీగల వరుడుకి India/ Abroad వధువు కావలెను (కట్నం ముఖ్యం కాదు) 8019864386 [HA-410]

క్రిస్టియన్ మాదిగ/ M.Tech (IIT) / C. Govt. A.E.E. (ONGC) /14 Lakhs PA/ 5'8" ఎత్తు / 29 సంగల వరునికి వధువు కావలెను Ph: 9885055185 [HA-8538]

Reddy / 29/5'10"/MBBS / MS Ortho/ Seeks Bride /MBBS /PG/ Any Suitable. Contact : 9059430595 [HA-8541]

★★

హిందూమాల/ 37y/ 5'3"/ PG ప్రైవేట్ Job 15,000/- PM / సొంతిల్లు/ లేట్ మ్యారేజ్/Hyd వరుడికి డిగ్రీ వధువు 1st/IInd కావాలి. కుల ప్రసక్తి లేదు. డైరెక్ట్ 9949531319 [HA-51524]

మాదిగ /28/5'10"/ B.Tech (EEE) / JE in BSNL /40,000/- PM వెల్ సెటిల్డ్ అయిన వరునికి వధువు కావలెను. 8142220475 [H-684127]

కులపట్టింపులేదు(రెండవ సంబంధం) /35/5'8"/ B.Tech / 1.20 Lks PM వెల్ సెటిల్డ్ అయిన వరునికి వధువు కావలెను. 8142220817 [H-684127]

బ్రాహ్మణ/ఎరువు/35/5'8"/ వెల్ సెటిల్డ్ వంటరి వరునికి ఆదర్శ భావములు కలిగిన వధువు కావలెను సంప్ర: 9121866324 [H-684505]

డైరెక్ట్/కుల ప్రసక్తి లేదు /28/H: 5.'6 Q: డిగ్రీ, B.Ed., ఇల్లరికం అయినా, కాకున్నా పల్లెటూరి మధ్యతరగతి వరునికి ఎవరైనా సరే వధువు, మనీ సపోర్టు ఇచ్చువారు కావలెను. ఫోన్ :9966015148. డైరెక్ట్. [C-907183]

బలిజ : 28/ 5.6/ తెలుపు/ BSc/ వ్యాపారం మరియు నెలకు 70వేలు ఇంటి అద్దెలు కలిగిన వరునకు చక్కని వధువు కావలెను. (కట్నం అవసరం లేదు). 9490125320. [N-0900675]

కాపు (కట్న ప్రసక్తి లేదు) 27/ 5'10", B.Tech S/W/E, ORACLE 80,000/- P.M. అందమైన వెల్‌సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. Ph : 80080 55675. [V- 680440]

వరుడు కావలెను



రెడ్డి / లేట్ మ్యారేజ్/29Y/5'4"/ గ్రానైట్ బిజినెస్/ 8 కోట్ల ప్రాపర్టీగల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. 8897900922 [HA-410]

రెడ్డి 24Y' B.Tech', 30 కోట్ల ప్రాపర్టి కల్గి పెళ్లి ఆగిపోయిన అందమైన ఏకైక వధువుకి అర్జెంటుగా వరుడు కావలెను. (ఆస్తి, కుల, వయస్సు ప్రసక్తి లేదు) సంప్ర: 90309 16673. [V- 599982]

ఆంధ్రా/కుల పట్టింపు లేదు (2వ పెళ్ళి) /54/5'4"/ రొయ్యలు ఎక్స్‌పోర్ట్ బిజినెస్/ 50 వేలు PM / సొంత పొలాలు గల వధువుకు వరుడు కావలెను. 7993979542 [HA-410]

చౌదరి/డైవర్సీ/30Y/5'5"/ ఫ్యాషన్ డిజైనర్ / 6 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. 8106499144 [HA-410]

బ్రాహ్మణ/23/5'3"/5th * 21/5'4"/7th * 23/5'4"/10th వధువులకు వరులు కావలెను. పూజారి అయినా OK. Ph: 7674078296, 8106446865 [HA-8538]

వైశ్య/20/5'3"/9th * 22/5'4"/10th * 22/5'4"/ ఇంటర్ వధువులకు వరులు కావలెను. బిజినెస్ అయినా OK. Ph: 7674078296, 8106446865 [HA-8538]

రెడ్డి/విడో/కుల, ధన ప్రసక్తిలేదు 15 కోట్ల ఆస్తి/వయస్సు 32y / ఎత్తు 5'5"/ Qly : PG. వెరీ ఫెయిర్/ నెలకు 6 లక్షల సంపాదన గల అందమైన వధువుకు వరుడు కావలెను Ph: 9515528286 [HA-8538]



రెడ్డి/విడో/కుల పట్టింపులేదు/ 15 కోట్లు ఆస్తి/ 30/5'2"/MBA / నెలకు 4 లక్షల సంపాదన కలిగిన అందమైన వధువుకు వరుడు కావలెను సంప్ర: 9581690158 [H-694965]

రెడ్డి/25/డిగ్రీ/5'5"/Fair / Only Daughter /Hyd లో సెటిల్డ్ / 2 అపార్ట్‌మెంట్స్/ 6 కోట్లు /సాంప్రదాయ వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను 9177630858 [H-695933]

మాల: MBBS, MD (అనస్తీషియా), 5'4", 25Y, Fair, 10Cr ఆస్తి కల్గిన వధువు కొరకు మెడిసిన్ (or) Govt జాబ్స్ వరులు (అర్జంటుగా) సంప్ర:: ✆ 9666113494, 9248537764. [B-365]

మాల, 24, MCA, ఒక్కటే కుమార్తె, 12 కోట్ల ఆస్థి ఉన్న వధువుకి వరుడు కావలెను. కులప్రశక్తి లేదు. 99592 04509 e-mail: harshinimatrimony.112@gmail.com [G-640]

★

Reddy /29/ 5'5"/Wheatish / B.Tech (BITS) / MSc (Bio) / MBA (WHARTON) /SFO / 200K / US ALLIANCES ONLY 8309871404 [H-695667]

★★

ముదిరాజ్/28/5'4"/B.Tech / SWE/ 60000/–PM / 2 Cr ప్రాపర్టీ/ వెల్ సెటిల్డ్ అయిన వధువుకు వరుడు కావలెను. 8142220475 [H-684127]

కులపట్టింపులేదు(రెండవ సంబంధం) /26/5'4"/ MBA / Andhra Bank Asst. Manager/ 50,000/- PM (5 Cr ప్రాపర్టీ) వెల్ సెటిల్డ్ అయిన వధువుకు వరుడు కావలెను. 8142220817 [H-684127]

కాపు/విడో/28/5'5"/MBBS/ Govt. డాక్టర్ / 75,000/- PM / 7 Cr / ఈ మధ్యనే భర్తను కోల్పోయిన వధువుకు కుల/ఆస్తి ప్రసక్తిలేని ఇల్లరికం వరుడు కావలెను Ph: 8142100361 [H-695495]

కాపు/విడో 34/5'5, 10 కోట్ల ఆస్థి గల అందమైన వధువుకి కుల, ధన ప్రసక్తి లేని ఇల్లరికం వరుడు కావలెను. సంప్ర : 70952 23078. [V- 920]

రెడ్డి/39/5'4"/NMDC (Govt Job) / 1 Lac PM / సొంత ఇల్లు/ 6 Cr ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల, ధన ప్రసక్తిలేని వరుడు కావలెను 7288957028 [H-695330]

వేదికలు



కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో: 1వ, 2వ, లేట్ మ్యారేజెస్/ అన్ని కులముల వారికి డైవర్సీస్/ విడోస్/ విడోవర్స్, పెన్షనర్స్‌కు సంబంధములు త్వరగా కుదర్చబడును. (స్త్రీలకు ఫ్రీ రిజి॥) ఫోన్: 7286931144 [H-684124]

www.amityalliances.com ప్రపంచవ్యాప్త, తెలుగు తెలిసిన హిందూ, క్రిస్టియన్, ముస్లిం అభిమాన వివాహ పరిచయ Website సందర్శించండి. రిజిస్ట్రేషను Free. [V- 5438]

క్రిస్టియన్ వివాహ పరిచయ వేదిక. మీ అమ్మాయికి/ అబ్బాయికి సంబంధం కావాలా? డాక్టర్స్, ఇంజనీర్స్, పీజీ, డిగ్రీ సంబంధాలు చాలా కలవు. www.sweethomemarriage.com ఫోన్ : 0891-2739003, 98490 72372. [V- 680442]

Specially Doct (3000 ప్రొఫైల్స్) MBBS, MD, MS, DM, MCH, BDS, MDS & డాక్టర్స్‌కి మాత్రమే. 1వ, 2వ/లేటు దేశ/విదేశీ సంబంధాలు అన్ని కులములకు కుదర్చబడును. 9963632698 [HA-8541]

★

బ్రాహ్మణ వధూ-వరుల వివాహ పరిచయ వేదిక / 11-02-2018న జ్యోతి గార్డెన్స్, ECIL, Hydలో జరుగును. Time : 1 PM to 6 PM *9704656103 /9533608887 [HA-19868]

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహవేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

లక్ష మందికి రాయితీ రుణాలు

- బ్యాంకుతో లింకు లేకుండా ఇవ్వాలని యోచన
- రూ. వెయ్యి కోట్లతో ఎంబీసీ ప్రతిపాదనలు.. వచ్చే వారంలో ప్రభుత్వానికి సమర్పణ



సాక్షి, హైదరాబాద్: అత్యంత వెనుకబడిన కులాల(ఎంబీసీ) కార్పొరేషన్ రాయితీ రుణాల కార్యాచరణను రూపొందిస్తోంది. బ్యాంకుతో లింకు లేకుండా రూ.వెయ్యి కోట్ల తో లక్ష మందికి రాయితీ రుణాలు ఇవ్వాలన్న యోచనలో ఉంది. అత్యంత వెనుకబడిన కులాలకు ఆర్థిక చేయూతనిచ్చి స్వయం ఉపాధిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభు త్వం ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా 2017–18 వార్షిక సంవ త్సరంలో రూ.1,000 కోట్లు కేటాయించింది. అయితే ఎంబీసీలపై స్పష్టత ఇవ్వకపోవ డంతో రుణాల పంపిణీ ప్రక్రియ అప్పట్నుంచీ నిలిచిపోయింది. తాజాగా వార్షిక సంవత్సరం ముగుస్తున్న క్రమంలో కేటాయించిన నిధుల ను వినియోగించుకోవాలని భావిస్తోంది. దీనిలో భాగంగా వెనుకబడ్డ కులవృత్తుల వారు, సంచార జాతులకు రాయితీ రుణాలు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది.

నాలుగు కేటగిరీల్లో లబ్ధి

ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటైన తొలి ఏడాదే ప్రభుత్వం భారీగా కేటాయింపులు జరిపిన నేపథ్యంలో అధికారులు సైతం పెద్ద సంఖ్యలో లబ్ధిదారులకు అవకాశం కల్పించాలని భావి స్తున్నారు. ఈ క్రమంలో రుణ వితరణ 4 కేటగిరీల్లో జరపాలని యోచిస్తున్నారు. రూ. 50 వేల రాయితీ కింద 25 వేల మందికి, రూ. లక్ష చొప్పున 40 వేల మందికి, రూ. రెండు లక్షల చొప్పున 20 వేల మందికి, అదేవిధంగా మిగిలిన వారికి గరిష్టంగా రూ. 5 లక్షల రాయితీ ఇచ్చేలా ప్రాథమిక ప్రణాళిక తయారు చేశారు. దీనికి తుది మెరుగులు దిద్దుతున్న అధికారులు ప్రభుత్వానికి సమర్పించేందుకు చర్యలు చేపట్టారు.

బ్యాంకులతో లింకు లేకుండా...

ప్రస్తుతం కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే రుణాలకు బ్యాంకు లింకు తప్పనిసరి. బ్యాంకులతో ముడిపెట్టడంతో మెజారిటీ లబ్ధిదారులు రుణాలు పొందలేక పోతున్నారనే విమర్శలున్నాయి. బ్యాంక ర్లు సహకరించడం లేదని ఏకంగా ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ సైతం పలు సమావేశాల్లో పెదవి విరిచారు. ఈ క్రమం లో ఎంబీసీ కార్పొరేషన్ రూపొందించే ప్రణాళికలో బ్యాంకులతో సంబంధం లేకుండా రుణాలు ఇవ్వాలనే అంశంపై చర్చిస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సైతం సిద్ధం చేసినట్లు తెలిసింది. పూర్తిస్థాయి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వచ్చే వారంలో ఈ ప్రతిపాదనలు సమర్పిస్తామని.. ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన వెంటనే దరఖాస్తులు స్వీకరిస్తామని అధికారులు చెబుతున్నారు.

18 నుంచి 28 వరకు హైదరాబాద్ బుక్ ఫెయిర్


సాక్షి, హైదరాబాద్: ఈ నెల 18 నుంచి 28 వరకు తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం)లో 31వ జాతీయ హైదరాబాద్ బుక్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ తెలిపారు. శనివారం బుక్‌ఫెయిర్ పోస్టర్‌ను ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, పర్యాటక, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరి మాట్లాడుతూ.. పుస్తక ప్రదర్శన ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ప్రదర్శ నకు 10 లక్షలకు పైగా పుస్తక ప్రియులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ప్రదర్శనలో తొలిసారి సాహిత్య సాంస్కృతిక సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రదర్శనకు దేశంలోని 15 రాష్ట్రాల నుంచి పబ్లిషర్స్ రానున్నారని వివరించారు. కార్యక్రమం లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బుక్ ఫెయిర్ ప్రధాన కార్యదర్శి కోయ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమణాచారి, గౌరీశంకర్

ఆ పరిహారంపై విచారణ చెల్లదు

మల్లన్నసాగర్ కేసులో ఆదేశాలిచ్చిన హైకోర్టు జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: భూసేకరణ సమయంలో రైతుల అభ్యంత రాల్ని తెలుసుకోకుండా పరిహార చెల్లింపుపై విచారణ చేయడం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. సిద్దిపేట జిల్లా వేములఘాట్ గ్రామంలో మల్లన్నసాగర్ ప్రాజెక్టుకు భూమి ని సేకరించే ముందు రైతులు, భూసేకరణ వల్ల ప్రభావితుల అభ్యంతరాల్ని తెలుసుకు న్న తర్వాతే పరిహారంపై విచారణ జరపాల ని ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త భూసేకరణ చట్టం ప్రకారం తమ అభ్యంతరాల్ని పరిగణనలోకి తీసుకోవాలన్న నిబంధనను ఉల్లంఘించి పరిహార చెల్లింపు విచారణ చేయడం చెల్లదంటూ వేముల ఎల్లవ్వ మరో 22 మంది రైతులు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని న్యాయమూర్తి శుక్రవారం విచారించారు. ''భూసేకరణ చట్టంలోని 19(1) ప్రకారం రైతుల అభ్యంతరాలు తెలుసుకోకుండా పరిహార చెల్లింపు విచారణ చెల్లదు. రైతులతోపాటు భూసే కరణ వల్ల ప్రభావితమయ్యే వారి అభ్యంతరాల్ని కూడా స్వీకరించాలి'' అని తెలంగాణ ప్రభుత్వానికి న్యాయమూర్తి తేల్చి చెప్పారు. పిటిషనర్ల భూములే కాకుండా 600 మంది అభ్యంతరాల్ని అధికారులు పరిగణనలోకి తీసుకోకుండా పరిహార చెల్లింపుపై విచారణ జరుపుతున్నారని పిటిషనర్ల న్యాయవాది వాదించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో కొండం, ముంచిప్ప చెరువులను కలుపుతున్న పనుల్లో ఆచితూచి వ్యవహరించాలని ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి అధికారులకు మరో కేసులో ఆదేశాలు జారీ చేశారు. చెరువుల్ని కలపడం వల్ల రైతుల భూములతోపాటు అటవీ ప్రాంతం కూడా ముంపునకు గురవుతుందంటూ ముగుపాల్ మండలం ముంచిప్ప గ్రామస్తులు బానోతు ఈశ్వర్ సింగ్, మరో 60 మంది హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. విచారణ 18కి వాయిదా పడింది.



డైరీ ఆవిష్కరణలో ప్రభాకర్‌రావు, రఘుమారెడ్డి తదితరులు

ఓర్వ లేకే విమర్శలు

- 24 గంటల విద్యుత్ సరఫరా ఘనత ఇంజనీర్లదే
- ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా ఘనత ఆ శాఖ ఇంజనీర్లదేనని..దీన్ని జీర్ణించుకోలేని కొందరు వారి ఆత్మస్థైర్యం దెబ్బతీసే విధంగా మాట్లాడటం సరికాదని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎంతో ప్రాధాన్యతనిస్తోందని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఉచిత విద్యుత్ పథకం అమలవుతోందన్నారు. ఆర్టీసీ కళ్యాణ మండపంలో శనివారం విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ–2018 ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి మద్దతుతో విద్యుత్ రంగాన్ని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. జనరేషన్, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ నష్టాలను తగ్గించామని, ఇది సమష్టి కృషి వల్లే సాధ్యమైందన్నారు. విద్యుత్ సరఫరా, బిల్లుల వసూళ్లు, నష్టాల నివారణ వంటి అంశాల్లో అకౌంట్స్ ఆఫీసర్లు ఇంజనీర్లకు సలహాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య, అధ్యక్షుడు ఎన్.అశోక్, ప్రతినిధులు శంకర్, వి.పరమేశ్, అనురాధ పాల్గొన్నారు.

పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఉమాశంకర్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్– కాకినాడ (07001/07002) ప్రత్యేక రైలు ఈ నెల 14న రాత్రి 8.15కి నాంపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.25కి కాకినాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 15, 17వ తేదీల్లో రాత్రి 8.05కి కాకినాడ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.40కి నాంపల్లి చేరుకుంటుంది. సికింద్రాబాద్– కాకినాడ (82706/82705) ప్రత్యేక రైలు ఈ నెల 12న రాత్రి 9.40కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.55కి కాకినాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 16న రాత్రి 7.30కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.25కి సికింద్రాబాద్ చేరుకుంటుంది. నర్సాపూర్– సికింద్రాబాద్ (07255) ప్రత్యేక రైలు 18న సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.30కి సికింద్రాబాద్ చేరుకుంటుంది.

ఇందూ టెక్ జోన్‌పై ఐఎఫ్‌సీఐ న్యాయ పోరాటం

- దివాలా ప్రక్రియ కోసం ఐపీఆర్‌ను నియమించండి
- ఎల్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు.. 16న విచారణ

సాక్షి, హైదరాబాద్: రుణం చెల్లించకపోవడంతో ఇందూ టెక్ జోన్‌పై ప్రభుత్వ ఆర్థిక సంస్థ ఐఎఫ్‌సీఐ లిమిటెడ్ న్యాయ పోరాటానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా ఇందూ టెక్ జోన్ దివాలా ప్రక్రియను ప్రారంభించాలని అభ్యర్థిస్తూ జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ట్రిబ్యునల్ సభ్యులు విత్తనాల రాజేశ్వరరావు, రవికుమార్ దొరైస్వామితో కూడిన ధర్మాసనం 16న విచారణ జరపనుంది. ఇందూ టెక్‌కు ఐఎఫ్‌సీఐ రూ.60 కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. రూ.9.90 కోట్లను 2009లో విడుదల చేసింది. 2013 అక్టోబర్ నుంచి రూ.9.90 కోట్లను తిరిగి చెల్లించలేదు. నోటీసులు ఇచ్చినా ఇందూ యాజమాన్యం స్పందించలేదు. దీంతో ఐఎఫ్‌సీఐ ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ దాఖలు చేసింది. దివాలా ప్రక్రియను ప్రారంభించేందుకు దివాలా పరిష్కారదారు (ఐఆర్‌పీ)ను నియమించాలని కోరింది.

కాళేశ్వరం పనుల ప్రత్యక్ష ప్రసారం

జలసౌధలో ప్రత్యేక స్క్రీన్ల ఏర్పాటు

- ఇంజనీర్లు, ఏజెన్సీ ప్రతినిధులతో హరీశ్‌రావు ముఖాముఖి
- హైదరాబాద్ నుంచే పనుల పర్యవేక్షణ, కంట్రోల్ సిబ్బంది పనితీరుపై ఆరా
- సకాలంలో పంపుల సరఫరాకు బీహెచ్‌ఈఎల్ హామీ



ప్రత్యక్షప్రసారం ద్వారా కాళేశ్వరం ప్రగతిని సమీక్షిస్తున్న హరీశ్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడానికి మంత్రి హరీశ్‌రావు టెక్నాలజీని అందిపుచ్చుకున్నారు. ఈ ప్రాజెక్టుకు చెందిన మూడు బ్యారేజీలు, మూడు పంప్ హౌజ్‌లు, గ్రావిటీ కెనాల్, గేట్ల ఫ్యాబ్రికేషన్ పనులను స్వయంగా మూడు రోజులపాటు పరిశీలించిన మంత్రి, అనంతరం జలసౌధ నుంచి ఆయా పనుల పురోగతిని ప్రత్యక్ష ప్రసారం(లైవ్) ద్వారా తనిఖీ చేసే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. శనివారం జలసౌధలో ఏర్పాటు చేసిన లైవ్ స్క్రీన్ నుంచి మంత్రి హరీశ్ కాళేశ్వరం ప్రగతిని పర్యవేక్షించారు. మంత్రి లైవ్‌లోకి రావడంతో అన్నారం బ్యారేజీలో పనిచేస్తున్న అధికార యంత్రాంగం, సిబ్బంది నివ్వెరపోయారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో ఉన్న సంబంధిత ఏజెన్సీ ఇంజనీర్, ఇరిగేషన్ ఇంజనీర్లతో నేరుగా సంభాషించారు. పనులు జరుగుతున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. శనివారంనాడు ఎంత కాంక్రీటు వేశారు? ఎంత టార్గెట్ రీచ్ అయ్యారు? ఎన్ని గేట్లు ఫ్యాబ్రికేట్ చేశారు అని ఇరిగేషన్ ఈఈ మల్లికార్జున ప్రసాద్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు సైటులో ఉండే ప్లేస్మెంట్ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది, ఫీల్డ్ ఇంజనీర్ల విధుల రికార్డులను కూడా మంత్రి హైదరాబాద్ నుంచే తనిఖీ చేశారు. గత నెల డిసెంబర్‌లో 1.04 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనులు జరిగాయని సైటు ఇంజనీర్లు మంత్రికి తెలిపారు. జనవరి నుంచి ప్రతినెలా 1.50 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనుల లక్ష్యంతో పనిచేస్తున్నట్టు సైట్ ఇంజనీర్లు మంత్రికి వివరించారు. కాగా కాళేశ్వరంకు సంబంధించిన ప్యాకేజీ -6, ప్యాకేజీ- 8లకు అవసరమైన పంపులు, మోటార్లు, ఇతర యంత్ర పరికరాలను సకాలంలో సరఫరా చేస్తామని బీహెచ్‌ఈఎల్ ఉన్నతాధికారుల బృందం ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. శనివారం ఈ బృందం హరీశ్‌రావుతో జలసౌధలో ప్రత్యేకంగా సమావేశమైంది.

ఛనాకా–కొరటా పనులపై ఆగ్రహం..

ఛనాకా–కొరటా ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగడంపట్ల హరీశ్‌రావు అధికారులు, ఏజెన్సీల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు 1,000 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనులు జరగని పక్షంలో ఏజెన్సీని మార్చుతామని ఆయన హెచ్చరించారు. 15 రోజులలో పనుల పురోగతి లేకపోతే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్చి నెలాఖరులోపు బ్యారేజీ పియర్స్‌ను బ్రిడ్జి లెవల్ వరకు లేపాలని, ఈలోగా గేట్ల తయారీ పూర్తి చేయాలన్నారు. వెనువెంటనే గేట్లను బిగించాలని కోరారు. జనవరి 15 లోపు సర్జ్‌పూల్ డిజైను, డెలివరీ సిస్టమ్, ప్రెషర్ పైపులైను వ్యాలీ క్రాసింగ్ డిజైన్లను పూర్తి చేయాలని సీడీఓ సీఈని ఆదేశించారు. మిగిలిన పైపులైన్ నిర్మాణాన్ని మార్చి చివరిలోగా పూర్తి చేయాలని హరీశ్ కోరారు. పవర్ లైన్స్ ఏర్పాటుకు 11 ప్రాంతాల్లో భూయజమానులతో ఇబ్బందులు ఉన్నట్టు ట్రాన్స్‌కో డైరెక్టర్ సూర్యప్రకాశరావు మంత్రికి తెలిపారు. దీనిపై ఆదిలాబాద్ జిల్లా మంత్రి జోగు రామన్నతో హరీశ్ ఫోన్లో మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

సాక్షి
జాతీయం / అంతర్జాతీయం
హైదరాబాద్
ఆదివారం | జనవరి | 7 | 2018
14

ప్రపంచవ్యాప్తంగా క్లోరోఫ్లోరోకార్బన్స్ (సీఎఫ్‌సీ)పై నిషేధం విధించడం ద్వారా ఓజోన్ పొర క్షీణతను సుమారు 20 శాతం తగ్గించవచ్చని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా వెల్లడించింది.







దక్షిణ కొరియా రాజధాని సియోల్ దగ్గర్లోని వాచియోన్‌లో గడ్డకట్టిన ఓ నది ఉపరితలంపై రంధ్రాలు చేసి చేపలు పడుతున్న ప్రజలు. వార్షిక 'ఐస్ ఫిషింగ్ ఫెస్టివల్'లో శనివారం ఈ దృశ్యం కనిపించింది.

మలేసియాలో స్టార్స్ క్రికెట్

తమిళసినిమా(చెన్నై): మలేసియాలో కోలీవుడ్ సినీ ప్రముఖులు స్టార్స్ క్రికెట్ పోటీ, ఆటపాటలతో సందడి చేశారు.మలేసియాలోని బూకీజాలీ స్టేడియంలో శనివారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్‌స్టార్ రజనీకాంత్, కమల్‌హాసన్ సహా దాదాపు 340 మంది నటీనటులు పాల్గొన్నారు. తొలుత క్రికెట్‌తో, అనంతరం పలు సినీ, సాంస్కృతిక కార్యక్రమాలతో మలేసియా ప్రేక్షకులను కోలీవుడ్ స్టార్స్ అలరించారు. దక్షిణ భారత నటీనటుల సంఘం భవన నిర్మాణం కోసం నిధుల సేకరణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కోసం శుక్రవారం మలేసియా చేరుకున్న తమిళ నటులకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా మలేసియా ప్రధాని అబ్దుల్ రజాక్ రజనీకాంత్‌ను కలసి అభినందించారు.




కౌలాలంపూర్‌లో హెలికాప్టర్ నుంచి అభిమానులకు అభివాదం చేస్తున్న కమల్‌హాసన్, రజనీకాంత్

కశ్మీర్ హిమోత్పాతంలో 11 మంది మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఓ వాహనంపై భారీ మంచు చరియలు విరిగిపడ్డ ఘటనలో 11 మృతదేహాలను వెలికితీసినట్లు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఖలీద్ జహంగీర్ శనివారం తెలిపారు. ఖూనీ నల్లా ప్రాంతంలో కుప్వారా–తంగ్‌ధర్ రోడ్డుపై శుక్రవారం భారీ మంచు చరియలు విరిగిపడ్డ సంగతి తెలిసిందే. ఘటనాస్థలి నుంచి ప్రాణాలతో ఉన్న ముగ్గురు ప్రయాణికుల్ని ఇప్పటివరకు కాపాడినట్లు వెల్లడించారు. మరోవైపు ఈ ప్రమాదంలో మృతులకు జమ్మూకశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు, క్షతగాత్రులకు రూ.12,600 నష్టపరిహారం అందజేస్తామని రాష్ట్ర విపత్తు నిర్వహణ, పునరావాస శాఖ మంత్రి జావీద్ ముస్తాఫా మీర్ ప్రకటించారు.

క్షమాపణ చెప్పకుంటే రూ. 5 కోట్లు కట్టండి



లాహోర్: ముంబై ఉగ్రదాడుల సూత్రధారి హాఫీజ్ సయీద్ పాక్ రక్షణమంత్రి దస్తగీర్‌కు రూ.5.70 కోట్ల(10 కోట్ల పాకిస్తానీ రూపాయలు) పరువునష్టం నోటీసులిచ్చాడు. 'పాఠశాల విద్యార్థులపై ఉగ్రమూకలు విచక్షణారహితంగా కాల్పులు జరపకుండా ఉండేందుకే జేయూడీ, ఎఫ్ఐఎఫ్‌లకు విరాళాలపై నిషేధం విధిస్తున్నాం' అని ఇటీవల దస్తగీర్ అన్నారు. దీంతో 'ఈ విషయమై నా క్లయింట్(సయీద్)కు 14 రోజుల్లోగా రాతపూర్వకంగా క్షమాపణ చెపాల్సి. ఇలాంటి ఘటనలు పునరావృతం కావని దస్తగీర్ మాటివ్వాలి. లేదంటే పాకిస్తాన్ శిక్షాస్మృతి సెక్షన్ 500 కింద కోర్టును ఆశ్రయిస్తాం' అని సయీద్ న్యాయవాది నోటీసులు జారీచేశారు.

నాలుగోసారీ ఆడపిల్లే పుట్టిందని...

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఓ మహిళ నాలుగో ఆడబిడ్డకు జన్మనివ్వడంతో ఆమెకు అత్తింటివారే నిప్పంటించి కాల్చి చంపిన అమానుష ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు భర్త సహా నలుగురిపై కేసు నమోదు చేశారు. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం...ఉత్తర 24 పరగణ జిల్లాకు చెందిన ఫాతిమాకు ముగ్గురు కూతుర్లు ఉన్నారు. ఇటీవలే నాలుగో కాన్పులోనూ అమ్మాయే పుట్టింది. మగబిడ్డ పుట్టనందున ఎక్కువ కట్నం తేవాలని ఫాతిమాను అత్తింటివారు మొదటినుంచీ వేధించేవారు. మళ్లీ ఆడపిల్ల పుట్టడంతో ఆమె కష్టాలు పెరిగాయి. అత్తింటివారే ఫాతిమా చేతులు వెనక్కు మడిచి కట్టేసి నిప్పంటించారని ఆమె బంధువులు చెప్పారు.

'హెచ్-1బీ' ప్రతిపాదన సరికాదు: యూఎస్‌సీసీ

వాషింగ్టన్: హెచ్–1బీ వీసాల గడువును పొడిగించకూడదంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదిస్తుండటం సరైనది కాదని యూఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ (యూఎస్‌సీసీ) శనివారం పేర్కొంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ప్రతిభాధారిత వలస వ్యవస్థ లక్ష్యాన్ని నీరుగారుస్తుందని యూఎస్‌సీసీ ఆందోళన వ్యక్తం చేసింది. 'ఎన్నో ఏళ్లుగా అమెరికాలో పనిచేస్తూ, ఇక్కడే శాశ్వత నివాసం ఏర్పరచుకోవాలనుకునే ప్రతిభావంతులకు తమ దేశంలో స్థానం లేదనడం ఏ మాత్రం సరైనది కాదు' అని యూఎస్‌సీసీ అధికార ప్రతినిధి అన్నారు. హెచ్–1బీ వీసాల గడువు పొడిగించకుండా, ఆ వీసాదారులను తిరిగి స్వదేశాలకు పంపేయడం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు, వ్యాపారానికి, మొత్తంగా దేశానికే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని ఆయన అన్నారు.

పీసీసీ అధ్యక్షుల మార్పు లేదు: కాంగ్రెస్

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీ బాధ్యతలు చేపట్టాక అన్ని రాష్ట్రాల పీసీసీ (ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ) అధ్యక్షులను మారుస్తారంటూ వచ్చిన ఊహాగానాలకు తెరపడింది. ప్రస్తుతానికి పీసీసీల్లో, ప్రాంతీయ కమిటీల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. ఈ మేరకు రాహుల్ నిర్ణయించినట్టు పార్టీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ సంస్థాగత ఎన్నికల తర్వాతా మార్పులు ఉండవని పేర్కొంది. తదుపరి మార్పులపై నిర్ణయం తీసుకొనే వరకు ఆయా కమిటీల అధ్యక్ష పదవుల్లో ప్రస్తుతం ఉన్నవారే కొనసాగుతారు.

మీసా భారతిపై ఈడీ రెండో చార్జిషీటు



న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసులో బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కూతురు మీసా భారతి, ఆమె భర్త శైలేశ్ కుమార్‌పై శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రెండో చార్జిషీటు దాఖలు చేసింది. 'ఈ కేసు విచారణను ప్రారంభిద్దామా? లేక మీరు ఫిర్యాదులు, చార్జిషీట్‌లు దాఖలు చేస్తూనే ఉంటారా? మీది ఉన్నతస్థాయి విచారణ సంస్థ. ఇలా ప్రవర్తించటం మీకు తగదు. ఇది తప్పుల తడకగా ఉన్న ఫిర్యాదు' అని ఈడీ తీరుపై ఢిల్లీ హైకోర్టు జడ్జి మండిపడ్డారు.

విమానాలకు 'గణతంత్ర వేడుకల' దెబ్బ!

న్యూఢిల్లీ: ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిషేధాజ్ఞల వల్ల ఇక్కడి ఇందిరాగాంధీ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే వెయ్యికిపైగా విమానాలు ప్రభావితం కానున్నాయి. గణతంత్ర వేడుకల సందర్భంగా జనవరి 18 నుంచి 26 వరకూ రోజూ ఉదయం 10.35 గంటల నుంచి 12.15 గంటల వరకు గగనతలంపై నిషేధం ఉంటుందని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఇందుకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) పలు విమానయాన సంస్థలకు ఇప్పటికే నోటీసులు జారీచేసిందన్నారు.

గడ్డిమేతకు మూడున్నరేళ్ల జైలు

- రూ.10 లక్షల జరిమానా
- దాణా కేసులో లాలూకు శిక్ష ఖరారు చేసిన సీబీఐ కోర్టు
- జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆర్నెల్ల జైలు
- 21 ఏళ్ల నాటి దాణా కేసులో మరో ఏడుగురికీ ఇదే శిక్ష
- మరో మూడు 'దాణా' కేసుల్లోనూ విచారణ ఎదుర్కొంటున్న లాలూ



రాంచీ: 21 ఏళ్ల నాటి దాణా కుంభకోణంలో బిహార్ మాజీ సీఎం, ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్‌యాదవ్‌కు సీబీఐ కోర్టు మూడున్నరేళ్ల జైలు శిక్ష విధించింది. దీంతోపాటుగా రూ.10 లక్షల జరిమానా కూడా లాలూ చెల్లించాలని సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శివ్‌పాల్‌సింగ్ శనివారం తీర్పునిచ్చారు. లాలూ జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆర్నెల్లు అదనంగా జైల్లో గడపాల్సి ఉంటుంది. ఆర్జేడీ చీఫ్ సహా మరో ఏడుగురికి మూడున్నరేళ్ల పాటు జైలు శిక్ష, రూ. 10 లక్షల జరిమానా విధించారు. లాలూతోపాటుగా మరో 15 మంది దోషులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు. శనివారం మధ్యాహ్నం శిక్ష ఖరారుకు సంబంధించిన వాదనలు ముగియగా.. నాలుగు గంటలకు న్యాయమూర్తి శివ్‌పాల్‌సింగ్ తీర్పు చెప్పారు. 'ఇటువంటి దోషులకు ఓపెన్ జైలు సరిగా సరిపోతుంది. ఎందుకంటే వాళ్లకు గతంలో ఆవులను పెంచిన అనుభవం ఉంది' అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. డిసెంబర్ 23నే వీరిని కోర్టు దోషులుగా గుర్తించినప్పటికీ మూడ్రోజులుగా శిక్షల ఖరారు వాయిదా పడుతున్న సంగతి తెలిసిందే.

మరో 15 మందికి శిక్షలు ఖరారు

మోసం, నేరపూరిత కుట్ర, తప్పుడు పత్రాల వినియోగంతో నిధుల విడుదలతోపాటు ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద లాలూకు మూడున్నర ఏళ్ల జైలు శిక్ష విధించారని సీబీఐ న్యాయవాది వెల్లడించారు. అయితే, ఈ శిక్షను వచ్చే వారం జార్ఖండ్ హైకోర్టులో అప్పీలు చేయనున్నట్లు లాలూ తరపు న్యాయవాది చిత్తరంజన్ సిన్హా తెలిపారు. దేవ్‌గఢ్ ట్రెజరీకి సంబంధించిన కేసులో మరో 15 మందికీ ఐపీసీ, పీసీఏ (అవినీతి నిరోధక చట్టం) కింద ఆర్నెల్ల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్షలను కూడా న్యాయమూర్తి ప్రకటించారు. కుంభకోణం జరిగిన సమయంలో ప్రజాపద్దుల కమిటీ చైర్మన్‌గా ఉన్న జగదీశ్ శర్మకు ఏడేళ్ల జైలు, రూ. 20 లక్షల జరిమానా, ఆర్జేడీ నేత ఆర్కే రాణాకు ఆర్నెల్ల జైలు, రూ.10 లక్షల జరిమానా విధించారు. ముగ్గురు ఐఏఎస్ అధికారులు బెక్ జూలియస్, ఫూల్‌చంద్ సింగ్, మహేశ్ ప్రసాద్‌లకు మూడున్నరేళ్ల జైలు, రూ.5 లక్షల జరిమానాను న్యాయమూర్తి విధించారు. మాజీ ప్రభుత్వాధికారి కృష్ణ కుమార్‌కు ఏడేళ్ల జైలు, రూ. 20 లక్షల జరిమానా, మాజీ అధికారి సుబీర్ భట్టాచార్యకు మూడున్నరేళ్ల జైలు రూ. 10 లక్షల జరిమానా, సప్లయర్ మోహన్ ప్రసాద్‌కు ఏడేళ్ల జైలు, రూ. 10 లక్షల జరిమానా విధించారు. మిగిలిన వారికి కూడా దాదాపుగా ఇవే శిక్షలు పడ్డాయి.

చట్టం ముందు అందరూ ఒకటే!

లాలూ శిక్షపై బీజేపీ, జేడీయూ, కాంగ్రెస్‌లు స్పందించాయి. చట్టం ముందు అందరూ సమానులేనని బీజేపీ నేత షానవాజ్ వ్యాఖ్యానించారు. 'కోర్టు తన పని తాను చేసింది. దేశ సంపదను దోచుకునే వారికి ఇదో కీలకమైన గుణపాఠం. ఎట్టకేలకు బిహార్ ప్రజలకు న్యాయం జరిగింది' అని షానవాజ్ పేర్కొన్నారు. రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలైందని.. రాజకీయ నేతలు ఇకపై తప్పు చేసేందుకు భయపడాల్సిందేనని జేడీయూ అధికార ప్రతినిధి కేసీ త్యాగి పేర్కొన్నారు. లాలూ అరెస్టయినంత మాత్రాన ఆర్జేడీతో సంబంధాలు తగ్గే ప్రసక్తే లేదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. లౌకికవాదం, సామాజిక న్యాయం కోసం తమ పోరాటం సాగుతుందని వెల్లడించింది. కాగా, బీజేపీ, నితీశ్ కుమార్ కుట్రపన్ని మరీ లాలూను జైలుకు పంపారని ఆర్జేడీ ఆరోపించింది. బెయిల్ కోసం హైకోర్టుకెళ్తామని లాలూ కుమారుడు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తెలిపారు.

జైలుకు రెండోసారి

దాణా కుంభకోణంలో లాలూ జైలు శిక్ష అనుభవించటం ఇది రెండోసారి. 21 ఏళ్ల క్రితం దేవగఢ్ ట్రెజరీ నుంచి రూ.89.27 లక్షల నిధులను అక్రమంగా తీసుకున్నారనే కేసుపై లాలూ జైలుకెళ్తుండగా.. దంకా ట్రెజరీ నుంచి రూ.3.97 కోట్లు, చైబాసా ట్రెజరీ నుంచి రూ.36 కోట్లు, దోరండా ట్రెజరీ నుంచి రూ. 184 కోట్లు అక్రమంగా కొల్లగొట్టారనే 3 కేసుల్లోనూ లాలూ విచారణ ఎదుర్కొంటున్నారు. 1996లో పట్నా హైకోర్టు దాణా స్కామ్‌పై విచారణకు ఆదేశించగా.. దేవ్‌గఢ్ ట్రెజరీకి సంబంధించిన కేసులో 1997, అక్టోబర్ 27న 38 మందిపై సీబీఐ చార్జిషీటు దాఖలు చేసింది. కాలక్రమేణా 11 మంది చనిపోగా, ముగ్గురు అప్రూవర్లుగా మారిపోయారు.

దేవ్‌గఢ్ ట్రెజరీ దాణా కేసు..

21	56	64
సంవత్సరాలు	నిందితులు	నమోదైన కేసులు



రాహుల్‌పై సభా హక్కుల నోటీసు

లోక్‌సభ స్పీకర్ పరిశీలనకు పంపిన రాజ్యసభ చైర్మన్



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌పై సభా హక్కుల నోటీసును రాజ్యసభ చైర్మన్ వెంకయ్య.. లోక్‌సభ స్పీకర్‌కు పంపారు. రాహుల్ లోక్‌సభ ఎంపీ కావడంతో తదుపరి చర్యల కోసం నోటీసును స్పీకర్‌కు పంపినట్లు రాజ్యసభ వర్గాలు తెలిపాయి. కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ పేరును సోషల్ మీడియాలో రాహుల్ అభ్యంతరకరంగా పేర్కొన్నారని, రాజ్యసభ అధికారాన్ని ప్రశ్నించడంతోపాటు, దాని నిర్ణయాల్ని ప్రశ్నించారని ఆరోపిస్తూ.. బీజేపీ సభ్యుడు భూపిందర్ యాదవ్ రాజ్యసభలో సభా హక్కుల నోటీసు ఇచ్చారు. దానిపై స్పందించిన రాజ్యసభ చైర్మన్... నోటీసును పరిశీలన కోసం లోక్‌సభ స్పీకర్‌కు సిఫార్సు చేశారు.

డిసెంబర్ 27 నాటి ట్వీట్ వల్లే..

'ప్రధాని చెప్పే దానికి.. చేసే దానికి పొంతన ఉండదని గుర్తు చేసినందుకు Jaitlieకి ధన్యవాదాలు' అంటూ డిసెంబర్ 27న రాహుల్ ట్వీట్ చేశారు. రాహుల్ ట్వీట్‌పై భూపిందర్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. రాహుల్ కావాలనే Jaitley పేరును Jait'lie'(lie అంటే అబద్ధం) అని మార్చారని ఆరోపించారు. కాగా, ఒకవేళ రాహుల్‌కు సభా హక్కుల ఉల్లంఘన వర్తిస్తే అనేక అంశాల్లో బీజేపీ కూడా దోషేనని కాంగ్రెస్ నాయకుడు ఆనంద్ శర్మ అన్నారు. మంత్రులు చేసిన అనేక వ్యాఖ్యలు సభా హక్కుల నోటీసుల కిందకే వస్తాయని ఆయన ఆరోపించారు. మరోవైపు, మోదీ, జైట్లీపై మరోసారి రాహుల్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రధాని వేర్పాటువాద రాజకీయాల వల్ల బ్యాంక్ క్రెడిట్ వృద్ధి రేటు 63 ఏళ్ల కనిష్టానికి పడిపోయిందని, ఉద్యోగ కల్పన రేటు 8 ఏళ్ల కనిష్టానికి దిగజారిందని రాహుల్ ఆరోపించారు.

గోడకు 1.14 లక్షల కోట్లు

అమెరికా–మెక్సికో సరిహద్దు గోడపై ట్రంప్



వాషింగ్టన్: మెక్సికో సరిహద్దులో గోడ నిర్మించడానికి వచ్చే పదేళ్ల కాలానికి సుమారు రూ.1.14 లక్షల కోట్లు కేటాయించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కాంగ్రెస్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో ఎన్నికల ప్రచారంలో చేసిన ఈ వాగ్దానాన్ని ఎలా నెరవేరుస్తారన్న దానిపై కొంత స్పష్టత వచ్చింది. సరిహద్దు రక్షణకు మొత్తం సుమారు రూ.2.09 లక్షల కోట్లు అవసరమని అమెరికా కస్టమ్స్, బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం ఒక అంచనా పత్రాన్ని విడుదల చేసింది. అందులో గోడ నిర్మాణానికి రూ.1.14 లక్షల కోట్లు, సాంకేతిక పరికరాలకు సుమారు 36 వేల కోట్లు, రోడ్డు నిర్మాణం, నిర్వహణ తదితరాలకు సుమారు రూ.6 వేల కోట్ల చొప్పున ప్రతిపాదించారని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. అంతా అనుకున్నట్లు జరిగితే 2027 నాటికి అమెరికా నుంచి మెక్సికోను వేరు చేస్తూ 1552 కి.మీ మేర గోడ లేదా కంచె పూర్తవుతుంది. మరోవైపు, పాక్‌ను దారిలోకి తేవడానికి ఆర్థిక సాయం నిలిపేయడమే కాకుండా ఇతర అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నామని అమెరికా తెలిపింది. తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్ లాంటి ఉగ్ర సంస్థల నిర్మూలనకు పాకిస్తాన్‌ను ఒప్పించేందుకు ఇంకా ఎన్నో మార్గాలున్నాయని ఉన్నతాధికారి చెప్పారు.

కశ్మీర్‌లో బాంబు పేలుడు

నలుగురు పోలీసుల మృతి



అమరులైన పోలీసులు

శ్రీనగర్/న్యూఢిల్లీ: కశ్మీర్‌లో ఉగ్రవాదులు అమర్చిన శక్తివంతమైన బాంబుపేలి నలుగురు పోలీసులు అసువులు బాశారు. బారాముల్లా జిల్లా సోపోర్ పట్టణంలో మూడో బెటాలియన్‌కు చెందిన రిజర్వు పోలీసులు పెట్రోలింగ్ చేపట్టారు. ఉదయం వారు స్థానిక మార్కెట్ ప్రాంతంలోని మూసి ఉన్న దుకాణం వద్దకు రాగానే అప్పటికే అమర్చి ఉంచిన అత్యాధునిక పేలుడు పదార్థం (ఐఈడీ)ను ఉగ్రవాదులు రిమోట్ సాయంతో పేల్చారు. దీంతో నలుగురు పోలీసులు చనిపోగా ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటనకు తామే కారణమని జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది. మృతులను ఏఎస్సై ఇర్షాద్ అహ్మద్(దోడా), కానిస్టేబుళ్లు గులాం నబీ(బారాముల్లా), పర్వాయిజ్ అహ్మద్(హంద్వారా), మహ్మద్ అమిన్(కుప్వారా)గా గుర్తించారు. కాగా, భద్రతా సిబ్బంది ప్రాణాలు కాపాడటంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ ఆరోపించింది. సైన్యం, పోలీసులు, సీఆర్పీఎఫ్‌పై దాడులు జరగని రోజంటూ లేకుండాపోయిందని పార్టీ అధికార ప్రతినిధి ఆనంద్‌శర్మ విమర్శించారు. కశ్మీర్ సీఎం మెహబూబా ఈ దాడిని ఖండించారు.

రాజ్యసభలో పుంజుకోనున్న బీజేపీ

- ఈ ఏడాది 67కు పెరగనున్న సీట్లు
- 57 నుంచి 48 పడిపోనున్న కాంగ్రెస్ బలం



సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: లోక్‌సభ సాధారణ ఎన్నికలకు ఏడాదిన్నర సమయం కూడా లేదు. ఈ పరిస్థితుల్లో కొత్త బిల్లుల్ని పార్లమెంట్‌లో ఆమోదింపచేసుకుని తన ప్రతిష్ట పెంచుకోవాలనే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. రాజ్యసభలో తగినంత సంఖ్యా బలం లేకపోవడం బీజేపీకి ఇబ్బందిగా మారింది. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ట్రిపుల్ తలాక్ బిల్లుపై రాజ్యసభలో వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో రాజ్యసభలో బలం పెంచుకునే అంశంపై బీజేపీ దృష్టి పెట్టిందని ఆ పార్టీ పార్లమెంటరీ కమిటీ కార్యదర్శి బాలసుబ్రమణియమ్ చెప్పారు. 2018 ద్వితీయార్థానికల్లా రాజ్యసభలో బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరించబోతోంది. ప్రస్తుతమున్న 57 మంది సభ్యుల బలం 67కి చేరుతుంది. 244 మంది సభ్యులున్న రాజ్యసభలో ఎన్డీఏ కూటమి బలం 98కి చేరువకానుంది. బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్తాన్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి ఆ పార్టీ లాభపడనుంది. ప్రస్తుతం కాంగ్రెస్‌కు రాజ్యసభలో 57 మంది ఎంపీలుండగా.. జూలైకు ఆ బలం 48కి పడిపోనుంది. యూపీఏ కూటమి ఎంపీలు 72 నుంచి 63 తగ్గనున్నారు. బడ్జెట్ సమావేశాల నాటికి బీజేపీ బలం 58కి పెరగనుండగా.. కాంగ్రెస్ బలం 54కి పడిపోనుంది. కాంగ్రెస్ తర్వాత రాజ్యసభలో సమాజ్‌వాదీ పార్టీ ఎక్కువ నష్టపోనుంది. ఆ పార్టీ ఐదు స్థానాలు కోల్పోనుండగా.. ఆర్జేడీ బలం మూడు నుంచి ఐదుకు పెరుగుతుంది. రాజ్యసభ ఉప ఎన్నికలు, ద్వైవార్షిక ఎన్నికల ఫలితాలపై ఈ మార్పులు చేర్పులు ఆధారపడి ఉన్నాయి. ఇక ఏప్రిల్‌లో ద్వై వార్షిక ఎన్నికల్లో 59 స్థానాలకు ఓటింగ్ జరగనుంది. యూపీలో 10 స్థానాలకు ఎన్నిక జరగనుండగా 8 స్థానాలు బీజేపీ సొంతం కానున్నాయి.

రాలిపోతున్న విద్యాకుసుమాలు

2016లో 9,474 మంది విద్యార్థుల ఆత్మహత్య

- దేశంలో మహారాష్ట్ర, దక్షిణాదిలో తమిళనాడు ప్రథమం
- దక్షిణాదిన మూడు, ఐదు స్థానాల్లో తెలంగాణ, ఏపీ


సాక్షి, బెంగళూరు: తీవ్రమైన ఒత్తిడి, చిన్న సమస్య ఎదురైనా తట్టుకోలేని మనస్తత్వం, వెరసి దేశంలో గంటకో విద్యా కుసుమం రాలిపోతోంది. ఉజ్వల భవిష్యత్తుతో ముందుకు సాగాల్సిన విద్యార్థులను సమస్యల చదువు ఆత్మహత్యల దిశగా నడిపిస్తోంది. కేంద్ర హోం శాఖ ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం... దేశవ్యాప్తంగా 2016లో 9,474 మంది విద్యార్థులు బలవన్మరణం చెందారు. మహారాష్ట్ర 1,350 మంది విద్యార్థుల ఆత్మహత్యలతో దేశంలోనే మొదటి స్థానంలో నిలవగా దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడు, కర్ణాటక మొదటి, రెండు స్థానాల్లో, తెలంగాణ మూడో, ఆంధ్రప్రదేశ్ ఐదో స్థానంలో ఉన్నాయి. అదేవిధంగా 2016లో తమిళనాడులో 981 మంది విద్యార్థులు బలవన్మరణం చెందగా రోజుకు సగటున మరణాల రేటు 2.68గా నమోదైంది. కర్ణాటకలో 540 మంది ఆత్మహత్య చేసుకోగా రోజువారీ రేటు 1.47గా ఉంది. ఇక మూడో స్థానంలో ఉన్న తెలంగాణలో 349 మంది, కేరళలో 340 మంది అర్ధంతరంగా తనువు చాలించారు. ఆంధ్రప్రదేశ్ 295 మంది విద్యార్థుల ఆత్మహత్యలతో ఐదో స్థానంలో ఉంది.

ఒత్తిళ్లే కారణమా?: ప్రాణాలు తీసుకోవాలనే తీవ్ర వైఖరి విద్యార్థుల్లో ప్రబలటానికి సామాజిక, మానసిక కారణాలు ఉన్నాయని అంటున్నారు మానసిక నిపుణులు. టాప్ ర్యాంకులు తెచ్చుకోవాలంటూ టార్గెట్లు పెడుతూ ఒత్తిళ్లు తెస్తున్న పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాల వైఖరి ఇందులో ప్రధానమైంది. నేటి తల్లిదండ్రులు తమ తమ కెరీర్‌లో బిజీగా ఉండి పిల్లలను పట్టించుకోకపోవడంతో వారు ఒంటరితనానికి గురవుతున్నారు. ఈ ఏకాకితనమే వారిని ఒత్తిడికి... ఆ ఒత్తిడి డిప్రెషన్‌కు.. చివరికి ఆత్మహత్యకు ప్రేరేపిస్తోందనేది మానసిక నిపుణుల మాట. విద్యార్థులు మద్యంతోపాటు డ్రగ్స్‌కు బానిసలుగా మారిపోతుండడం మరో కారణం. డ్రగ్స్ వాడకానికి అలవాటు పడ్డ విద్యార్థులు ఒత్తిడులు, సమస్యల నుంచి బయటపడిన భావన కలిగినప్పటికీ అది తాత్కాలికమేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డ్రగ్స్‌కు, మద్యానికి బానిసలుగా మారిన 15శాతం మందిలో ఆత్మహత్య భావనలు కలిగే ప్రమాదముందని చెబుతున్నారు. అంతేకాదు, తమ అలవాటును తల్లిదండ్రులు గుర్తించారని అవమానంగా భావించిన సందర్భాలతో పాటు డ్రగ్స్ దొరకని సమయాల్లో కూడా విద్యార్థులు ఆత్మహత్యలకు యత్నిస్తుంటారన్నది నిపుణుల విశ్లేషణ. ఇటువంటి సమయాల్లో వీరి ప్రవర్తనను, వైఖరిని, నిశితంగా గమనించి తగిన చికిత్సతోపాటు కౌన్సెలింగ్ అందిస్తే ప్రాణాపాయం నుంచి కాపాడే అవకాశాలుంటాయని చెబుతున్నారు.

సమస్యను ఎలా ఎదుర్కోవాలో చెప్పాలి

ప్రస్తుతం చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏం కావాలన్నా కాదనకుండా నిమిషాల్లో తెచ్చి ఇస్తున్నారు తప్పితే, వారికి ఏదైనా సమస్య వచ్చినపుడు ఎలా ఎదుర్కోవాలో మాత్రం నేర్పడం లేదు. సమస్యలు వచ్చినపుడు వాటిని ఎలా ఎదుర్కోవాలన్న విషయాన్ని చిన్నతనం నుంచే తల్లిదండ్రులు పిల్లలకు నేర్పించాలి. ఉపాధ్యాయులు సైతం పాఠ్యాంశాల కంటే ముందుగా తమ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని, ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకోగల ధైర్యాన్ని నింపాలి. కేవలం మార్కుల వెంబడి పరుగులు పెట్టడమే జీవితం కాదన్న విషయాన్ని పిల్లలకు తెలియజెప్పాలి. ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదని, ధైర్యంగా ఎదుర్కొనడమే జీవిత పరమార్థమని తెలియజెప్పాలి.

–అనూష, సైకాలజిస్టు.



దేశంలో విద్యార్థుల ఆత్మహత్యలు ఇలా...

2014లో	2015లో	2016లో
8,068	8,934	9,474

దరఖాస్తు చేశారా?



- సిండికేట్ బ్యాంక్‌లో 500 ప్రొబేషనరీ ఆఫీసర్ (పీవో) పోస్టులకు చివరి తేదీ: జనవరి 17, 2018.
- సెంట్రల్ వాటర్ కమిషన్‌లో గ్రూప్ 'సి' కేటగిరీలోని 63 ఖాళీలకు చివరి తేదీ: జనవరి 22, 2018.
- సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్).. స్పోర్ట్స్ కోటాలోని 118 ఖాళీలకు చివరి తేదీ: జనవరి 25, 2018.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా

సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు -1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సాక్షి భవిత 15
స్పర్థయా వర్ధతే విద్య
ఆదివారం 7-1-2018

బులెటిన్ బోర్డ్

ఐఐటీ బాంబేలో 10 ఖాళీలు

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే (ఐఐటీబీ).. కాంట్రాక్టు పద్ధతిలో 10 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **పోస్టు:** సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.
- **వేతనం:** రూ.30,000–రూ.42,000.
- **మొత్తం ఖాళీలు:** 10 (అన్‌రిజర్వ్‌డ్–5+ ఓబీసీ (ఎన్‌సీఎల్)–1+ఎస్సీ–1+ఎస్టీ–3). **అర్హతలు:** బీఈ/బీటెక్ లేదా కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఎంఎస్సీ లేదా కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బీఎస్సీ+ఐటీ, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో రెండేళ్ల ఉద్యోగానుభవం లేదా ఎంసీఏ+ ఐటీ, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ఏడాది ఉద్యోగానుభవం.
- **వయసు:** 32 ఏళ్లకు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్, స్కిల్ టెస్ట్. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** జనవరి 10, 2018. **వెబ్‌సైట్:** www.iitb.ac.in

సెంట్రల్ మెకానికల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో 15

పశ్చిమబెంగాల్‌లోని దుర్గాపూర్‌లో ఉన్న సెంట్రల్ మెకానికల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఈఆర్ఐ).. 15 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. సీఎంఈఆర్ఐ.. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలోనిది.
- **పోస్టు–ఖాళీలు:** సైంటిస్ట్–8; సీనియర్ సైంటిస్ట్–7. **వేతనం:** సైంటిస్ట్–రూ.85,170; సీనియర్ సైంటిస్ట్–రూ.98,490. **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఎంఈ/ఎంటెక్/పీహెచ్‌డీ. **వయసు:** 2018, జనవరి 25 నాటికి సైంటిస్ట్‌కు 32 ఏళ్లు; సీనియర్ సైంటిస్ట్‌కు 37 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. **ఎంపిక:** ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి నిర్దేశిత చిరునామాకు గడువులోగా పంపాలి. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 25, 2018. **దరఖాస్తు హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 5, 2018.
- **వెబ్‌సైట్:** www.cmeri.res.in

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో 14 ఖాళీలు

కేరళలోని కోచిలో ఉన్న కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్.. 14 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **పోస్టు:** షిప్ డ్రాఫ్ట్స్‌మ్యాన్ ట్రైనీస్.
- **శిక్షణ వ్యవధి:** రెండేళ్లు.
- **స్టైపెండ్:** మొదటి ఏడాది రూ.8,500; రెండో ఏడాది రూ.8,900
- **విభాగాల వారీ ఖాళీలు:** మెకానికల్–1; ఎలక్ట్రికల్–13.
- **అర్హతలు:** పదోతరగతి/తత్సమాన విద్యతోపాటు మెకానికల్/ఎలక్ట్రికల్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిప్లొమా. అలాగే క్యాడ్ (సీఏడీ)లో నైపుణ్యం ఉండాలి. **వయసు:** 2018, జనవరి 15 నాటికి 25 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. **ఎంపిక:** రాతపరీక్ష, ప్రాక్టికల్ టెస్ట్. **దరఖాస్తు రుసుం:** రూ.100; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. **చివరి తేదీ:** జనవరి 15, 2018.
- **వెబ్‌సైట్:** www.cochinshipyard.com

సుస్థిర కెరీర్‌కు.. రీ-స్కిల్లింగ్!



జాబ్ స్కిల్స్

ఫ్రెషర్, ట్రైనీ, సీనియర్.. స్థాయి ఏదైనా ఇప్పుడందరి దృష్టి రీ-స్కిల్లింగ్‌పైనే! స్కిల్స్, స్కిల్ గ్యాప్ గురించి తెలుసు..'రీ -స్కిల్లింగ్' అంటే ఏమిటి? నిపుణుల అభిప్రాయంలో రీ-స్కిల్లింగ్ అంటే.. నూతన టెక్నాలజీ, నైపుణ్యాలపై నిరంతరం అవగాహన పెంపొందించుకోవడం! కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవల ప్రక్రియలో ప్రవేశపెడుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఉద్యోగులకు సరైన అవగాహన ఉండాలని కోరుకుంటున్నాయి. అలాంటి వారినే ప్రోత్సహిస్తున్నాయి. అంటే.. రీ స్కిల్లింగ్‌తోనే కెరీర్‌లో ముందుకు సాగే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో రీ స్కిల్లింగ్ గురించి తెలుసుకుందాం..

ఫ్రెషర్..


మరికొద్ది రోజుల్లో సర్టిఫికెట్ చేతికందనుందనే ఆనందం! నాలుగేళ్ల కృషి ఫలితంగా బీటెక్ పూర్తవుతోందనే సంతోషం! మరోవైపు జాబ్ మార్కెట్లో సరికొత్త ట్రెండ్స్, తాజా సర్వేలపై ఆందోళన! సర్టిఫికెట్లు సరే.. స్కిల్స్ మాటేంటి?' అంటున్న కంపెనీల ధోరణితో భవిష్యత్‌పై బెంగ!

ట్రైనీ..

రాత పరీక్ష, ఇంటర్వ్యూలను దాటి.. కొలువులో చేరి ఇంకా సంవత్సరం కూడా కాలేదు. కానీ, కంపెనీలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాల్సిందేనంటూ యాజమాన్యం నుంచి హెచ్చరికలు! ప్రొబేషన్ పూర్తికాకుండానే ఉద్యోగ భద్రతపై ఆందోళన!

సీనియర్..

సంస్థలో పదేళ్ల అనుభవం.. అంచెలంచెలుగా ఎదుగుతూ టీమ్‌ను నడిపించే స్థాయి! ఎన్నో టాస్క్‌లను విజయవంతంగా పూర్తిచేసి కంపెనీ వృద్ధిలో కీలకంగా నిలిచిన ఘనత! అయినా ఉద్యోగాన్ని కాపాడుకోవాలంటే కొత్త నైపుణ్యాలు నేర్చుకోక తప్పదనే సంకేతం!



ఇలా.. ఫ్రెషర్స్, ట్రైనీ, మిడిల్ లెవల్, సీనియర్ లెవల్.. ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ ఎదురవుతున్న సమస్య.. స్కిల్లింగ్, రీ–స్కిల్లింగ్. కాబట్టి కాలేజీలో చదువుతున్న విద్యార్థులతోపాటు ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్నవారు సైతం తమ తమ రంగాలకు సంబంధించిన నూతన నైపుణ్యాలు, టెక్నాలజీల గురించి తెలుసుకోవాలి. వాటిని పరిశ్రమలో ఏ స్థాయిలో అమలుచేస్తున్నారనే దానిపై అవగాహన పెంపొందించుకోవాలి.


సేవా రంగం నుంచి సాఫ్ట్‌వేర్ వరకు..

జాబ్ మార్కెట్‌లో ప్రస్తుతం 'రీ–స్కిల్లింగ్' అనే మాట సర్వీస్ సెక్టార్ నుంచి సాఫ్ట్‌వేర్ రంగం వరకు వినిపిస్తోంది. కారణం.. ఆయా రంగాల్లోని సంస్థలు కొత్త నైపుణ్యాలతో ఉత్పత్తులు, సర్వీసులను అందిస్తుండటమే. దీంతో ఆయా విభాగాల్లో కొలువుదీరాలంటే సంబంధిత నైపుణ్యాలపై పట్టు సాధించక తప్పని పరిస్థితి. కాబట్టి 'తరగతి గదిలో నేర్చుకున్నది సరిపోతుంది, ఇంటర్న్‌షిప్ అనుభవం కలిసొస్తుంది' అనే ధోరణికి స్వస్తి పలకాలంటున్నారు నిపుణులు.

క్యాంపస్‌లో కొలువు దక్కినా!

క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్‌లోనే ఉద్యోగం పొందినా.. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. 'ఆఫర్ లభించింది కదా..!' అని రిలాక్స్ అవుదామనుకుంటే కంపెనీలు అంగీకరించే పరిస్థితి లేదు. ఫ్రెషర్స్‌కే కాదు సీనియర్ లెవల్‌లోనూ రీ–స్కిల్లింగ్ తప్పనిసరిగా మారింది. ముఖ్యంగా కంపెనీలు యంగ్ మిలీనియల్స్ (1980–96 మధ్య పుట్టిన వారు)పై ప్రత్యేకంగా దృష్టిసారించాయి. వారిలో రీ–స్కిల్లింగ్‌పై ఉన్న ఆసక్తి, ఆ దిశగా వారు చేస్తున్న కృషిని నిరంతరం గమనిస్తున్నాయి. దీన్ని గుర్తించే క్యాంపస్ డ్రైవ్స్‌లో రూ.లక్షల ప్యాకేజీతో ఆఫర్లు అందుకున్న వారు సైతం రీ–స్కిల్లింగ్ బాట పడుతున్నారు.

రీ-స్కిల్లింగ్‌కు మార్గాలు



కంపెనీల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం ఎలా? ఈ విషయంలో ఆందోళన సహజం. అలాంటి వారి కోసం ప్రస్తుతం అనేక మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఆన్‌లైన్ టూల్స్ ముఖ్యమైనవి. వీటి ద్వారా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చు. ఇప్పుడు ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలు సైతం ఆన్‌లైన్ సర్టిఫికేషన్స్ అందిస్తున్నాయి. డిజైన్, డెవలప్‌మెంట్, మార్కెటింగ్‌లకు సంబంధించి కొత్త సాంకేతికతలు అందుబాటులోకి వస్తున్నాయి. నిరంతర అన్వేషణ, నిత్య అధ్యయనాలతో కొత్త నైపుణ్యాలపై పట్టు సాధించడం ఏమంత కష్టం కాదు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్



ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ).. వేగంగా విస్తరిస్తున్న టెక్నాలజీ. దీని ఆధారంగా మెషీన్లు, కంప్యూటర్లను అనుసంధానించి స్వల్ప సమయంలో సంబంధిత టాస్క్‌లను పూర్తిచేయొచ్చు. వాస్తవానికి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ పరిధి విస్తృతమైంది. మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), బిగ్ డేటా, డేటా అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్ ప్రాధాన్యం పెరుగుతోంది.

కృత్రిమ మేధ

నూతన నైపుణ్యాలు, రీ–స్కిల్లింగ్ పరంగా ఇటీవల కాలంలో కృత్రిమ మేధ కీలకంగా మారుతోంది. మానవ ప్రమేయాన్ని తగ్గించి రోబోలు, వర్చువల్ టెక్నాలజీల సహకారంతో కార్యకలాపాలను నిర్వహించడం కృత్రిమ మేధ ప్రత్యేకత. దీనివల్ల కంపెనీలపై ఆర్థిక భారం తగ్గుతుంది. ఈ కారణంగానే కృత్రిమ మేధ విస్తృతమవుతోంది.

మెషీన్ లెర్నింగ్



పనిలో మానవ ప్రమేయాన్ని తగ్గించే మరో విధానం మెషీన్ లెర్నింగ్. ఇందులో టాస్క్ నిర్వహణ కోణంలో సంబంధిత మెషీన్‌కు అవసరమైన ప్రోగ్రామ్‌ను రూపొందించి.. సొంతంగా డేటా సేకరణ, విశ్లేషణ వంటి కార్యకలాపాలు నిర్వహించేలా మెషీన్లను తీర్చిదిద్దుతారు. దీనికి తగిన ప్రోగ్రాములు, చిప్‌ల రూపకల్పన, సర్క్యూట్ల డిజైన్లు అవసరం. అందువల్లే ఇప్పుడు ఈ కోణంలో నిపుణుల అవసరం పెరుగుతోంది. కాబట్టి రీ–స్కిల్లింగ్ కోణంలో ఫ్రెషర్స్ నుంచి సీనియర్ లెవల్ ఉద్యోగుల వరకు మెషీన్ లెర్నింగ్‌పై అవగాహన పెంపొందించుకోవడం తప్పనిసరి.

- పై అంశాలతోపాటు రీ–స్కిల్లింగ్ కోణంలో డేటా అనలిటిక్స్, బిగ్ డేటా, డేటా మేనేజ్‌మెంట్, క్లౌడ్ కంప్యూటింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

సర్టిఫికేషన్స్

రీ–స్కిల్లింగ్‌లో భాగంగా కొన్ని సంస్థలు ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. కానీ, ఫ్రెషర్స్‌కు ఈ సౌకర్యం ఉండదు. కాబట్టి వారంతా వివిధ సంస్థలు ఆఫర్ చేస్తున్న ఆన్‌లైన్ సర్టిఫికేషన్స్‌ను అందిపుచ్చుకోవాలి. తద్వారా రీ–స్కిల్లింగ్ బాటలో ముందడుగు వేయొచ్చు. ప్రస్తుతం ఐబీఎం, సిస్కో, హెచ్‌పీ, జావా, శాప్ తదితర సంస్థలు నూతన నైపుణ్యాలపై సర్టిఫికేషన్స్ ఆఫర్ చేస్తున్నాయి. ఫ్రెషర్స్ వీటిని వినియోగించుకోవాలి.

> **ఆన్‌లైన్ వనరులను సద్వినియోగం చేసుకోవాలి**
>
> రీ–స్కిల్లింగ్ పరంగా ఆన్‌లైన్ వనరులను సద్వినియోగం చేసుకోవాలి. వాస్తవానికి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) అంచనాల ప్రకారం అనేక విభాగాల్లో నిపుణుల కొరత మిలియన్లలో ఉంది. ఐటీ, సాఫ్ట్‌వేర్ విభాగాల్లో మాత్రం న్యూ స్కిల్స్, రీ–స్కిల్స్ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దీన్ని గమనించి అభ్యర్థులు తమను తాము తీర్చిదిద్దుకోవాలి.
>
> – రమేశ్ లోగనాథన్,
> ప్రోగ్రెసివ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్.

భారత ఆర్థిక వ్యవస్థ సవాళ్లు-అవకాశాలు

జనరల్ ఎస్సే



కేంద్ర ప్రభుత్వం అవలంబించిన భగవతి-పనగరియా నమూనా విఫలమైనందువల్ల దేశంలో పెట్టుబడులు, వృద్ధి, ఉపాధి క్షీణించాయి. తద్వారా అసమానతలు పెరిగాయి. బ్యాంకింగ్ రంగంలో రికవరీ కాని రుణాలు పెరగడం వల్ల ఆ రంగం సంక్షోభం ఎదుర్కొంటోంది. దేశంలో నిరుద్యోగిత క్రమంగా పెరుగుతోంది. 2007-08లో భారత్‌లో పెట్టుబడి రేటు జీడీపీలో 38 శాతం కాగా ప్రస్తుతం అది 30 శాతానికి పడిపోయింది. బ్యాంకింగ్ వ్యవస్థ ఇచ్చిన మొత్తం రుణాల్లో నిరర్థక ఆస్తులు 9 శాతం కాగా, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఇది 12 శాతంగా ఉంది. అభివృద్ధి చెందిన దేశాలు తమ బడ్జెట్‌లో పరిశోధన, అభివృద్ధి (Research and Development)పై 4.5 శాతం వ్యయం చేస్తుండగా, భారత్‌లో ఈ మొత్తం ఒక శాతం కంటే తక్కువగా నమోదైంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో దేశ ఆర్థికరంగంలోని సవాళ్లు, అవకాశాలపై విశ్లేషణ..

గత 70 ఏళ్ల కాలంలో ఆర్థిక వ్యవస్థను ఆధునికీకరించడంతో పాటు పేదరిక తీవ్రతను తగ్గించడంలో భారత్ విజయవంతమైంది. దేశంలో అధిక జనాభా జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో సఫలమైంది. గత దశాబ్దంలో ప్రపంచ ఆర్థిక వృద్ధి పెరుగుదలలో భారత్ కీలక పాత్ర పోషించింది. 2005 తర్వాతి కాలంలో ప్రపంచ ఆర్థిక కార్యకలాపాల పెరుగుదలలో భారత్ వాటా 10 శాతం. 2000 సంవత్సరంతో పోల్చితే ప్రస్తుతం తలసరి స్థూల దేశీయోత్పత్తి (పీపీపీ ప్రకారం) పెరుగుదల మూడు రెట్లు. ఇన్ని సానుకూలతలు కనిపించినప్పటికీ, ఇదే కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ ఆర్థిక అసమానతలను చవిచూసింది. రాష్ట్రాల మధ్య, గ్రామీణ–పట్టణ ప్రాంతాల మధ్య ఆదాయ తేడాల్లో పెరుగుదల నమోదైంది. దేశంలో తీవ్ర పేదరిక జనాభాలో దాదాపు 50 శాతం మంది అయిదు రాష్ట్రాల్లోనే ఉన్నారు. ఇటీవల కాలంలో వృద్ధిరేటు మందగించింది. దాంతోపాటు అనేక సవాళ్లు అపరిష్కృతంగా మిగిలిపోయాయి. యువ జనాభా అధికంగా ఉన్న భారతదేశం కోట్ల మందికి నాణ్యతతో కూడిన ఉపాధి అందించడంలో సమస్యలు ఎదుర్కొంటోంది. వ్యవసాయ ఉత్పాదకత, మానవ వనరుల సామర్థ్యం తక్కువగా ఉండటంతో పాటు అసంఘటిత పారిశ్రామిక కార్యకలాపాల్లో పెరుగుదల తదితర అంశాలు వృద్ధిపై ప్రభావం చూపుతాయి. దీంతో ఆర్థిక సమస్యలు పెరుగుతాయి. ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే ప్రాథమిక, ఉన్నత విద్య; పట్టణ పరిపాలన, గృహకల్పన, పరపతి, అవస్థాపనా సౌకర్యాల కల్పన, శ్రామిక మార్కెట్ తదితరాల్లో కొత్త సంస్కరణలకు ప్రాధాన్యమివ్వాలి. అప్పుడే దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను అవకాశాలుగా మార్చుకునేందుకు వీలవుతుంది.

సవాళ్లు

- భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయరంగ పాత్ర ప్రధానమైంది. గ్రామీణ కుటుంబాల్లో 58 శాతానికిపైగా కుటుంబాలకు వ్యవసాయమే జీవనోపాధి. వ్యవసాయరంగంలో ఒడిదుడుకుల కారణంగా జాతీయాదాయంలో దీని వాటా క్రమంగా తగ్గుతోంది. 1990–91లో స్థూల సమకూరిన విలువ (జీవీఏ)లో వ్యవసాయ రంగం వాటా 33 శాతం కాగా, 2016–17లో 13.8 శాతానికి తగ్గింది. ఆహార ధాన్యాల సాగు విస్తీర్ణంలో వృద్ధి ఇటీవలి కాలంలో స్తంభించింది.
- నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్‌వో) 70వ రౌండు గణాంకాల ప్రకారం 75 శాతం గ్రామీణ కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడగా, వారిలో 52 శాతం మంది రుణగ్రస్థులు. రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల్లో 92.9 శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 37.2 శాతం కుటుంబాలు రుణభారంతో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో వ్యవసాయ పెట్టుబడులు తగ్గి, అది చివరకు ఆహారభద్రత లోపించడానికి దారితీస్తుంది.
- ఎన్ఎస్ఎస్‌వో 70వ రౌండ్ గణాంకాల ప్రకారం రాష్ట్రాలవారీగా చూసినప్పుడు ఉపాంత రైతుల్లో 47–85 శాతం ఉపాంత రైతులు, 35 శాతం చిన్న రైతులు సంస్థాపరం కాని పరపతిపై ఆధారపడినట్లు అంచనా. పంటలబీమా పరిధిలోని రైతుల సంఖ్య కూడా తక్కువే. జాతీయ స్థాయిలో 26 శాతం పంట విస్తీర్ణం మాత్రమే బీమా పరిధిలో ఉంది. నీటి పారుదల్లోనూ రాష్ట్రాల మధ్య అధిక అసమానతలున్నాయి. సగటు కమతం పరిమాణం తగ్గుతున్నందువల్ల వ్యవసాయ యాంత్రీకరణ ప్రయోజనాలు రైతులకు అందడం లేదు.
- బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికాలతో పోల్చితే పట్టణీకరణలో భారత్ వెనకబడిందని చెప్పొచ్చు. 1960–1988 మధ్యకాలంలో చైనాతో పోల్చితే భారత్‌లో పట్టణ జనాభా అధికం. తర్వాతి కాలంలో పట్టణీకరణలో చైనా.. భారత్‌ను అధిగమించింది. 2016లో చైనాలో పట్టణ జనాభా 56.77 శాతం కాగా, భారత్‌లో అది 33.13 శాతంగా నమోదైంది. పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో భౌతిక, సాంఘిక అవస్థాపనలపై ప్రభుత్వ రంగ పెట్టుబడులు పెరగాల్సిన అవసరముంది.
- 2010, మార్చి – 2017, మార్చి మధ్యకాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.88,988 కోట్ల మేర రైతుల రుణమాఫీ చేశాయి. ఇటీవల కాలంలో అనేక రాష్ట్రాల్లో రైతుల రుణమాఫీ కోసం డిమాండ్లు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితి రాష్ట్రాల ఖజానాపై అదనపు భారం మోపి, అభివృద్ధి వ్యయం తగ్గుదలకు దారితీస్తుంది.
- ఆరోగ్య సంరక్షణ లభ్యత, నాణ్యత సూచీకి సంబంధించి మొత్తం 195 దేశాల్లో భారత్ 154వ స్థానం పొందింది. 1990తో పోల్చితే 2015 నాటికి ఈ సూచీ నిర్మాణత మెరుగుపడినప్పటికీ ఇప్పటికీ స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్య వసతులు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటోంది. నివారింపదగిన రోగాల (Preventable Disease) వల్ల దేశంలో ఏడాదికి 6,66,000 మంది పిల్లలు మరణిస్తున్నట్లు యునిసెఫ్ అంచనా వేసింది. ఆత్మహత్య మరణాల రేటు ప్రతి వెయ్యిమందికి 15.7గా నమోదైంది.
- దేశంలో సేవారంగం వృద్ధి ఇంజన్‌గా రూపొందినప్పటికీ ఇటీవలి కాలంలో వస్తుసేవల పన్ను (జీఎస్టీ), పెద్దనోట్ల రద్దు లాంటి విధానాల అమలు వల్ల సేవారంగంలో వృద్ధి మందగించింది.

అవకాశాలు

- 2025 నాటికి భారతదేశంలో పది లక్షలకు పైగా జనాభా ఉన్న 69 నగరాలు ఉండగలవని అంచనా. అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధితో పాటు ఆర్థిక వృద్ధి పెంపునకు పట్టణీకరణ దోహదచేస్తుంది. ముంబయి 2030 నాటికి వినియోగానికి సంబంధించి 245 బిలియన్ డాలర్ల విలువను కలిగి మలేషియాను అధిగమించగలదు. మార్కెట్ పరిమాణానికి సంబంధించి బెంగళూరు.. స్లొవేకియాను, హైదరాబాద్.. మొరాకోను, అహ్మదాబాద్.. వియత్నాంను, ఢిల్లీ.. ఫిలిప్పీన్స్‌ను అధిగమించగలవు. 2030 నాటికి దేశంలోని ఈ నాలుగు నగరాల సగటు వినియోగం 80 నుంచి 175 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా. అయితే సుస్థిర వృద్ధి సాధనకోసం ఈ నగరాలు ప్రజలకు అన్ని విధాలుగా నివాసయోగ్య ప్రాంతాలుగా రూపుదిద్దుకోవాలి.
- దేశంలో పెరుగుతున్న పట్టణీకరణ స్వదేశీ, విదేశీ వ్యాపారాల పెరుగుదలకు దోహదపడుతూ మూలధనం, సాంకేతిక పరిజ్ఞానం, పట్టణ వినియోగదారుల డిమాండ్‌కు సరిపడా వస్తుసేవలను అందించగలవు.
- చైనాతో పోల్చితే భారత తయారీరంగం వెనుకంజలో ఉన్నప్పటికీ పెట్టుబడులతో పాటు ఉపాధి కల్పనకు తగిన వాతావరణం ఉంది. సంస్కరణలతో పాటు అవస్థాపనారంగంపై ప్రభుత్వరంగ పెట్టుబడులు కారణంగా తయారీరంగ వ్యాపారాల్లో వృద్ధికి అనుకూల పరిస్థితులు ఉన్నాయి.
- దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)కి మహిళలు 17 శాతం వాటాను అందిస్తున్నారు. మొత్తం పనిచేసే శ్రామికశక్తిలో 24 శాతం మేర (ప్రపంచంలో మొత్తం పనిచేసే శ్రామికశక్తిలో మహిళల వాటా 40 శాతం) భాగస్వామ్యం కలిగి ఉన్నారు. ఇలాంటి పరిస్థితులను విశ్లేషిస్తే వచ్చే పదేళ్లలో దేశంలో కీలక సామర్థ్య శక్తిగా మహిళా శ్రామికశక్తి రూపుదిద్దుకోగలదని అంచనా. దేశంలో విద్య, ఆర్థిక రంగం, డిజిటల్ ఇన్‌క్లూజన్‌లో లింగ అసమానతను తగ్గించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మహిళా సాధికారతకు మార్గం సుగమం అవుతుంది.
- బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపు, భారత పరిశ్రమల సమాఖ్య నివేదిక ప్రకారం ఉపాధిరంగంలో తీవ్రంగా ఉన్న అసమానతలను అధిగమించేందుకు వచ్చే 20 ఏళ్లలో 12–15 మిలియన్ల మందికి వ్యవసాయేతర ఉపాధి కల్పించాల్సి ఉంది. ఇటీవలి డెలాయిట్ నివేదిక ప్రకారం భారత సామర్థ్య పనిచేసే శ్రామికశక్తి (workforce) 885 మిలియన్లు కాగా, అది 2050 నాటికి 1.08 బిలియన్లకు చేరుతుంది. 1991 నుంచి 2013 మధ్యకాలంలో పనిచేసే వయోవర్గ జనాభా 300 మిలియన్లు పెరిగారు.
- ఆర్థిక సరళీకరణ విధానాల కాలంలో ట్రికిల్ డౌన్ ప్రభావం గత 25 ఏళ్ల కాలంలో పేదరిక స్థాయిని తగ్గించేందుకు కారణమైంది. భారత్‌లో అధికారిక పేదరిక రేటు 1994లో 45 శాతం కాగా, 2011లో 21.9 శాతానికి తగ్గింది. మరోవైపు దేశంలో 50 శాతానికి పైగా ప్రజలు కనీస అవసరాలైన పౌష్టికాహారం, శుభ్రమైన తాగునీరు, పారిశుద్ధ్యం, ఇంధనం, గృహవసతి, విద్య, ఆరోగ్య సంరక్షణ పొందలేక పోతున్నారు. ఈ అసమానతలను రూపుమాపడం ద్వారా వృద్ధి పథంలో పయనించొచ్చు. ఈ క్రమంలో ఉపాధి కల్పన, వృద్ధిని పెంపొందించే పెట్టుబడులు, వ్యవసాయ ఉత్పాదకత పెంపు, నవకల్పనలకు సంబంధించి విధాన రూపకర్తలు తగిన అజెండా రూపొందించుకోవాలి. కనీస అవసరాల కల్పనలో ప్రైవేటు రంగం పాత్ర కూడా ప్రధానమైనది.



డా॥ తమ్మా కోటిరెడ్డి
ప్రొఫెసర్, ఐబీఎస్,
హైదరాబాద్.

ప్రజల్లో మార్పు రావాలి: కేటీఆర్

లేకుంటే ఎన్ని కోట్లు ఖర్చు చేసినా వృథా ● నీటి సంరక్షణకు త్వరలో 'జలం-జీవం' ● 'మన నగరం' కార్యక్రమంలో ఐటీ మంత్రి


మన నగరం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కోటికిపైగా జనాభా ఉన్న నగరంలో ప్రజలందరి భాగస్వామ్యం లేనిదే ఏ పనీ విజయవంతం కాదని, ప్రతి ఒక్కరూ మన నగరం అనుకునే భావనతో పనిచేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని మునిసిపల్, ఐటీ శాఖల మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. మహా నగరంలో నీటి సంరక్షణ కోసం త్వరలో 'జలం- జీవం' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. నీటికి ఇక్కట్లు లేకుండా ఉండాలంటే నీటి సంరక్షణ తప్పనిసరి అన్నారు. దీని కోసం ఆర్నెల్లపాటు ఈ అంశంపై అందరికీ అవగాహన కల్పించి, ఆ తర్వాత నీటి సంరక్షణ చర్యలు చేపట్టని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం జీహెచ్ఎంసీ వెస్ట్ జోన్ మియాపూర్‌లో నిర్వహించిన 'మన నగరం' కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... నగరంలో 300 చ.మీ.లు దాటిన భవనాలకు ఇంకుడు గుంతలు లేకుంటే ఓసీ ఇవ్వరాదని ఉన్నా అది అమలు కావడం లేదన్నారు. ఇకపై ఈ పరిస్థితి లేకుండా ఇంకుడు గుంతలు నిర్మించని భవన యజమానితోపాటు, సంబంధిత అధికారికీ జరిమానా విధిస్తామన్నారు. వంద అపార్ట్‌మెంట్లు దాటిన గేటెడ్ కమ్యూనిటీకి ఎస్టీపీ తప్పనిసరి అన్నారు. నీటిని సంరక్షించుకోకుంటే భవిష్యత్‌లో ఇక్కట్లు తప్పవని హెచ్చరించారు. ఇంకుడు గుంతలపై ప్రజలను చైతన్యపరిచేందుకు జోనల్, డిప్యూటీ కమిషనర్లు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.

రూ.3,100 కోట్లతో భూగర్భ డ్రైనేజీ..

గ్రేటర్‌లో కలసిన శివారు మునిసిపాలిటీల్లో రూ.3,100 కోట్లతో భూగర్భ డ్రైనేజీని సంవత్సర కాలంలో చేపడతామన్నారు. ప్రభుత్వం ఎన్ని కోట్లు ఖర్చు చేసినా ప్రజల్లో మార్పురానిదే పరిస్థితి మారదంటూ నాలాల్లో చెత్త, ప్లాస్టిక్ కవర్లను వేస్తుండటాన్ని ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్థానిక సర్కిల్‌లో ఆయా రంగాల్లో ఉత్తమంగా నిలిచిన ఉత్తమ కాలనీల ప్రతినిధులు, స్వచ్ఛ సేవలు అందించిన వారికి మంత్రి కేటీఆర్ పురస్కారాలు అందజేశారు. అంతకు ముందు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మా ఇంటి నేస్తం'లో భాగంగా వీధి కుక్క పిల్లల దత్తత కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడండి...

సర్కిల్‌లోని పార్కు స్థలాలు కబ్జా అవుతున్నాయని, వాటిని కాపాడాలని మంత్రిని సర్కిల్ వాసులు కోరారు. శంకర్‌నగర్ కాలనీలో ఎంతో ప్రభుత్వ భూమి ఉందని, సర్వే చేయించి, ప్రజోపయోగార్థం వినియోగించాలని మంత్రి దృష్టికి తెచ్చారు. తమ ఇబ్బందుల పరిష్కారానికి అవసరమైన రోడ్లు, బ్రిడ్జిలు, పార్కులు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

దేశంలో రెండో ఉత్తమ పోలీస్ స్టేషన్ పంజగుట్ట

రాజ్‌నాథ్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ ● తొలిస్థానంలో కోయంబత్తూరు, మూడో స్థానంలో యూపీలోని గుడుంబా



రాజ్‌నాథ్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ రవీందర్

సాక్షి, హైదరాబాద్: దేశంలో రెండో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా హైదరాబాద్ కమిషనరేట్‌లోని పంజగుట్ట పోలీస్ స్టేషన్ అవార్డు దక్కించుకుంది. కేంద్ర హోంశాఖ, క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇటీవల దేశవ్యాప్తంగా మోడల్ పోలీస్ స్టేషన్లపై సర్వే నిర్వహించింది. ఇందులో భాగంగా వందకు పైగా స్టేషన్లను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ల పనితీరు, దర్యాప్తు.. ఇలా 140 ప్రమాణాలను పరిగణనలోకి తీసుకున్నారు. వీటిలో పది పోలీస్ స్టేషన్లతో తుది జాబితా రూపొందించి వాటిలోంచి మూడు ఉత్తమ స్టేషన్లను ఎంపిక చేశారు. తమిళనాడులోని కోయంబత్తూర్ పోలీస్ స్టేషన్ మొదటి స్థానంలో, ఉత్తరప్రదేశ్‌లోని లక్నో కమిషనరేట్ పరిధిలోని గుడుంబా పోలీస్ స్టేషన్ మూడో స్థానంలో నిలిచాయి. శనివారం మధ్యప్రదేశ్ టెకన్‌పూర్‌లోని బీఎస్ఎఫ్ క్యాంపులో ప్రారంభమైన ఆలిండియా డీజీపీల సదస్సులో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ పోలీస్ స్టేషన్లకు ట్రోఫీలను అందజేశారు. డీజీపీ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ రవీందర్ అవార్డును స్వీకరించారు. టెక్నాలజీ, స్మార్ట్ పోలీసింగ్‌లో తెలంగాణ దూసుకెళ్తోందని రాజ్‌నాథ్‌సింగ్ ఈ సందర్భంగా ప్రశంసించినట్టు తెలిసింది.

సీపీఎస్ కోసం కేంద్రంతో పోరాడుదాం: ఎంపీ కవిత



నిజామాబాద్ నాగారం (నిజామాబాద్ అర్బన్): ఉద్యోగులకు సంబంధించి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానం అమలుకు కేంద్రంతో పోరాడుదామని ఎంపీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో టీఎన్జీవోస్ నాన్‌గెజిటెడ్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర సాధనలో ఉద్యోగాలను సైతం లెక్క చేయకుండా ఉద్యోగులు ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. టీఎన్జీవోస్ సంఘానికి టీఆర్ఎస్‌కు వీడదీయరాని బంధం ఉందన్నారు. సీఎం కేసీఆర్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తూ అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. కేంద్ర పరిధిలో ఉన్న సీపీఎస్ రద్దుకు కలసి ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో చురుకైన పాత్ర పోషించాలని ఎంపీ కవిత సూచించారు.

24 గంటల విద్యుత్‌పై పునరాలోచన: ఎమ్మెల్యే గాదరి

మోత్కూరు: వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం పునరాలోచన చేస్తోందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుల నుంచి వచ్చే స్పందన, సలహాలు, సూచనలను బట్టి సంక్రాంతి పండగ వరకు నిరీక్షించి పునరాలోచన చేద్దామని ఇటీవల ఎమ్మెల్యేలంతా కలసిన సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారని తెలిపారు. బోర్ల వద్ద ఆటోమేటిక్ స్టార్టర్లపై ఏ విధంగా వ్యవహరించాలన్న దానిపైనా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఆగస్టు 15లోగా 1.07 లక్షల ఖాళీల భర్తీ

డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి



సాక్షి, మహబూబాబాద్: గతేడాది స్వాతంత్య్ర దినోత్సవం రోజున ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చెప్పినట్టుగా ఖాళీగా ఉన్న 1.07 లక్షల పోస్టులను వచ్చే ఆగస్టు 15లోగా భర్తీ చేస్తామని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి స్పష్టం చేశారు. మహబూబాబాద్‌లో రూ.60 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కును శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచితంగా నిర్వహిస్తోన్న కానిస్టేబుల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటికే 20 వేలకు పైగా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేశామన్నారు. పోలీసు కానిస్టేబుళ్ల భర్తీకి ఫిబ్రవరి మొదటి వారంలో రెండో నోటిఫికేషన్, ఏప్రిల్‌లో రాత పరీక్షలు ఉంటాయన్నారు. స్మార్ట్ ఫోన్ల వల్ల నేడు అబ్బాయిలు వెనుకబడిపోయి, ఏ పరీక్షల్లోనైనా అమ్మాయిలే ముందంజలో ఉంటున్నారని పేర్కొన్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే అమ్మాయిలు ఉద్యోగాలు, అబ్బాయిలు ఇంట్లో వంట చేయాల్సిన రోజులు దగ్గరలోనే ఉన్నాయని చమత్కరించారు. కార్యక్రమంలో ఎంపీ సీతారాం నాయక్, ఎమ్మెల్యేలు బి.శంకర్‌నాయక్, కోరం కనకయ్య, ఎస్పీ ఎన్.కోటిరెడ్డి, జేసీ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక దందా వెనుక సర్కార్ పెద్దలు

'చలో నేరెళ్ల' పాదయాత్ర ముగింపు సభలో కోదండరాం


సభలో మాట్లాడుతున్న కోదండరాం. చిత్రంతో చాడ, తమ్మినేని తదితరులు

సిరిసిల్ల రూరల్/ సిద్దిపేట: సర్కార్‌లోని పెద్దల బంధువులే ఇసుక దందా నిర్వహిస్తున్నారని జేఏసీ చైర్మన్ కోదండరాం ఆరోపించారు. నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో జేఏసీ, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట జిల్లా నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నేరెళ్లలో సంఘీభావ సభలో కోదండరాం మాట్లాడారు. ఆంధ్రా దోపిడీదారుల నుంచి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం మాఫియా చేతుల్లోకి వెళ్లిందని, తెలంగాణలో మాఫియా రాజ్యం కొనసాగుతోందని ధ్వజమెత్తారు. నేరెళ్ల ఘటన జరిగి ఆర్నెల్లు గడుస్తున్నా బాధ్యులైన పోలీసులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. ఇసుక దందా పేరిట జరిగేవన్నీ ప్రభుత్వ హత్యలేనని, ఇప్పటి వరకు 42 హత్యలు జరిగాయని ఆరోపించారు. సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, టీఆర్ఎస్ సర్కారు పతనం నేరెళ్ల నుంచే ప్రారంభమైందన్నారు. ఈ సందర్భంగా నేరెళ్ల బాధితులు తమ గోడును నాయకుల ఎదుట వెళ్లబోసుకున్నారు.

అప్పుల బెంగతో ఆగిన నేతన్న గుండె

సిరిసిల్ల టౌన్: అప్పు తీర్చే మార్గం లేక తీవ్ర మనోవేదనకు గురైన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం బీవైనగర్ నేత కార్మికుడు మేర్గ నాంపల్లి (58) గుండె పోటుతో మృతి చెందాడు. ఏడేళ్ల క్రితం వరకు భీవండీలో పని చేసిన నాంపల్లి.. ప్రస్తుతం సిరిసిల్లలో సాంచాలు నడుపుతున్నాడు. భార్య అంజమ్మ బీడీలు చుడుతోంది. వీరి ఆదాయంతోనే ముగ్గురు ఆడపిల్లల పెళ్లిళ్లు చేశారు. గతేడాది చిన్న కూతురు వివాహం కోసం చేసిన అప్పు తీర్చే మార్గం లేక కొద్ది రోజులుగా నాంపల్లి మనస్తాపం చెందాడు. శుక్రవారం రాత్రి సాంచాలు నడుపుతూ కుప్పకూలిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం 7-1-2018

నిలిపాడు


తొలుత బ్యాటుతో నిలిచాడు. భీకర పేస్‌ను కాచుకున్నాడు. ప్రత్యర్థి సహనాన్ని పరీక్షించాడు. వీలుచిక్కితే ఎదురుదాడికి దిగాడు. జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. అనంతరం బంతితోనూ ప్రతాపం చూపాడు. రెండు వికెట్లు తీసి భారత్‌ను పోటీలోకి తెచ్చాడు. కేప్‌టౌన్ టెస్టులో శనివారం హార్దిక్ పాండ్యా ప్రతాపమిది. బ్యాట్స్‌మన్‌గా వీరోచిత పోరాటం చేసి, బౌలర్‌గా సఫారీ ఓపెనర్లను పెవిలియన్‌కు పంపి రెండో రోజు ఆటనంతా తనచుట్టూనే తిప్పుకొన్నాడీ యువ ఆల్‌రౌండర్. పాండ్యా తెగువతో టీమిండియా తలెత్తుకోగలిగింది. ఇక చేయాల్సింది సమష్టిగా పోరాడి అతడి ఆటకు మరింత విలువ చేకూర్చడమే.

బ్యాట్‌తో... బంతితో...

హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండ్ ప్రదర్శన

భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 209

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 65/2



పాండ్యా

కేప్‌టౌన్

ప్రత్యర్థి ధాటికి బెంబేలెత్తి, ఒక దశలో పూర్తిగా తేలిపోతుందనుకున్న భారత్ పర్వాలేదనిపించే ప్రదర్శనతో పరువు దక్కించుకుంది. పేసర్ భువనేశ్వర్ (86 బంతుల్లో 25; 4 ఫోర్లు) అండగా యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా (95 బంతుల్లో 93; 14 ఫోర్లు, 1 సిక్స్) దూకుడైన ఆట కనబర్చడంతో కేప్‌టౌన్ టెస్టుపై టీమిండియాకు ఆశలు మిగిలాయి. వీరిద్దరి పోరాటం కారణంగా భారత్ 209 పరుగులు చేయగలిగింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన దక్షిణాఫ్రికాను హార్దిక్ 2 వికెట్లు తీసి దెబ్బతీశాడు. రెండో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 2 వికెట్లకు 65 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆమ్లా (4 బ్యాటింగ్), నైట్‌వాచ్‌మన్ రబడ (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఓవరాల్‌గా సఫారీ జట్టు 142 పరుగుల ఆధిక్యంలో ఉంది. మూడో రోజు ప్రత్యర్థిని సాధ్యమైనంత తక్కువకు కట్టడి చేయడంపైనే ఈ మ్యాచ్‌లో భారత్ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

అతి నిదానంగా...

ఓవర్‌నైట్ స్కోరు 28/3తో ఆట ప్రారంభించిన భారత ఇన్నింగ్స్ తొలి సెషన్ అతి నెమ్మదిగా సాగింది. పుజారా (26), రోహిత్ శర్మ (59 బంతుల్లో 11) పరుగులు చేయడం కంటే వికెట్ కాపాడుకోవడానికే ప్రాధాన్యం ఇచ్చారు. ఈ క్రమంలో ఫిలాండర్ వరుసగా అయిదు ఓవర్లు మెయిడిన్లు వేశాడు. అతడు, రబడ కలిసి రోహిత్‌ను తీవ్రంగా పరీక్షించారు. నిలదొక్కుకునేందుకు గంటపాటు శ్రమించిన రోహిత్ చివరకు రబడకే వికెట్ల ముందు దొరికిపోయాడు. ఈ నిర్ణయంపై సమీక్షకు వెళ్లినా ఫలితం లేకపోయింది. అనంతరం వచ్చిన అశ్విన్ రెండు ఫోర్లు కొట్టి స్కోరును కొంత ముందుకు కదిలించాడు. ఈ సెషన్‌లో 25 ఓవర్లలో కేవలం 48 పరుగులు మాత్రమే వచ్చాయి. 76/4తో భారత్ లంచ్‌కు వెళ్లింది.

అందరూ వెంటవెంటనే...

లంచ్ తర్వాతి ఓవర్ తొలి బంతికే భారీ షాక్ తగిలింది. ఫిలాండర్ బౌలింగ్‌లో స్లిప్‌లో డుప్లెసిస్‌కు క్యాచ్ ఇచ్చి పుజారా నిష్క్రమించాడు. స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్ అంతా అవుటై... 200 పరుగులపైగా వెనుకబడి... ప్రతిదాడి తప్ప మరో అవకాశం లేని ఈ స్థితిలో వచ్చిన పాండ్యా తొలి బంతినే బౌండరీకి తరలించాడు. స్టెయిన్ బౌలింగ్‌లో అంపైర్ అవుటిచ్చినా సమీక్ష కోరి మరీ బయటపడ్డాడు. అయితే కొద్దిసేపటికే ఫిలాండర్ బౌలింగ్‌లో డికాక్ పట్టిన డైవింగ్ క్యాచ్‌కు అశ్విన్ (12) వెనుదిరిగాడు. సాహాను అద్భుత బంతితో స్టెయిన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. దీనిపై రివ్యూ కోరినా నిరాశే ఎదురైంది. టీ అనంతరం మోర్కెల్... భువీని వెనక్కు పంపి 99 పరుగుల 8వ వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. దీంతో పాండ్యా మరింత దూకుడుగా ఆడే ప్రయత్నం చేశాడు. అయితే అతడి అద్భుత ఇన్నింగ్స్‌కు రబడ ముగింపు పలికాడు. భారీ షాట్ కొట్టే యత్నంలో టాప్ ఎడ్జ్ తాకిన బంతిని డికాక్ ఒడిసి పట్టాడు. బుమ్రా (2)నూ అతడే అవుట్ చేయడంతో 209 పరుగుల వద్ద భారత ఇన్నింగ్స్ ముగిసింది. దక్షిణాఫ్రికాకు 77 పరుగుల ఆధిక్యం దక్కింది. రెండో ఇన్నింగ్స్‌ను సఫారీ ఓపెనర్లు మర్‌క్రమ్ (43 బంతుల్లో 34; 7 ఫోర్లు), ఎల్గర్ (54 బంతుల్లో 25; 4 ఫోర్లు) ఆశావహంగా ప్రారంభించారు. నిలకడగా ఆడుతూ 52 పరుగులు జోడించారు. కాసేపట్లో రోజు ముగుస్తుందనగా బౌలింగ్‌కు వచ్చిన పాండ్యా (2/17) వీరిద్దరినీ అవుట్ చేశాడు.

భువీ అండగా...

92/7... మిగిలింది హార్దిక్ ఒక్కడే. మహా అయితే మరో 20, 30 పరుగులు చేయగలదేమోనన్న స్థితి నుంచి భారత్ తేరుకుందంటే పాండ్యా, భువనేశ్వర్‌ల విలువైన భాగస్వామ్యమే కారణం. పరిస్థితిని గ్రహించి ఓవైపు పాండ్యా బ్యాట్ ఝుళిపిస్తూ అర్ధశతకం పూర్తి చేసుకోగా... భువీ అతడికి పూర్తి అండగా నిలిచాడు. స్టెయిన్, రబడ, మోర్కెల్‌లను ఎదుర్కొంటూ 34వ బంతికి సింగిల్‌తో పరుగుల ఖాతా తెరిచాడు. కొద్దిసేపటికి వీరిద్దరి మధ్య 50 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. అందులో పాండ్యావే 47 పరుగులుండటం విశేషం. పేసర్లతో కావడం లేదని 56వ ఓవర్లో స్పిన్నర్ మహరాజ్‌ను బౌలింగ్‌కు దింపగా సిక్స్, ఫోర్‌తో హార్దిక్ విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో డికాక్ స్టంపింగ్ అవకాశాన్ని చేజార్చాడు. మరోవైపు భువీ కూడా బ్యాట్‌కు పనిచెప్పాడు. రబడ, స్టెయిన్‌ల బౌలింగ్‌లో నాలుగు ఫోర్లు కొట్టాడు. 185/7తో భారత్ టీ విరామానికి వెళ్లింది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 286; **భారత్ తొలి ఇన్నింగ్స్:** విజయ్ (సి) ఎల్గర్ (బి) ఫిలాండర్ 1; ధావన్ (సి అండ్ బి) స్టెయిన్ 16; పుజారా (సి) డు ప్లెసిస్ (బి) ఫిలాండర్ 26; కోహ్లి (సి) డికాక్ (బి) మోర్కెల్ 5; రోహిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రబడ 11; అశ్విన్ (సి) డికాక్ (బి) ఫిలాండర్ 12; పాండ్యా (సి) డికాక్ (బి) రబడ 93; సాహా (ఎల్బీడబ్ల్యూ) (బి) స్టెయిన్ 0; భువనేశ్వర్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 25; షమీ (నాటౌట్) 4; బుమ్రా (సి) ఎల్గర్ (బి) రబడ 2; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (73.4 ఓవర్లలో ఆలౌట్) 209.**

వికెట్ల పతనం: 1–16, 2–18, 3–27, 4–57, 5–76, 6–81, 7–92, 8–191, 9–199, 10–209.

బౌలింగ్: ఫిలాండర్ 14.3–8–33–3, స్టెయిన్ 17.3–6–51–2, మోర్కెల్ 19–6–57–2, రబడ 16.4–4–34–3, కేశవ్ మహరాజ్ 6–0–20–0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మర్‌క్రమ్ (సి) భువనేశ్వర్ (బి) పాండ్యా 34; ఎల్గర్ (సి) సాహా (బి) పాండ్యా 25; రబడ (బ్యాటింగ్) 2; ఆమ్లా (బ్యాటింగ్) 4; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 65.**

వికెట్ల పతనం: 1–52, 2–59.

బౌలింగ్: భువనేశ్వర్ 6–3–16–0, బుమ్రా 4–0–14–0, షమీ 5–1–15–0, పాండ్యా 4–0–17–2, అశ్విన్ 1–0–3–0.

స్టెయిన్‌కు గాయం



దక్షిణాఫ్రికా స్టార్ పేసర్ డేల్ స్టెయిన్ మడమ గాయం కారణంగా రెండో రోజు టీ విరామం అనంతరం బౌలింగ్‌కు దిగలేదు. గాయం తీవ్రతను తెలుసుకునేందుకు స్కానింగ్ చేయగా... అతనికి నాలుగు నుంచి ఆరు వారాలపాటు విశ్రాంతి అవసరం అని వైద్యులు సూచించారు. దాంతో అతను ఈ టెస్టులో మళ్లీ బౌలింగ్ చేసే అవకాశం లేదు. సిరీస్‌లోని మిగతా రెండు టెస్టుల్లోనూ అతను ఆడేది అనుమానమే.

పాండ్యా కపిల్‌ను తలపిస్తున్నాడు

సునీల్ గావస్కర్

కేప్‌టౌన్‌లో హార్దిక్ పాండ్యా క్లిష్టమైన ఇన్నింగ్స్ ఆడాడు. సహచరులు విఫలమైన చోట అతను విజయవంతమైన తీరు అద్భుతం. కష్టాల్లో ఉన్న భారత జట్టును ఆదుకున్న తీరు చూస్తుంటే కపిల్‌దేవ్ గుర్తొచ్చాడు. ఆయన పుట్టిన రోజు (జనవరి 6)న ఆయన్ని తలపించే ఇన్నింగ్స్ ఆడాడు పాండ్యా. ఇది చూసి ఉంటే కపిల్ కూడా అభినందిస్తారు. బంతితో, బ్యాట్‌తో జట్టును గెలిపించడం వల్లే ఆయన మ్యాచ్ విన్నర్‌గా చరిత్రకెక్కారు. ఇప్పుడు పాండ్యా కూడా విఖ్యాత ఆల్‌

రౌండర్ సాధించిన ఘనతల్లో సగం సాధిస్తే... మరో కపిల్ ఖాయమనుకోవచ్చు. ఇప్పుడైతే అతను నేర్చుకునే దశలో ఉన్నాడు. నిలకడగా ఇదే ప్రదర్శనను కొనసాగిస్తే కచ్చితంగా మరో ఆల్‌రౌండర్‌ను చూస్తాం. ఇది మినహా మిగతా భారత బ్యాట్స్‌మెన్ ప్రదర్శన పేలవంగా ఉంది. ఆఫ్‌స్టంప్‌కు దూరంగా వెళుతున్న బంతులను వెంటాడి మరీ అవుటయ్యారు. ముఖ్యంగా తొలిరోజు పడిన మూడు వికెట్లను అనవసరంగానే సమర్పించుకున్నారు. ఆరంభంలో విజయ్ ఆఫ్‌స్టంప్ బంతుల్ని బాగా ఆడుతున్నట్లే కనిపించాడు. కానీ అదే దిశలో వైడ్‌గా వెళ్లిన బంతిని బాది నిష్క్రమించాడు. ధావన్ అయితే అక్కర్లేని భారీ షాట్‌కు బలై మూల్యం చెల్లించాడు. పుల్ షాట్ ఆడే సందర్భం... సామర్థ్యం లేనపుడు దాన్ని అలా వెళ్లనివ్వాలి. టెస్టుల్లో ముందు క్రీజులో పాతుకుపోయాకే అలాంటి షాట్లపై కన్నేయాలి. కోహ్లి చక్కని డెలివరీకి అవుటైనా... దాన్ని బాగా ఆడే సత్తా ఉన్నవాడే మన కెప్టెన్. రెండో రోజు లంచ్ బ్రేక్ తర్వాత తొలి బంతికే పుజారా సహనం కోల్పోయిన షాట్ ఆడాడు. అశ్విన్ కూడా తేలిగ్గానే వికెట్ సమర్పించుకోగా... రోహిత్ తన పాత బలహీనతకే తలవంచాడు. పాండ్యాకు జతయిన భువనేశ్వర్ తన వికెట్ విలువెంతో గుర్తుంచుకొని ఆడిన తీరు ముచ్చటేస్తుంది. ఇద్దరి సమన్వయం వల్లే విలువైన భాగస్వామ్యం కుదిరింది. వీళ్లిద్దరు చూపిన పట్టుదలే మిగతా వారికి పాఠం.

బాబోయ్... ఈ ఆవులు మాకొద్దు

ప్రభుత్వానికి తిరిగిచ్చిన హరియాణా మహిళా బాక్సర్లు



నీతూ, సాక్షి, జ్యోతి (ఎడమ నుంచి)

రోహ్‌తక్: ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణాలు గెలిచినందుకు ప్రోత్సాహకంగా రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన ఆవులను హరియాణా మహిళా బాక్సర్లు తిరిగి ఇచ్చేశారు. శారీరక పుష్టి కోసం ఆవు పాలు తాగితే మంచిదనే ఉద్దేశంతో బాక్సర్లు జ్యోతి గులియా, సాక్షి చౌదరి, నీతు గాంగాస్‌లకు తలా ఓ ఆవు ఇచ్చారు. ఆ ఆవులు పాలు ఇవ్వకపోగా తమని కుమ్మేస్తున్నాయని, గాయపరుస్తున్నాయని ఆ ముగ్గురు వాపోయారు. దీంతో గత నవంబర్‌లో ప్రభుత్వం ఇచ్చిన ఆవుల్ని తిరిగి అప్పగించారు. 'మా అమ్మ ఐదు రోజులపాటు ఆవుకు మేత పెట్టారు. అయితే పాలు పితికేందుకు ప్రయత్నించిన మూడుసార్లూ ఆమెను ఆవు తన్నింది. దీంతో మా అమ్మ నడుం దెబ్బతింది. మా వద్ద ఉన్న గేదెలు చాలు అని సంతృప్తి పడుతూ వెంటనే మేము ఆవును తిరిగి ఇచ్చేశాం' అని ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 51 కేజీల విభాగంలో స్వర్ణం గెలిచి జ్యోతి గులియా తెలిపింది. ఇతర బాక్సర్లు నీతు, సాక్షిలకు కూడా ఇలాంటి పరిస్థితే తలెత్తడంతో వారూ ఆవులను తిరిగిచ్చేశారు.

సింధు గెలిపించింది




- రెండు మ్యాచుల్లో నెగ్గిన తెలుగుతేజం
- సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్‌కు షాక్

చెన్నై: సింగిల్స్‌తో పాటు నిర్ణాయక మిక్స్‌డ్ డబుల్స్ పోరులోనూ చెమటోడ్చిన సింధు చెన్నై స్మాషర్స్‌ను గెలిపించింది. దీంతో ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్–3)లో చెన్నై రెండో విజయం సాధించింది. సొంతగడ్డపై శనివారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై 2–1తో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌పై గెలిచింది. పురుషుల డబుల్స్‌లో క్రిస్ అడ్‌కాక్–యంగ్ లీ (చెన్నై) 13–15, 12–15తో లీ చన్ హీ–నందగోపాల్ (అహ్మదాబాద్) చేతిలో ఓడగా, మహిళల సింగిల్స్‌లో సింధు 15–11, 10–15, 15–12తో ప్రపంచ నంబర్‌వన్ తై జుయింగ్ (అహ్మదాబాద్)పై గెలిచింది. చెన్నై పురుషుల సింగిల్స్ 'ట్రంప్' మ్యాచ్‌లో లెవెర్‌డెజ్ 15–12, 14–15, 12–15తో సౌరభ్ వర్మ చేతిలో కంగుతిన్నాడు. మరో సింగిల్స్ అహ్మదాబాద్‌కు 'ట్రంప్' కాగా... తనోంగ్సక్ (చెన్నై) 15–10, 12–15, 15–14తో ప్రణయ్‌పై గెలుపొందాడు. స్కోరు 1–1తో సమంగా నిలిచిన ఈ దశలో సుమీత్ రెడ్డితో కలిసి సింధు మిక్స్‌డ్ డబుల్స్‌లో అమీతుమీకి సిద్ధమైంది. ఇందులో చెన్నై జోడీ 15–14, 15–13తో లీ చన్ హీ–కమిల్లా రైటర్ జంటను ఓడించి జట్టును గెలిపించింది. నేడు జరిగే పోరులో హైదరాబాద్ హంటర్స్‌తో అవధ్ వారియర్స్ తలపడుతుంది.


ఆస్ట్రేలియా ఆధిపత్యం

ఉస్మాన్ ఖాజా సెంచరీ ✦ 133 పరుగుల ఆధిక్యంలో ఆసీస్



ఖాజా

సిడ్నీ: యాషెస్ సిరీస్‌లో నాలుగో విజయంపై ఆస్ట్రేలియా కన్నేసింది. ఇంగ్లండ్‌తో జరుగుతున్న చివరిదైన ఐదో టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లకు 479 పరుగులు చేసింది. 133 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. మూడో రోజు మొత్తం బ్యాటింగ్ చేసిన ఆసీస్ కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 286 పరుగులు సాధించింది. 193/2తో ఇన్నింగ్స్ కొనసాగించిన ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ ఉస్మాన్ ఖాజా (171; 18 ఫోర్లు, 1 సిక్స్), స్టీవ్ స్మిత్ (83; 5 ఫోర్లు) ఎలాంటి తడబాటు లేకుండా బ్యాటింగ్ చేశారు. ఈ క్రమంలో ఖాజా తన ఆరో టెస్టు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 188 పరుగులు జతచేసిన అనంతరం స్మిత్ వెనుదిరిగాడు. ఆ తర్వాత షాన్ మార్ష్ (98 బ్యాటింగ్; 10 ఫోర్లు)తో ఐదో వికెట్‌కు 101 పరుగులు జోడించాక ఖాజా పెవిలియన్ చేరాడు. ప్రస్తుతం షాన్ మార్ష్ అతని సోదరుడు మిచెల్ మార్ష్ (63 బ్యాటింగ్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో అండర్సన్, బ్రాడ్, మొయిన్ అలీ, క్రేన్‌లకు తలో వికెట్ దక్కింది.



ఫెడరర్, బెన్సిచ్

17 ఏళ్ల తర్వాత...

హాప్‌మన్ కప్‌లో విజేతగా నిలిచిన ఫెడరర్

మూడోసారి స్విట్జర్లాండ్‌కు టైటిల్

పెర్త్: అందరి అంచనాలను తారుమారు చేస్తూ గతేడాది రెండు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన స్విట్జర్లాండ్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ ఈ ఏడాదిలోనూ శుభారంభం చేశాడు. ప్రతిష్టాత్మక హాప్‌మన్ కప్‌లో సహచరురాలు బెలిండా బెన్సిచ్‌తో కలిసి అతను 17 ఏళ్ల తర్వాత స్విట్జర్లాండ్‌కు టైటిల్ అందించాడు. శనివారం జరిగిన ఫైనల్లో ఫెడరర్, బెన్సిచ్‌లతో కూడిన స్విట్జర్లాండ్ జట్టు 2–1తో అలెగ్జాండర్ జ్వెరెవ్, ఎంజెలిక్ కెర్బర్ సభ్యులుగా ఉన్న జర్మనీ జట్టును ఓడించింది. 30 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ టోర్నీలో స్విట్జర్లాండ్ విజేతగా నిలువడం ఇది మూడోసారి. 2001లో మార్టినా హింగిస్‌తో కలిసి ఫెడరర్ ఈ టోర్నీలో టైటిల్ నెగ్గగా... 1992లో జాకబ్ హసెక్, మాన్యుయెలా మలీవా తొలిసారి స్విట్జర్లాండ్‌ను చాంపియన్‌గా నిలబెట్టారు.

శనివారం జరిగిన ఫైనల్లో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో ఫెడరర్ 6–7 (4/7), 6–0, 6–2తో జ్వెరెవ్‌పై గెలిచి స్విట్జర్లాండ్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. మహిళల సింగిల్స్‌లో కెర్బర్ 6–4, 6–1తో బెన్సిచ్‌ను ఓడించి స్కోరును 1–1తో సమం చేసింది. నిర్ణాయక మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో ఫెడరర్–బెన్సిచ్ జోడీ 4–3 (5/3), 4–2తో కెర్బర్–జ్వెరెవ్ జంటను ఓడించి టైటిల్‌ను ఖాయం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌ను 'బెస్ట్ ఆఫ్ త్రీ' ఫాస్ట్4 టెన్నిస్ సెట్స్ పద్ధతిలో నిర్వహించారు. సెట్‌లో తొలుత నాలుగు గేమ్‌లు గెలిచిన వారికి సెట్ దక్కుతుంది. స్కోరు 3–3తో సమంగా నిలవడంతో నిబంధనల ప్రకారం ఎనిమిది పాయింట్లున్న టైబ్రేక్‌ను నిర్వహించారు. తొలుత ఐదు పాయింట్లు గెలిచిన ఫెడరర్ జంటకు తొలి సెట్ దక్కింది. రెండో సెట్‌లో ఫెడరర్ జోడీ నాలుగు గేమ్‌లు గెలిచి విజయాన్ని ఖాయం చేసుకుంది.

విలియమ్సన్ సెంచరీ: పాక్‌పై కివీస్ గెలుపు




వెల్లింగ్టన్: పాకిస్తాన్‌తో మొదలైన ఐదు వన్డేల సిరీస్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ శుభారంభం చేసింది. తొలి వన్డేలో కివీస్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 61 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారీ వర్షం వల్ల పాక్ ఇన్నింగ్స్ పూర్తిగా సాగలేదు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేపట్టిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 315 పరుగులు చేసింది. కెప్టెన్ విలియమ్సన్ (115; 8 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించాడు. గప్టిల్ (48; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), మున్రో (58; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు); నికోల్స్ (43 బంతుల్లో 50; 4 ఫోర్లు) ఆకట్టుకున్నారు. తర్వాత వర్షంతో ఆట నిలిచే సమయానికి పాకిస్తాన్ 30.1 ఓవర్లలో 6 వికెట్లకు 166 పరుగులు చేసింది. ఫఖర్ జమాన్ (82 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఒక్కడే రాణించాడు. కివీస్ బౌలర్లలో సౌతీ 3, బౌల్ట్ 2 వికెట్లు పడగొట్టారు. బలమైన ఈదురు గాలులతో వికెట్ల మీది బెయిల్స్ పదే పదే పడిపోవడంతో వాటిని తీసేసి మ్యాచ్‌ను ఆడించారు. ఇరు జట్ల మధ్య 9న రెండో వన్డే జరుగనుంది.

టాటా ఓపెన్ విజేత సిమోన్

పుణే: మూడేళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఫ్రాన్స్ టెన్నిస్ ప్లేయర్ గైల్స్ సిమోన్ కెరీర్‌లో మరో టైటిల్‌ను గెలిచాడు. భారత్‌లో జరిగే ఏకైక ఏటీపీ టోర్నీ టాటా ఓపెన్‌లో సిమోన్ పురుషుల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచాడు. అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన సిమోన్ ఫైనల్లో 7–6 (7/4), 6–2తో ప్రపంచ 14వ ర్యాంకర్ కెవిన్ అండర్సన్ (దక్షిణాఫ్రికా)ను ఓడించాడు. విజేతగా నిలిచిన సిమోన్‌కు 89,435 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 56 లక్షల 65 వేలు)తోపాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఒకప్పుడు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానంలో ఉన్న సిమోన్ ఈ టోర్నీలో అద్భుత ఆటతీరును కనబరిచాడు. రెండో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్, మూడో సీడ్ బాటిస్టా అగుట్ (స్పెయిన్)పై గెలిచిన అతను... సెమీఫైనల్లో ప్రపంచ ఆరో ర్యాంకర్, టాప్ సీడ్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా)ను మట్టికరిపించాడు. చివరిసారి సిమోన్ 2015 ఫిబ్రవరిలో మార్సెలి ఓపెన్ టైటిల్‌ను సాధించాడు. మరోవైపు డబుల్స్ ఫైనల్లో రాబిన్ హాస్–మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జంట 7–6 (7/5), 7–6 (7/5)తో సిమోన్–హెర్బర్ట్ (ఫ్రాన్స్) జోడీని ఓడించి టైటిల్‌ను దక్కించుకుంది.



భూమి @ కొత్త సాఫ్ట్‌వేర్!

- భూరికార్డుల ఆన్‌లైన్ కోసం వెబ్‌ల్యాండ్ స్థానంలో కొత్త పోర్టల్
- వారంలో టెండర్లు, రెండు నెలల్లో అందుబాటులోకి
- ఈ పోర్టల్‌లోని డేటా ఆధారంగానే భవిష్యత్తు రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు



సాక్షి, హైదరాబాద్: భూరికార్డుల ప్రక్షాళన అనంతరం సరిచేసిన రికార్డులను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేందుకు ప్రభుత్వం కొత్త సాఫ్ట్‌వేర్ తయారు చేస్తోంది. భవిష్యత్తులో భూముల క్రయ, విక్రయ లావాదేవీలను పారదర్శకంగా జరిపేందుకు వీలుగా వెబ్‌ల్యాండ్ స్థానంలో ఈ సాఫ్ట్‌వేర్‌తో కూడిన పోర్టల్‌ను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. ఇందుకు సీఎం కార్యాలయ అధికారులు ఇటీవల పలు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సమావేశం నిర్వహించి ఆమోదముద్ర వేసినట్లు సమాచారం. వారం రోజుల్లో పోర్టల్ తయారీకి సాఫ్ట్‌వేర్ సంస్థల నుంచి టెండర్లు పిలవాలని, 2 నెలల్లో అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు.

వెబ్‌ల్యాండ్.. ఇక పాత ముచ్చటే

ప్రస్తుతం రాష్ట్రంలోని భూముల వివరాలన్నీ వెబ్‌ల్యాండ్ అనే పోర్టల్‌లో నిక్షిప్తం చేశారు. ఈ డేటా ఆధారంగానే భూముల మ్యుటేషన్లు, రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఈ సాఫ్ట్‌వేర్ వల్ల మ్యుటేషన్ ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతోంది. దీంతో వెబ్‌ల్యాండ్ స్థానంలో కొత్త సాఫ్ట్‌వేర్‌తో కూడిన పోర్టల్‌ను తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల సీఎం కార్యాలయంలో సీనియర్ అధికారి టి.నర్సింగరావు నేతృత్వంలో ఐఏఎస్ అధికారులు స్మితా సబర్వాల్, వాకాటి కరుణతో పాటు రంగారెడ్డి, సిద్దిపేట జిల్లా కలెక్టర్లు రఘునందన్‌రావు, వెంకట్రామిరెడ్డి, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల జాయింట్ కలెక్టర్లు సి.నారాయణరెడ్డి, జి.రవితో సమావేశం నిర్వహించారు. అనుభవం ఉన్న సాఫ్ట్‌వేర్ కంపెనీలకు ఈ పోర్టల్ తయారీ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. మైక్రోసాఫ్ట్, ఒరాకిల్‌లాంటి కంపెనీలే టెండర్లలో పాల్గొనేలా నిబంధనలు రూపొందించారు. దీనినే భవిష్యత్తులో భూరికార్డుల నిర్వహణకు ఉపయోగించనున్నారు.

బ్యాంకులకు, జనబాహుళ్యానికి కూడా

ఈ పోర్టల్‌ను రెవెన్యూ వ్యవహారాలను పర్యవేక్షించే తహశీల్దార్ కార్యాలయాలతో పాటు రిజిస్ట్రేషన్ ఆఫీసులు, జాతీయ బ్యాంకులకు కూడా అనుసంధానం చేయనున్నారు. పంట రుణాలిచ్చే విషయంలో బ్యాంకులకు ఈ పోర్టల్‌లోని డేటానే ఆధారమయ్యేలా తయారు చేయనున్నారు. మ్యుటేషన్ ప్రక్రియ నిర్ణీత గడువులో ముగిసేలా పోర్టల్‌ను రూపొందించడంతో పాటు జన బాహుళ్యానికి కూడా సులువుగా రికార్డుల వివరాలు అందుబాటులోకి వచ్చేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించనున్నారు. ఇప్పటికే దాదాపు భూరికార్డుల ప్రక్షాళన పూర్తి కాగా, ఈ వివరాలను ఎల్ఆర్‌యూపీ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. ఇందులోని వివరాలను కొత్త పోర్టల్‌లోకి మార్చనున్నారు. ఈ పోర్టల్ తయారీకి కనీసం మరో 2 నెలల సమయం పట్టనున్న నేపథ్యంలో జనవరి 26 నుంచి చేపట్టనున్న కొత్త పాస్ పుస్తకాల జారీకి మాత్రం ఎల్ఆర్‌యూపీలో నమోదైన డేటానే ప్రామాణికంగా తీసుకోవాలని నిర్ణయించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఎకరానికి రూ.8 వేల పెట్టుబడి సాయాన్ని కొత్త పోర్టల్‌లోని డేటా ఆధారంగానే అందించే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

సింగరేణి ప్లాంట్‌ను నంబర్–1గా నిలపాలి

అధికారులకు సూచించిన సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్



సాక్షి, హైదరాబాద్: విద్యుదుత్పత్తి పరంగా మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని 1,200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని దేశంలో నంబర్–1 స్థానంలో నిలపాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ పిలుపునిచ్చారు. గత డిసెంబర్‌లో సింగరేణి ప్లాంట్ జాతీయ స్థాయిలో 4వ స్థానాన్ని సాధించడం పట్ల ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. సింగరేణి విద్యుత్ కేంద్రం అధికారులతో శనివారం ఆయన ఇక్కడ సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడిచిన 9 నెలల కాలానికి 90 శాతం సగటు పీఎల్ఎఫ్‌కు విద్యుత్ ప్లాంట్ ఎదిగిందని, తద్వారా దేశంలోని 25 అత్యుత్తమ ప్లాంట్ల జాబితాలో 4వ స్థానం సాధించిందన్నారు. మిగిలిన 3 నెలల్లో కూడా మంచి సామర్థ్యంతో పనిచేసి మెరుగైన పీఎల్ ఎఫ్ సాధించి విద్యుత్ ప్లాంట్‌ను దేశంలోనే నంబర్ 1గా నిలపాలని అధికారులను కోరారు. ప్లాంటు ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ 10,658 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేశామని, వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందిస్తున్న నేపథ్యంలో పూర్తి సామర్థ్యంతో ప్లాంటు నుంచి విద్యుదుత్పత్తి జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సోలార్ ప్లాంటు ఏర్పాటుకు ఆదేశం..

సింగరేణి వ్యాప్తంగా సోలార్ థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలను వేగవంతంగా పూర్తి చేయాలని శ్రీధర్ అధికారు లను ఆదేశించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్టులో 10 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పా టు చేయాలని, సంబంధిత పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.

105 ప్రపంచ భాషల్లో 7.20 గంటల పాటు..

నిర్విరామంగా పాటలు పాడిన రాహత్



రాహత్

విజయవాడ కల్చరల్: విజయవాడకు చెందిన మల్లాది రాహత్ అద్భుత ప్రతిభ చాటాడు. 105 ప్రపంచ భాషల్లో 105 పాటలను 7 గంటల 20 నిమిషాల పాటు నిర్విరామంగా ఆలపించాడు. అందులో భారతీయ భాషలు 36 ఉండటం విశేషం. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో అధికారిక నమోదు కోసం గాంధీనగర్‌లోని శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు కూచిపూడి నాట్యారామం చైర్మన్ కూచిభొట్ల ఆనంద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గిన్నిస్ నియమాల ప్రకారం 4 గంటల అనంతరం 5 నిమిషాలు విరామం తీసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించి, గజల్ శ్రీనివాస్ పేరుతో ఉన్న రికార్డును రాహత్ బద్దలు కొట్టాడు. ఈ కార్యక్రమానికి విద్యావేత్త ఎం.సి.దాస్, భారతీయ విద్యాభవన్ ప్రతినిధి పార్థసారథి సాక్షులుగా వ్యవహరించారు. గీతాలపన కార్యక్రమాన్ని ప్రత్యేక యూనికోడ్ ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థకు అందించారు. రాహత్ తండ్రి అనిల్ కుమార్ మాట్లాడుతూ రెండు వారాల అనంతరం గిన్నిస్ బుక్ ప్రతినిధుల నుంచి నమోదు పత్రం అందుతుందని తెలిపారు. గతంలో గజల్ శ్రీనివాస్ 75 భాషల్లో పాటలు పాడి రికార్డు నెలకొల్పారని, రాహత్ 105 భాషల్లో గీతాలు ఆలపించి దాన్ని అధిగమించారని చెప్పారు. కార్యక్రమంలో కొచ్చర్లకోట చారిటబుల్ ట్రస్ట్ సభ్యురాలు కొచ్చర్లకోట లక్ష్మీపద్మజ, సినీ సంగీత దర్శకుడు వీణాపాణి, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

స్వీట్ ఫెస్టివల్ వెబ్‌సైట్ ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌కు అనుబంధంగా ఈ నెల 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మొదటి అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి తెలిపారు. శనివారం ఆయన సచివాలయంలో అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్ వెబ్ సైట్, మొబైల్ అప్లికేషన్‌ను టూరిజం, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో కలసి ఆవిష్కరించారు. ప్రపంచంలో మొట్టమొదటి సారిగా స్వీట్ ఫెస్టివల్‌కు హైదరాబాద్ వేదిక కాబోతుందన్నారు. ఈ ఫెస్టివల్లో 15 దేశాలు, 25 రాష్ట్రాల ప్రజలు తయారు చేసిన 1000 పైగా స్వీట్లను సందర్శకులకు అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. సందర్శకుల నుంచి ఎటువంటి రుసుం వసూలు చేయటం లేదన్నారు. ఫెస్టివల్ ద్వారా హైదరాబాద్ స్వీట్స్ హబ్‌గా మారటంతో పాటు అంతర్జాతీయంగా పర్యాటకులను ఆకర్షించవచ్చని వెల్లడించారు.







Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District.; Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.